www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

## కేజ్రీ కోసం కుర్చీ ఖాళీగా..

రామాయణంలో భరతుడిలా పాలిస్తా!

ఢిల్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆతిశీ వ్యాఖ్యలు

2



మంగళవారం | 24-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 178 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి మ. 12.39 తదుపరి అష్టమి; నక్షత్రం: మృగశిర రా. 9.54 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ.8.31-9.19, రా.10.02-10.49; అమృతఘడియలు: మ.1.10-2.45; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.05 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

# ఘాటెక్కిన ఉల్లి!



## 15 రోజుల్లో ధర రెట్టింపు

సగటున కిలో రూ.60.. ఆదిలాబాద్‌లో రూ.80

మహారాష్ట్ర, కర్నూలు నుంచి తగ్గిన సరుకు సరఫరా

4.7 లక్షల టన్నుల బఫర్ స్టాక్ విడుదలచేసిన కేంద్రం

ఎగుమతులపై నిషేధం ఎత్తివేతే కారణమా?

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉల్లి ఘాటు రాష్ట్రానికీ తాకింది. నెల రోజులుగా ఉల్లి ధర గణనీయంగా పెరుగుతుండగా.. గడిచిన 15 రోజుల్లో రెట్టింపైంది. ప్రస్తుతం రాష్ట్రంలో కిలో ఉల్లిగడ్డల ధర సగటున రూ.60గా ఉంది. జిల్లాల వారీగా చూస్తే లభ్యత, డిమాండ్‌ను బట్టి ధరల్లో వ్యత్యాసాలున్నాయి. ఆదిలాబాద్‌లో ఏకంగా కిలో ఉల్లి రూ.80కి ఎగబాకింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే.. మరోవారంలో ఉల్లి ధర సెంచరీ కొట్టే అవకాశాలున్నాయని మార్కెట్ వర్గాలు ఆందోళనచెందుతున్నాయి. మహారాష్ట్ర కర్నూలు నుంచి ఉల్లిగడ్డల సరఫరా తగ్గడమే ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. కర్నూలులో ఉల్లి విస్తీర్ణం 75 వేల ఎకరాల నుంచి 20 వేల ఎకరాలకు పడిపోవడంతో.. దిగుబడి తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మహారాష్ట్రలోనూ అకాల వర్షాలతో పంటనష్టం జరిగినట్లు తెలుస్తోంది. సరఫరా తగ్గడం.. డిమాండ్ పెరగడంతో రాష్ట్రంలో ధరలు అమాంతం పెరుగుతున్నట్లు మార్కెటింగ్ శాఖ

> ఉల్లి ధరలు పెరుగుతుండడంతో.. హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగాన్ని తగ్గిస్తున్నారు. సలాడ్లలోనూ కీరా, నిమ్మకాయ ముక్కలతో సరిపెడుతున్నారు. గ్రేవీ, ఇతర వంటకాల్లోనూ ఉల్లి కనిపించడం లేదు. రెస్టారెంట్లు అదనపు చార్జీలు వసూలు చేస్తున్నాయి.

మిగతా 13వ పేజీలో...

# బాధ్యులు ఇంజనీర్లు

## ప్రాథమికంగా 20 మంది గుర్తింపు.. వీరిలో ఏఈఈ నుంచి ఈఎన్సీ వరకూ!

మేడిగడ్డ కుంగుబాటుపై క్రమశిక్షణ చర్యలు

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ యోచన

ఉద్దేశపూర్వకంగానే విచారణను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించారని గుర్తింపు


విజిలెన్స్ మధ్యంతర నివేదికలో ఇదే ప్రస్తావన

నెలాఖరుకు పూర్తిస్థాయి నివేదిక ఇచ్చే చాన్స్

విచారణకు కాగ్ అధికారిని పిలవాలని నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు ప్రాథమికంగా ఇంజనీర్లను బాధ్యులను చేయనున్నారా!? ఇప్పటి వరకూ పూర్తయిన విచారణ ప్రకారం.. ఏఈఈ నుంచి ఈఎన్సీ వరకూ దాదాపు 20 మంది ఇంజనీర్లపై చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి కమిషన్ వర్గాలు! పలువురు ఇంజనీర్ల అవినీతి, అలసత్వం బ్యారేజీల వైఫల్యానికి కారణమని భావిస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే, విచారణను తప్పుదోవ పట్టించిన, నేరపూరితంగా వ్యవహరించిన ఇంజనీర్లపై క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేసే యోచనలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఉంది. అవినీతి నిరోధక చట్టం కింద వీరిపై క్రిమినల్ కేసుల నమోదుకు ప్రభుత్వానికి సిఫారసు చేయాలని యోచిస్తోంది. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుతో ముడిపడిన కేసులో ఉన్న ఇంజనీర్లపై కఠిన చర్యలకు ఉపక్రమించాలని, వీరికి పదోన్నతులు కూడా ఇవ్వరాదంటూ ప్రభుత్వానికి లేఖ రాయాలని యోచిస్తున్నట్లు సమాచారం. కొంతమంది ఇంజనీర్లు ఉద్దేశపూర్వకంగానే విచారణను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించారని కమిషన్ ఇప్పటికే గుర్తించింది. ఇందులో

మిగతా 13వ పేజీలో...



## పట్టా కోసం డిగ్రీ.. పొట్టకూటి కోసం మినీ డిగ్రీ!

13

సరికొత్త కోర్సులను తెస్తున్న ప్రభుత్వం

విద్యార్థులకు ఉద్యోగం గ్యారంటీ

ఫైనాన్స్, బీమాలో నైపుణ్య శిక్షణ..

18 ఇంజనీరింగ్, 20 డిగ్రీ కాలేజీల్లో 10 వేల మంది విద్యార్థులకు ట్రైనింగ్

ఈ విద్యా సంవత్సరం నుంచే అమల్లోకి

రేపు ప్రారంభించనున్న సీఎం రేవంత్

## సంక్షేమ పథకాలన్నీ డిజిటల్ కార్డుతోనే!

13

అమలవుతున్న రాష్ట్రాల్లో అధ్యయనం.. కార్డులపై సీఎం సమీక్ష

ప్రతి నియోజకవర్గంలో ఒక పట్టణ, గ్రామీణ ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టు

డిజిటల్ కార్డులో కుటుంబంలోని ప్రతి సభ్యుడి హెల్త్ ప్రొఫైల్: రేవంత్

12

### జిల్లా కేంద్రాల్లో డీసీసీ కార్యాలయాలకు స్థలాలు!

వారంలోగా కలెక్టర్లకు దరఖాస్తులివ్వాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి సూచన



10

## ఆస్కార్ బరికి.. లాపతా లేడీస్

భారత్ నుంచి అధికారిక ఎంట్రీగా ఎంపిక

తెలుగు సహా పలు భాషలకు చెందిన 29 చిత్రాల నుంచి షార్ట్ లిస్ట్



## చైల్డ్ పోర్న్ చూడడం నేరమే

డౌన్‌లోడ్ చేసి భద్రపరచుకోవడమూ పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం శిక్షార్హమే

సర్వోన్నత న్యాయస్థానం సంచలనతీర్పు

మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు కొట్టివేత

చైల్డ్ పోర్న్ డౌన్లోడ్ చేసిన యువకుడిపై క్రిమినల్ కేసు పునరుద్ధరణకు ఆదేశాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: చిన్నపిల్లల నీలిచిత్రాలను (చైల్డ్ పోర్న్) చూడడం, డౌన్‌లోడ్ చేసి భద్రపరచుకోవడం పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్టాల కింద నేరమేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. చైల్డ్ పోర్న్ కంటెంట్‌ను ఇతరులకు పంపించే ఆలోచన లేకుండా కేవలం ఫోన్‌లో భద్రపరచుకోవడం పోక్సో, ఐటీ చట్టాల కింద నేరం కాదంటూ ఈ ఏడాది జనవరిలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఘోర తప్పిదంగా అభివర్ణించింది. అసలు చిన్నపిల్లల నీలిచిత్రాలను చూడడం అనే చర్యలోనే.. చిన్నపిల్లలను లైంగికంగా వాడుకోవాలన్న కోరిక

మిగతా 2వ పేజీలో...

# అదే సందిగ్ధం!

## వైద్య విద్య ప్రవేశాలపై ముందుకు పడని అడుగు

అధికారుల నిర్లక్ష్య ధోరణే కారణం.. సుప్రీంకోర్టు తీర్పు వచ్చి ఇప్పటికే 4 రోజులు

స్థానికత మార్గదర్శకాల విడుదల జాప్యం.. కౌన్సెలింగ్‌కు ఆఖరి గడువు అక్టోబరు 31

వారానికో రౌండ్ నిర్వహించినా పూర్తి కావడం కష్టమే.. ఆగ్రహంగా విద్యార్థులు



హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య ప్రవేశాలపై సుప్రీంకోర్టు తీర్పు వచ్చి 4 రోజులవుతున్నా.. రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల సాగదీత ధోరణి కారణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికతపై సర్కారు ఇచ్చిన జీవో 33పై హైకోర్టులో వ్యాజ్యం దాఖలు కాగా.. స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. దానిపై రాష్ట్ర సర్కారు సుప్రీం కోర్టుకు అప్పీల్‌కు వెళ్లింది. సుప్రీం కోర్టు కూడా హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు కౌన్సెలింగ్‌లో అవకాశం

మిగతా 14వ పేజీలో...

## ఆర్ఆర్ఆర్‌కు వరల్డ్ బ్యాంక్ నిధులు

12

ఇతర రోడ్ల అభివృద్ధికి కూడా..

దక్షిణభాగం అలైన్‌మెంట్ ఖరారు కోసం రంగంలోకి కమిటీ

స్మార్ట్, ఇంటెలిజెన్స్ ట్రాఫిక్ రోడ్లు

ఫ్యూచరిస్టిక్ ఆటోమేటెడ్ కన్‌స్ట్రక్షన్ విధానంలో నిర్మిస్తాం

ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో మంత్రి కోమటిరెడ్డి భేటీ



# మానవత్వంతోనే విజయం

## ఉగ్రవాదంతో ప్రపంచ శాంతికి ముప్పు

సైబర్, మారిటైమ్, అంతరిక్షం విషయంలో.. సవాళ్లు, ముప్పును ఉమ్మడిగా ఎదుర్కొందాం

భారత్‌లో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధిస్తున్నాం

ఈ విజయాల్ని ప్రపంచంతో పంచుకుంటాం

ఐరాస సర్వసభ్య సమావేశంలో మోదీ

'ఒక భూగోళం.. ఒక కుటుంబం.. ఒక భవిష్యత్'పై నినాదం

2

పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్‌తో మోదీ భేటీ

దిగ్గజ కంపెనీల సీఈవోలతో సమావేశం

> యుద్ధాలతో కాదు.. సమష్టి శక్తి, మానవత్వంతోనే విజయం సాధ్యం. భారత్ ఇదే సిద్ధాంతాన్ని విశ్వసిస్తుంది. మానవాళి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రపంచనేతల చర్యలు ఉండాలి. టెక్నాలజీ దుర్వినియోగం కాకుండా నియంత్రణ ఉండాలి. భద్రత, బాధ్యతతో కూడిన వినియోగం అవసరం. డిజిటల్ ప్రజావనరులను మంచికే వినియోగించాలి. భారత్ తన డిజిటల్ వనరులను ప్రపంచంతో పంచుకునేందుకు సిద్ధంగా ఉంది. ఒక భూగోళం.. ఒక కుటుంబం.. ఒక భవిష్యత్' అనే నినాదానికి మేం కట్టుబడి ఉన్నాం. అందుకే.. 'ఒక భూగోళం.. ఒక ఆరోగ్యం', 'ఒక సూర్యుడు.. ఒక గ్రిడ్' దిశగా సాగుతున్నాం.
>
> - ప్రధాని నరేంద్ర మోదీ

## సర్దుబాటుతో 4 వేల మంది టీచర్ల బదిలీ!

కసరత్తు ప్రారంభించిన విద్యా శాఖ

ఉపాధ్యాయుల నుంచి ఆప్షన్లు!

14

28న ప్రక్రియ షురూ.. వారంలో పూర్తి

దసరా తర్వాత కొత్త పోస్టింగ్‌లోకి..



## తిరుమలలో సంప్రోక్షణ

14

శ్రీవారి లడ్డూ నెయ్యిలో కల్తీకి పరిహారం

లడ్డూ, నెయ్యి నిల్వకేంద్రాల్లో కుంభప్రోక్షణ

ప్రసాదాలు, నైవేద్యాలకు దోషాలుండవు

ప్రధాన అర్చకుడు, ఈవో స్పష్టీకరణ

## అధికార పార్టీకి కొమ్ముకాస్తే.. ఏపీ పోలీసుల గతే

ఆంధ్రాలో జరుగుతున్నది చూడండి

రాష్ట్ర పోలీసులూ తీరు మార్చుకోండి!

22 రోజులైనా సాగర్ గండ్లు పూడ్చరే!

రామచంద్రా.. రేవంత్‌ను క్షమించి, రైతులను కాపాడు: హరీశ్

12

## తెల్లవార్లూ హైడ్రా కూల్చివేతలు

పటాన్‌చెరు కిష్టారెడ్డిపేటలో అర్ధరాత్రి 3 భవనాలు నేలమట్టం చేసిన హైడ్రా

పటేల్‌గూడలో 24 ఇళ్ల కూల్చివేత

మాదాపూర్ కావూరిహిల్స్‌లో పార్కు స్థలంలో జిమ్ నేలమట్టం

3





గాంధీ ఆస్పత్రి వద్ద పోలీసులతో సంజయ్, మాగంటి వాగ్వాదం

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టు

మాతాశిశు మరణాల వివరాలకు గాంధీ ఆస్పత్రికి

నిజనిర్ధారణ కమిటీగా వెళ్లిన మాగంటి, సంజయ్

లోపలికి రానివ్వని పోలీసులు.. రోడ్డుపై నిరసన

అదుపులోకి తీసుకొని గోషామహల్ తరలింపు

ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్దే రాజయ్య అదుపులోకి

కాంగ్రెస్ అరాచకాలకు భయపడం: కేటీఆర్

12

ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇంటి వద్ద రచ్చ

## సన్నం, దొడ్డు వడ్లు వేర్వేరుగా కొనుగోలు

అక్టోబరు మొదటివారం నుంచే ఖరీఫ్ ధాన్యం సేకరణ


7,139 కేంద్రాలు.. 91 లక్షల టన్నుల ధాన్యం అంచనా

సన్నాలకు ఈ సీజన్ నుంచే రూ.500 బోనస్

బకాయిలున్న మిల్లర్లకు ధాన్యాన్ని ఇచ్చేది లేదు

పొరుగు రాష్ట్రాల నుంచి రాకుండా చెక్‌పోస్టులు

జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీ: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సన్న వడ్లు, దొడ్డు వడ్లకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యాచరణ ప్రణాళికను కూడా సిద్ధం చేసింది. వచ్చే జనవరి నుంచి ప్రజాపంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా సన్నబియ్యం పంపిణీకి సమాయత్తమవుతున్న ప్రభుత్వం.. ఈ సారి అక్టోబరు మొదటి వారం నుంచే ధాన్యం సేకరణను ప్రారంభించాలని భావిస్తోంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 7,139 కొనుగోలు

మిగతా 13వ పేజీలో...



## దద్దరిల్లిన లెబనాన్

ఇజ్రాయెల్ భీకర దాడుల్లో 356 మంది మృతి

1000 మంది పైగా తీవ్ర గాయాలపాలు

హిజ్బుల్లా అడ్డాలే లక్ష్యంగా దూకుడు

300కు పైగా లక్ష్యాలపై రాకెట్ల వర్షం

వేలాది వాహనాల్లో తరలిపోయిన ప్రజలు

మరో గాజాలా లెబనాన్: ఐరాస

2

## బద్లాపూర్ స్కూల్ పిల్లలపై రేప్ కేసు నిందితుడు సోమవారం ఎన్‌కౌంటర్‌లో మృతి

ముంబై, సెప్టెంబరు 23: మహారాష్ట్రలో సంచలనం సృష్టించిన బద్లాపూర్ పాఠశాలలో జరిగిన అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న అక్షయ్ షిండే సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. బద్లాపూర్‌లోని ప్రైవేటు పాఠశాలలో క్లీనర్‌గా పనిచేసే అతడు ఆగస్టు 12న నాలుగు, అయిదేళ్ల వయసు ఉన్న ఇద్దరు బాలికలను మరుగుదొడ్ల వద్దకు తీసుకువెళ్లి అత్యాచారం చేసినట్టు కేసు నమోదయింది. దీనిపై ప్రజాగ్రహం వెల్లువెత్తడంతో ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. విచారణ నిమిత్తం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో బద్లాపూర్ నుంచి తాలోజా జైలుకు పోలీసు వాహనంలో తీసుకొని వెళ్తుండగా ఎన్‌కౌంటర్ జరిగింది. నిందితుడు అక్షయ్ షిండే ఆకస్మికంగా ఓ అధికారి చేతిలో ఉండే తుపాకీని లాక్కొని కాల్పులు జరిపినట్టు పోలీసులు తెలిపారు. వెంటనే ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురు కాల్పులు జరపగా అతడు తీవ్రంగా గాయపడ్డట్టు చెప్పారు. అనంతరం ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రాణాలు కోల్పోయినట్టు వివరించారు ఈ సంఘటనలో ఏఎస్ఐ నీలేష్ మోరే, ఇన్‌స్పెక్టర్ సంజయ్ షిండేలు గాయపడ్డారు. సంజయ్ షిండే జరిపిన కాల్పుల్లోనే నిందితుడు అక్షయ్ షిండే ప్రాణాలు కోల్పోయాడు. ఇన్‌స్పెక్టర్ షిండే గతంలో దావూద్ ఇబ్రహీం సోదరుడు ఇక్బాల్ కస్కర్ అరెస్టులో కీలకంగా వ్యవహరించారు. ఈ ఎన్‌కౌంటర్‌పై రాజకీయ దుమారం చెలరేగింది. ఇది కట్టుకథ అని శివసేన(ఠాక్రే) నేత ప్రియాంక చతుర్వేది ఆరోపించారు. ఈ కేసులో పాఠశాల చైర్మన్, కార్యదర్శి సహా నిందితులుగా ఉన్నారని, వారు బీజేపీ నాయకులని తెలిపారు. వారిపై పోక్సో కేసు నమోదైనా తప్పించుకు తిరుగుతున్నారన్నారు.

## కేరళ వ్యక్తిలో క్లేడ్- బీ రకం మంకీపాక్స్ వైరస్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: కేరళకు చెందిన యువకుడికి సోకిన మంకీపాక్స్ వైరస్ ప్రపంచ ఆరోగ్య అత్యయిక స్థితికి దారితీసిన క్లేడ్-1బీ రకం స్ట్రెయిన్‌గా వైద్యులు నిర్ధారించారు. ఈ రకం స్ట్రెయిన్‌కు సంబంధించి భారత్‌లో నమోదైన తొలి కేసు ఇదేనని వారు తెలిపారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. బాధితుడు (38) ఇటీవల యూఏఈ నుంచి తిరిగొచ్చాడు. గతవారం అతడికి వైరస్ నిర్ధరణ అయింది. కాగా, సెప్టెంబరు 9వ తేదీన ఢిల్లీలో దేశంలో తొలి మంకీపాక్స్ కేసు నమోదైంది. విదేశాల నుంచి తిరిగొచ్చిన ఓ యువకుడి నమూనాలు పరీక్షించగా, అతనికి పశ్చిమ ఆఫ్రికాలో వ్యాప్తిలో ఉన్న క్లేడ్-2 రకం వైరస్ సోకినట్లు నిర్ధారితమైంది.

## టైఫాయిడ్ యాంటిబయాటిక్స్‌కు లొంగట్లేదు!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: అవసరం ఉన్నా.. లేకపోయినా యాంటిబయాటిక్స్‌ను వాడటం వల్ల మనుషుల్లో యాంటిమైక్రోబియల్ నిరోధకత(ఏఎంఆర్-యాంటిబయాటిక్స్‌ను ఎక్కువగా వాడటం వల్ల శరీరంలోని సూక్ష్మజీవులు వాటికి అలవాటుపడిపోయి నశించకుండా ఉండిపోవడం) పెరిగి మూత్రకోశ వ్యాధులు, బ్లడ్ ఇన్ఫెక్షన్లు, న్యుమోనియా, టైఫాయిడ్ లాంటి వ్యాధులకు చికిత్స కష్టం అవుతోందని ఐసీఎంఆర్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యాధులు బాక్టీరియా వల్ల కలిగేవే అయినప్పటికీ సాధారణ యాంటిబయాటిక్స్‌కు ఇవి లొంగడం లేదని వివరించింది. ఐసీఎంఆర్‌కే చెందిన యాంటిమైక్రోబియల్ నిరోధక నిఘా విభాగం(ఏఎంఆర్ఎస్ఎన్) తన వార్షిక నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. 2023లో జనవరి 1 నుంచి డిసెంబరు 31మధ్యలో దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో 99,492మందిపై అధ్యయనం నిర్వహించి నివేదికను రూపొందించారు.

## నాలుగోసారి గ్యారెంటీ లేదు కానీ.. అథవాలే మాత్రం మళ్లీ కేంద్రమంత్రి అవుతారు

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సరదా వ్యాఖ్యలు

నాగ్‌పూర్, సెప్టెంబరు 23: కేంద్రంలో తాము వరుసగా నాలుగోసారి అధికారం చేపడతామన్న గ్యారెంటీ లేనప్పటికీ, తన క్యాబినెట్ సహచరుడు రాందాస్ అథవాలే మాత్రం మరోసారి మంత్రి అవ్వడం ఖాయమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చమత్కరించారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, అది కేవలం జోక్ అని అనంతరం గడ్కరీ పేర్కొనడం గమనార్హం. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) నాయకుడైన అథవాలే కేంద్రంలోని మోదీ ప్రభుత్వాల్లో వరుసగా మూడుసార్లు మంత్రి పదవి చేపట్టారు. మరోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే గనుక నాలుగోసారీ కేంద్ర మంత్రిగా తన పరంపర కొనసాగుతుందని ఈ కార్యక్రమంలో అథవాలే విశ్వాసం వ్యక్తం చేయగా, గడ్కరీ పైవిధంగా స్పందించారు.

## ఆధారాలు చూపండి.. లేదా క్షమాపణ చెప్పండి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: బీజేపీ ఎంపీ, సినీ నటి కంగనా రనౌత్ కాంగ్రెస్ పార్టీపై చేసిన ఆరోపణలపై ఆ పార్టీ తీవ్రంగా స్పందించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం విపత్తు సహాయ నిధులను కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి అక్రమంగా అప్పగించిందని కంగన ఆరోపించారు. ఈ ఆరోపణలను వారం రోజుల్లో నిరూపించాలని, లేదంటే క్షమాపణ చెప్పాలని హిమాచల్‌ప్రదేశ్ ప్రజా పనుల శాఖ మంత్రి విక్రమాదిత్య సింగ్ డిమాండ్ చేశారు. లేదంటే పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. రైతులపై ఆమె చేసిన వ్యాఖ్యలకు సొంత పార్టీనే మందలించిందని, కంగన తెలివి తక్కువతనానికి అదో నిదర్శనం అన్నారు.

## సెక్యులరిజమ్ యూరోపియన్ భావన!

- తమిళనాడు గవర్నర్ రవి వివాదాస్పద వ్యాఖ్యలు

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సెక్యులరిజమ్ యూరోపియన్ భావన, భారతదేశానికి దాని అవసరమే లేదంటూ తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి చేసిన వ్యాఖ్యలు తమిళనాట తీవ్రదుమారాన్ని రేపాయి. కన్నియాకుమారిలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ భారతీయులకు వ్యతిరేకంగా అనేక మోసాలు జరిగాయని, వాటిలో లౌకికవాదానికి తప్పుడు వివరణ కూడా ఒకటని అన్నారు. సెక్యులరిజమ్ భారతీయ భావన కాదని, యూరోపియన్ భావన అని.., ఐరోపాలో చర్చిల నిర్వాహకులకు, రాజుకు మధ్య పోరాటాలు జరగటంతో ఆ చోట సెక్యులరిజమ్ పుట్టిందన్నారు. భారతదేశం ఎల్లప్పుడూ ధర్మాన్ని ఆచరిస్తుందని, కనుక సెక్యులరిజమ్ అవసరమేలేదన్నారు. గవర్నర్ చేసిన ఈ వ్యాఖ్యలపై తమిళ రాజకీయ నేతలు మండిపడ్డారు. విరుదునగర్ కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ స్పందిస్తూ లౌకికవాదంపై గవర్నర్ రవి వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కావని, భారత రాజ్యాంగ ధర్మాసనానికి విరుద్ధమైనవని తన ఎక్స్‌పేజీలో పేర్కొన్నారు.

## నైట్ డ్యూటీ కోసం రైల్వే ఉద్యోగుల డ్రామా

- ఫిష్ ప్లేట్లు తొలగించిన ఘటనలో ముగ్గురి అరెస్టు

సూరత్, సెప్టెంబరు 23: ఇటీవల గుజరాత్‌లోని సూరత్‌లో రైలు పట్టాల బోల్టులు, ఫిష్ ప్లేట్లు తొలగించిన ఘటనలో రైల్వే ఉద్యోగులే నిందితులని తేలింది. వారే ట్యాంపరింగ్‌కు పాల్పడి, వారే కుట్ర జరిగిందని పై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పోలీసుల విచారణలో బయటపడింది. ఈ ఘటనలో ట్రాక్‌మన్లుగా పనిచేస్తున్న సుభాశ్ పొద్దార్, మనీశ్ మిస్త్రీ, శుభం జైస్వాల్ అనే ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కుట్రను భగ్నం చేశామన్న ప్రశంస దక్కుతుందనే దురుద్దేశంతోనే దుశ్చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. అలా చేస్తే ముగియనున్న తమ నైట్ డ్యూటీలు పొడిగిస్తారని, అప్పుడు పగలంతా కుటుంబంతో జాలీగా గడపొచ్చని నిందితులు భావించినట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.

## కాస్త ముందంజలో కమలా హారిస్

వాషింగ్టన్, సెప్టెంబరు 23: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్, రిపబ్లికన్ పార్టీకి చెందిన డొనాల్డ్ ట్రంప్‌ల మధ్య హోరాహోరీగా పోటీ నెలకొంది. ప్రజాదరణ కమలా హారిస్‌కే కాస్త అధికంగా ఉన్నట్టు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఫలితాలను నిర్ణయించే కీలక రాష్ట్రాల్లో మాత్రం నువ్వా నేనా అన్న పరిస్థితి ఉండడంతో ఉత్కంఠ నెలకొంది. ఎన్‌బీసీ న్యూస్ సంస్థ తాజాగా 1,000 మంది రిజిస్టర్డ్ ఓటర్లతో సర్వే నిర్వహించింది. ఇందులో 49% మంది కమలకు, 44% మంది ట్రంప్‌నకు అనుకూలంగా ఓటు వేస్తామని తెలిపారు. సర్వేలో 5 పర్సంటేజ్ పాయింట్ల వరకు హెచ్చుతగ్గులు ఉండవచ్చని ఆ సంస్థ ప్రకటించింది. దాంతో కమలవైపు కాస్త మొగ్గు కనిపిస్తున్నా ఫలితాలను అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. సీబీఎస్/ఐపోస్ సంస్థ 3,129 మంది రిజిస్టర్డ్ ఓటర్లతో సర్వే జరిపింది. ఈ సర్వే కూడా కమలకే అనుకూలంగా ఉంది. ఆమెకు 52% మంది, ట్రంప్‌నకు 48% మంది మద్దతు తెలిపారు. అమెరికా అధ్యక్ష ఫలితాలను నిర్ణయించే ఏడు స్వింగ్ రాష్ట్రాల్లో కమలా హ్యారిస్‌కు కాస్త మొగ్గు ఉన్నట్టు సర్వేల్లో కనిపిస్తున్నా వాస్తవానికి తీవ్రమైన పోటీ నెలకొంది.

# మానవత్వంతోనే విజయం.. యుద్ధాలతో కాదు

## ప్రపంచ శాంతికి ఉగ్రవాదంతో పెను ముప్పు



పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్‌తో మోదీ

- ఐరాస సర్వసభ్య సమావేశంలో ప్రధాని
- పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్‌తో భేటీ

న్యూయార్క్, సెప్టెంబరు 23: సమష్టి శక్తి, మానవత్వంతోనే విజయం సాధ్యమని.. యుద్ధాలతో కాదని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. భారత్ ఇదే సిద్ధాంతాన్ని విశ్వసిస్తుందని వివరించారు. ప్రపంచ మానవాళి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రపంచనేతల చర్యలు ఉండాలని అభిప్రాయపడ్డారు. సోమవారం ఆయన ఐక్య రాజ్య సమితి(ఐరాస) సర్వసభ్య సమావేశంలో ప్రసంగించారు. ప్రపంచ దేశాలు భవిష్యత్ గురించి మానవ-కేంద్ర విధానాలను అనుసరించాలని పేర్కొంటూ.. 'ఒక భూగోళం.. ఒక కుటుంబం.. ఒక భవిష్యత్' అని నినదించారు. "మానవ చరిత్రలోనే అతిపెద్ద ఎన్నికల క్రతువు ఇటీవల భారత్‌లో ముగిసింది. ప్రజలు మాకు మూడోసారి అధికారమిచ్చారు. మేం గడిచిన పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చాం. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధిస్తూ.. పేదరికం, మానవాభివృద్ధి, పేదల సంక్షేమం, ఆహార పంపిణీ అనే అంశాలపై ప్రధానంగా దృష్టిసారించడం వల్ల ఈ ఘనత సాధ్యమైంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచ శాంతి, భద్రత పాలిట ఉగ్రవాదం పెనుముప్పుగా మారిందని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్, మారిటైమ్, అంతరిక్ష రంగాల్లో కొత్త సవాళ్లు, ముప్పులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. "టెక్నాలజీ దుర్వినియోగం కాకుండా నియంత్రణ ఉండాలి. భద్రత, బాధ్యతతో కూడిన వినియోగం అవసరం. డిజిటల్ ప్రజావనరులను మంచికే వినియోగించాలి" అని పేర్కొన్నారు. 'ఒక భూగోళం.. ఒక కుటుంబం.. ఒక భవిష్యత్' అనే నినాదానికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. అందుకే.. 'ఒక భూగోళం.. ఒక ఆరోగ్యం', 'ఒక సూర్యుడు.. ఒక గ్రిడ్' దిశగా సాగుతున్నామన్నారు. ప్రపంచాన్ని సుసంపన్నం చేసేందుకు భారత్ తన ఆలోచనలను నిబద్ధతతో పంచుకుంటుందని వివరించారు.

### మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతాం

భారత్ మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. అమెరికా దిగ్గజ కంపెనీల సీఈవోలతో ఆయన ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎంఐటీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆ విద్యా సంస్థ ప్రొఫెసర్ అనంత చంద్రశేఖరన్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పలు సంస్థల సీఈవోలు సుందర్‌పిచాయ్(గూగుల్), జెన్సెన్ హంగ్(ఎన్‌విడియా), శంతను నారాయణ్(అడోబ్), లిసా సు(ఏఎండీ), అర్వింద్ కృష్ణ(ఐబీఎం), ఎన్రిక్ లోర్స్(హెచ్‌పీ) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఐదో ఆర్థిక శక్తిగా ఉన్న భారత్.. 3.9 ట్రిలియన్ డాలర్ల జీడీపీకి చేరుకున్నట్లు వివరించారు. 7% వృద్ధి రేటును స్థిరంగా కొనసాగిస్తూ.. త్వరలో 5 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కృత్రిమ మేధ(ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్ టెక్నాలజీల్లో భారత్‌కు సహకరించాలని కంపెనీల సీఈవోలను కోరారు.

### యుద్ధం ముగియాలి.. శాంతి నెలకొనాలి

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం ముగిసి, గాజాలో శాంతి నెలకొనాలని మోదీ ఆకాంక్షించారు. న్యూయార్క్‌లోని పాలెస్ హోటల్‌లో పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్‌తో జరిగిన భేటీ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. గాజాలో మానవతాసాయానికి భారత్ తన వంతు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఐరాస అనుబంధ సంస్థ యూఎన్ఆర్‌డబ్ల్యూఏ ద్వారా రూ.21 కోట్ల(2.5 మిలియన్ డాలర్లు) విలువైన సాయాన్ని అందించామని గుర్తుచేశారు. గాజాలో ప్రస్తుత పరిస్థితులు, మానవ సంక్షోభం, భద్రతపై మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. భారత్-పాలస్తీనా స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరువురు నేతలు ఆకాంక్షించినట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి జైస్వాల్ వెల్లడించారు.

### నేపాల్‌కు రండి.. మోదీకి ఓలి ఆహ్వానం

ప్రధాని మోదీని నేపాల్ రావాల్సిందిగా ఆ దేశ ప్రధాన మంత్రి కేపీ శర్మ ఓలి ఆహ్వానించారు. ఐరాస సర్వసభ్య సమావేశం సందర్భంగా ఇరువురు నేతలు న్యూయార్క్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నేపాల్‌కు రావాల్సిందిగా ఓలి ఆహ్వానించగా.. మోదీ సమ్మతించారు. మరోవైపు కువైత్ యువరాజు షేక్ సబా ఖాలిద్ అల్-సబాతోనూ మోదీ భేటీ అయ్యారు.

# దద్దరిల్లిన లెబనాన్

## ఇజ్రాయెల్ భీకర దాడిలో 356 మంది మృతి!



ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసమైన భవనాలు


- వెయ్యి మందికి గాయాలు.. మృతుల్లో 24 మంది చిన్నారులు

బీరుట్, టెల్ అవీవ్, సెప్టెంబరు 23: లెబనాన్ సోమవారం బాంబుల మోతతో దద్దరిల్లింది. దేశంలోని దక్షిణ ప్రాంతంలోని 17 పట్టణాలు, పల్లెలపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. హిజ్బుల్లా ఉగ్రవాదులు తలదాచుకున్నవిగా, ఆయుధాలను భద్రపరిచినవిగా భావిస్తున్న నిర్మాణాలపైన రాకెట్ల వర్షం కురిపించింది. అంతకుముందు ఆ ప్రాంతాన్ని వీడి వెళ్లాలని స్థానికులను హెచ్చరిస్తూ వేలాది ఫోన్ కాల్స్ చేసింది. 11 నెలలుగా ఓవైపు హమాస్‌తో యుద్ధం చేస్తూనే మరోవైపు హిజ్బుల్లాతోనూ తలపడుతున్న ఇజ్రాయెల్ ఈ స్థాయిలో దాడులకు దిగడం ఇదే తొలిసారి. సోమవారం చేపట్టిన దాడుల్లో 356మంది ప్రాణాలు కోల్పోగా, వెయ్యి మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో 24 మంది పిల్లలున్నారు. తాజా దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయని.. మరో పూర్తిస్థాయి యుద్ధం తప్పదనే ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో అమెరికా జోక్యం చేసుకుంది. అగ్రరాజ్య రక్షణ శాఖ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గాలంట్‌కు ఫోన్ చేశారు. ఇజ్రాయెల్ ఆత్మరక్షణకు అండగా ఉంటామన్నారు. తమ బలగాలను రక్షించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతూనే, ఉద్రిక్తతలు మరింత పెరగకుండా ప్రయత్నాలు చేస్తామన్నారు. ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకున్న ప్రాంతాల నుంచి భారీఎత్తున ప్రజలు తరలిపోతున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. కాగా, ఇజ్రాయెల్ దాడులను అడ్డుకోవాలని లెబనాన్ ప్రభుత్వం ఐక్యరాజ్య సమితి, పెద్ద దేశాలను కోరింది. హిజ్బుల్లా, ఇజ్రాయెల్ ఎవరూ తగ్గడం లేదని వ్యాఖ్యానించిన ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరస్.. లెబనాన్ మరో గాజాలా మారనుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## లోకం తీరు




## హమాస్ చీఫ్ సిన్వర్ హతం?



టెల్ అవీవ్, సెప్టెంబరు 23: ఇజ్రాయెల్‌పై గత ఏడాది అక్టోబరు 7న జరిగిన దాడుల రూపకర్త, ఉగ్ర సంస్థ హమాస్ అధిపతి యాహ్యా సిన్వర్ చనిపోయినట్లుగా తెలుస్తోంది. అతడి నుంచి కొంతకాలంగా ఎలాంటి కదలికలు లేకపోవడమే దీనిని నిదర్శనంగా భావిస్తున్నారు. ఈ మేరకు ఇజ్రాయెల్ మీడియా కథనాలు ప్రచురించింది. అయితే, ఇవేమీ నిర్ధారణ కాలేదు. ఇజ్రాయెల్ దళాలు హమాస్‌కు పెట్టని కోట లాంటి సొరంగాలపై కొన్ని రోజుల కిందట విస్తృత దాడులు చేశాయి. వీటిలోనే యాహ్యా మృతి చెంది ఉంటాడని చెబుతున్నారు. గత నెలలో హమాస్ రాజకీయ విభాగాధిపతి ఇస్మాయిల్ హనియా హతమయ్యాడు. ఇరాన్‌లో జరిగిన ఈ దాడి వెనుక ఇజ్రాయెల్ ఉందని కథనాలు వచ్చాయి. కాగా, యాహ్యా మృతి అంటూ వస్తున్న కథనాలు హమాస్ స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ఇజ్రాయెల్ ఆడుతున్న మైండ్ గేమ్‌లో భాగం అనే కథనాలూ వస్తున్నాయి.

### పేజర్ పేలుడుతోనే రైసీ దుర్మరణం?

ఇరాన్ దివంగత అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మే నెలలో హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోవడం వెనుక 'పేజర్ పేలుడు' కారణమై ఉండొచ్చని పార్లమెంటు సభ్యుడు అహ్మద్ అర్దెస్తానీ వ్యాఖ్యానించారు. రైసీ పేజర్ వాడేవారని ఆయన పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేయాలని కోరారు. కాగా, తాము మద్దతు ఇచ్చే ఉగ్ర సంస్థ హిజ్బుల్లాకు పేజర్ల కొనుగోలులో ఇరాన్ సాయం చేసింది. గత వారం లెబనాన్‌లో వేలాది పేజర్లు పేలి హిజ్బుల్లా మద్దతుదారులు భారీగా మృతి చెందిన సంగతి తెలిసిందే.

# 'కామ్ కీ బాత్'పై మాట్లాడరేం?



- ప్రధాని మోదీపై రాహుల్ విమర్శలు
- ఆర్డర్ వేయండి.. మీ ముందు నిలబడుతా
- కశ్మీర్ వాసులకు రాహుల్ గాంధీ హామీ

శ్రీనగర్, సెప్టెంబరు 23: ప్రధాని మోదీ 'మనసులోని మాటల'ను చెబుతున్నారే తప్ప ఉద్యోగాలు, ఉపాధి కల్పనకు సంబంధించిన 'పనుల మాటల'ను మాట్లాడడం లేదని విపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. శ్రీనగర్‌లో సోమవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తూ మోదీ 'మన్ కీ బాత్'కే పరిమితమయ్యారే తప్ప 'కామ్ కీ బాత్'ను పట్టించుకోవడం లేదని అన్నారు. ధరల పెరుగుదలను ప్రస్తావించడం లేదని చెప్పారు. దేశ రాజకీయ పరిస్థితులను ప్రస్తావిస్తూ... మోదీ ముఖకవళికల్లో మార్పులు వచ్చాయని అన్నారు. "గత లోక్‌సభ ఎన్నికల్లో '56 అంగుళాల ఛాతీ' గురించి మీరు వినేవారు. ఆ మాటలు ఇప్పుడు వినబడుతున్నాయా? ఆయన ముఖ కవళికలు, మూడ్ మారాయి. మోదీ మనస్తత్వాన్ని కాంగ్రెస్, ఇండియా కూటములు కలిసి మార్చేశాయి" అని వ్యాఖ్యానించారు. గత పదేళ్లుగా బీజేపీ దేశంలో విభజనను, మత విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని విమర్శించారు. జమ్మూ-కశ్మీర్ రాష్ట్ర హోదాను కేంద్రపాలిత ప్రాంతానికి తగ్గించి ప్రజల హక్కులను హరించి వేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. పార్లమెంటులో కశ్మీర్ గొంతుకనవుతానని అన్నారు. జమ్మూ-కశ్మీర్ మన్ కీ బాత్‌ను ఎవరూ వినడం లేదని చెప్పారు. అందుకే "ఏ అవసరం ఉన్నా నాకు ఆర్డర్ వేయండి. మీ ముందు వచ్చి నిలబడుతా. మీతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. అదేమిటో మీకు చెప్పాల్సిన పనిలేదు" అని వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వం 25 పారిశ్రామికవేత్తలకు చెందిన రూ.16లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందని ఆరోపించారు. తర్వాత రాహుల్ హిందీలో ట్వీట్ చేస్తూ బీజేపీని బహుజన వ్యతిరేకి అని విమర్శించారు. కులగణన అన్న మాటను పలకడానికే ప్రధాని మోదీ భయపడుతున్నారని ఆరోపించారు. బీజేపీ ఎంతగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నప్పటికీ ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లకు హాని కలగకుండా చూస్తామని తెలిపారు. సమగ్రమైన కుల గణన జరిపి, దాని ఆధారంగా రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. బహుజనులకు హక్కులు కల్పించడం రాజకీయ సమస్య కాదని, తన జీవితాశయమని స్పష్టం చేశారు.

# 4 నెలలు భరతుడిలా పాలన!



- కేజ్రీవాల్ మళ్లీ సీఎం అయ్యేదాకా ఆయన కుర్చీ అలాగే ఉంటుంది
- ఢిల్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆతిశీ వ్యాఖ్యలు
- సీఎం ఆఫీసులో రెండో కుర్చీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా ఆతిశీ బాధ్యతలు చేపట్టారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆమె.. పక్కనే పాత సీఎం అరవింద్ కేజ్రీవాల్ కుర్చీని ఖాళీగా ఉంచారు. ఆయన వాడిన కుర్చీ పక్కనే మరో కుర్చీలో కూర్చొని ఆతిశీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రామాయణంలో సన్నివేశాన్ని ప్రస్తావించారు. రాముడు వనవాసానికి వెళ్లిన సమయంలో భరతుడు రాజ్యాన్ని ఏలాల్సి వచ్చిందన్నారు. అప్పుడాయన రాముడి పాదుకలు సింహాసనంపై ఉంచి బాధ్యతలు నెరవేర్చారని గుర్తుచేశారు. ఇప్పుడు తనదీ అదే పరిస్థితి అని ఆతిశీ చెప్పారు. భరతుడి స్ఫూర్తితోనే తాను నాలుగు నెలల పాటు ఢిల్లీ ప్రభుత్వాన్ని నడిపిస్తానని తెలిపారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు మళ్లీ ఆమ్ ఆద్మీ పార్టీకే పట్టం కడతారని, అరవింద్ కేజ్రీవాల్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. "ఈ కుర్చీ అరవింద్ కేజ్రీవాల్‌దే. ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు మరోసారి ఆయన్నే ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారు. అప్పటి వరకు ఈ కుర్చీ సీఎం కార్యాలయంలోనే ఉంటుంది. కేజ్రీవాల్ పునరాగమనం కోసం ఎదురుచూస్తూ ఉంటుంది" అని ఆతిశీ చెప్పారు. ఢిల్లీ ఎనిమిదో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆతిశీ (43).. ఈ పీఠాన్ని అధిరోహించిన అతి పిన్న వయస్కురాలు. అలాగే మూడో మహిళ. అంతకు ముందు కాంగ్రెస్ తరఫున షీలా దీక్షిత్, బీజేపీ తరఫున సుష్మా స్వరాజ్‌లు ఢిల్లీ ముఖ్యమంత్రులుగా పనిచేశారు. ప్రస్తుతం దేశంలో ఆతిశీ రెండో మహిళా ముఖ్యమంత్రి. ఇక ఆతిశీతో పాటు ఐదుగురు ఆప్ ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో నలుగురు పాతవారు కాగా.. ఒకరు కొత్త ఎమ్మెల్యే. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ముకేశ్ అహ్లావత్‌తో పాటు గోపాల్‌రాయ్, ఇమ్రాన్ హుస్సేన్, కైలాశ్ గహ్లోత్, సౌరభ్ భరద్వాజ్‌లు మంత్రులుగా ప్రమాణం చేశారు. కేజ్రీవాల్ ప్రభుత్వంలో మంత్రిగా 13 శాఖలను చూసుకున్న ఆతిశీ.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా వాటిని తన వద్దే ఉంచుకున్నారు.

### ఇది రాజ్యాంగాన్ని అగౌరవపర్చడమే: బీజేపీ

ఢిల్లీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆతిశీ తీరును బీజేపీ తీవ్రంగా ఖండించింది. సీఎం ఆఫీసులో ఆమె కుర్చీ పక్కనే కేజ్రీవాల్ కోసం మరో కుర్చీని ఖాళీగా ఉంచడాన్ని తప్పుపట్టింది. ఆతిశీ రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించారని బీజేపీ ఢిల్లీ శాఖ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ ఆరోపించారు. తన వ్యవహారశైలితో ఆమె సీఎం కార్యాలయాన్ని అవమానించారన్నారు. సీఎం ఆఫీసు డెస్కులో రెండు కుర్చీలు వేయడం ద్వారా రాజ్యాంగాన్ని అగౌరవపర్చారని ఆరోపించారు. సీఎం ఆఫీసు గౌరవానికి భంగం కలిగించడమేగాక ఢిల్లీ ప్రజల మనోభావాలను కూడా కించపరిచేలా వ్యవహరించారంటూ ఆతిశీపై ధ్వజమెత్తారు.

# చైల్డ్ పోర్న్ చూడడం నేరమే



(మొదటి పేజీ తరువాయి)

ఉన్నట్టు స్పష్టం చేస్తూ ఆ తీర్పును తోసిపుచ్చింది. అలాంటి కంటెంట్‌ను తొలగించకపోయినా, దాని గురించి అధికారులకు ఫిర్యాదు చేయకపోయినా.. దాన్ని ఇతరులకు పంపించాలన్న ఆలోచన ఉన్నట్టేనని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమిళనాడుకు చెందిన ఎస్.హరీశ్ (28) అనే వ్యక్తి ఫోన్‌లో చిన్నపిల్లల నీలిచిత్రాలు ఉన్నాయంటూ పోలీసులు పోక్సో చట్టంలోని సెక్షన్ 14(1), ఐటీ చట్టంలోని సెక్షన్ 67బి కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. దీనిపై అతడు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించాడు. విచారణ జరిపిన న్యాయస్థానం.. చిన్నపిల్లలతో నీలిచిత్రాలను తీసి ఉంటే, చైల్డ్‌పోర్న్‌ను వేరొకరికి పంపిస్తేనే ఐటీ చట్టంలోని 67బి కింద శిక్షార్హులని, అలాగే పోక్సో చట్టంలోని సెక్షన్ 14(1) ప్రకారం లైంగికచర్యలకు పిల్లలను వాడుకుంటే తప్పని.. అంతే తప్ప, చైల్డ్ పోర్న్‌ను కేవలం చూసినంతమాత్రాన నేరం కాదని పేర్కొంటూ అతడిపై పెట్టిన క్రిమినల్ కేసును కొట్టేసింది. మద్రాస్ హైకోర్టు తీర్పుపై 'జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్ అలయెన్స్' అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా హరీశ్ తరఫు న్యాయవాది.. తమ క్లయింట్ వాట్సా‌ప్‌కు ఆ పోర్న్ వీడియోలు 2019 జూన్ 14న వచ్చాయని, పోక్సో చట్టంలో అలాంటి వీడియోలను కలిగి ఉంటే విధించాల్సిన శిక్షలకు సంబంధించిన సెక్షన్ 15ను 2019 ఆగస్టు 16న చేర్చారని.. కాబట్టి ఆ సెక్షన్ ప్రకారం తన క్లయింట్‌కు శిక్ష విధించకూడదని వాదనలు వినిపించారు. ఆ వీడియోలు కూడా.. వాట్సాప్‌లో ఉన్న 'ఆటో డౌన్‌లోడ్ ఫీచర్ కారణంగా అతడి ఫోన్‌లో డౌన్‌లోడ్ అయ్యాయి తప్ప, వాటిని వేరొకరికి పంపాలన్న ఆలోచనే హరీశ్‌కు లేదని వివరించారు. ఈ పిటిషన్ వేసిన స్వచ్ఛంద సంస్థ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది హెచ్ఎస్ ఫూల్కా.. అతడి ఇంటర్నెట్ డౌన్‌లోడ్స్‌ను ట్రాక్ చేస్తే అప్పటికి (2019 నాటికి) రెండు సంవత్సరాలుగా అతడు చైల్డ్ పోర్న్ చూస్తున్నట్టు వెల్లడైందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వాదనలూ విన్న సుప్రీం ధర్మాసనం.. మద్రాస్ హైకోర్టు తీర్పును తోసిపుచ్చి, నిందితుడు హరీశ్‌పై పోలీసులు నమోదు చేసిన క్రిమినల్ కేసును పునరుద్ధరించాలని ఆదేశించింది. చైల్డ్ పోర్న్ వీడియోలను వేరొకరి నుంచి అందుకోవడం సెక్షన్ 15 ప్రకారం నేరం కాకపోవచ్చుగానీ.. ఆ వీడియోలను వెంటనే డిలీట్ చేయకపోవడం, లేదా అధికారులకు దాని గురించి ఫిర్యాదు చేయకపోవడం అంటే నిందితుడికి దురుద్దేశాలున్నాయనడానికి నిదర్శనమని స్పష్టం చేసింది. చైల్డ్ పోర్న్ సమస్య ప్రపంచవ్యాప్తంగా అన్ని సమాజాల్లోనూ వేళ్లూనికుని ఉందని.. భారతదేశంలో ఈ సమస్య ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించిన కోర్టు.. 200 పేజీల తీర్పులో పలు కీలక అంశాలను ప్రస్తావించింది.

### చైల్డ్ పోర్న్ అనొద్దు.. సీసీమ్ అనండి

ఇకపై జ్యుడీషియల్ ఆర్డర్లలో, తీర్పుల్లో చైల్డ్ పోర్నోగ్రఫీ అనే పదాన్ని వాడొద్దని.. దాన్ని 'చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూజ్ మెటీరియల్ (సీఎస్ఈఏఎం(సీసీమ్))'గా వ్యవహరించాలని దేశంలోని అన్ని కోర్టులకూ సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. ఈమేరకు పోక్సో చట్టానికి సవరణ చేయాలని కేంద్రానికి కూడా సూచించింది. సీసీమ్ తయారీ క్రమంలో.. చిన్నపిల్లలను కేవలం వస్తువులుగా చూస్తారని, వారిని పెట్టి తీసిన వీడియోలను చూడడంలో అంటే చిన్నపిల్లలపై లైంగిక వేధింపులను ప్రోత్సహించడమేనని జస్టిస్ జేబీ పార్దీవాలా పేర్కొన్నారు. సీసీమ్ పిల్లల ప్రాథమిక హక్కులకు భంగకరమని.. వారికి ఉన్న 'హుందాగా జీవించే హక్కు'ను కాలరాస్తుందని అన్నారు.

### లైంగిక విద్య తప్పనిసరి..

దేశంలో లైంగిక నేరాల సంఖ్యను తగ్గించాలంటే.. లైంగిక విద్య ప్రయోజనాలపై సమగ్ర అవగాహన కలిగించాల్సిన అవసరం ఉన్నాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. లైంగిక విద్య, గర్భనిరోధక సాధనాల గురించి చెప్పడం వల్ల యువతలో లైంగిక స్వైర వర్తన, బాధ్యతారహిత ప్రవర్తన పెరిగిపోతాయనే తప్పుడు అభిప్రాయాలు చాలామందికి ఉన్నాయని.. పిల్లలతో సెక్స్ గురించి చర్చించడాన్ని తప్పుగా, అనైతికంగా, ఇబ్బందికరంగా భావిస్తున్నారని ధర్మాసనం ఆవేదన వెలిబుచ్చింది. ఆ అవగాహన లేకపోవడంతో పిల్లలు ఇంటర్నెట్‌లో ఎలాంటి వడపోతా లేని, తప్పుదోవ పట్టించే వీడియోలను చూసి అనారోగ్యకరమైన లైంగిక అలవాట్లను ఏర్పరచుకుంటున్నారని.. ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉందని తన 200 పేజీల తీర్పులో స్పష్టం చేసింది. లైంగిక విద్య అంటే కేవలం పునరుత్పత్తి అవయవాలకు సంబంధించిన అంశాలకే పరిమితమన్న తప్పుడు అభిప్రాయం కూడా చాలా మందిలో ఉందని.. ఆమోదం తెలపడం (కన్సెంట్), ఆరోగ్యకరమైన సంబంధాలు, లింగ సమానత్వం, భిన్న అభిప్రాయాలను గౌరవించడం ఇలా చాలా అంశాలు సెక్స్ ఎడ్యుకేషన్ కిందకే వస్తాయని ధర్మాసనం స్పష్టం చేసింది.

# దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌పై తుది నోటిఫికేషన్ ఇవ్వండి

» ఆరు వారాల్లో ప్రక్రియ పూర్తికావాలి
» అప్పటిదాకా కూల్చివేతలు చేపట్టవద్దు
» ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దుర్గం చెరువు పూర్తి స్థాయి నీటి నిల్వ (ఎఫ్‌టీఎల్)కు సంబంధించి తుది నోటిఫికేషన్ జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. భవిష్యత్తు తరాల కోసం చెరువులను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. గుట్టలబేగంపేటలోని అమర్ కో ఆపరేటివ్ సొసైటీ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ప్లాట్ల యజమానులు, పిటిషనర్ల అభ్యంతరాలు స్వీకరించాలని తెలిపింది. అక్టోబరు 4 నుంచి ఆరు వారాల్లోపు మాదాపూర్‌లోని దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్‌పై తుది నోటిఫికేషన్ జారీ చేయాలని రెవెన్యూ, నీటిపారుదల అధికారులు, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, లేక్ ప్రొటెక్షన్ కమిటీ తదితరులకు ఆదేశాలు జారీచేసింది. 2014లో దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చి.. ఇప్పటివరకు తుది నోటిఫికేషన్ ఇవ్వకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధి రికార్డుల ప్రకారం 65 ఎకరాల్లో మాత్రమే ఉందని.. అధికారులు 160 ఎకరాల్లో విస్తరించి ఉందని చెప్పడం చెల్లదని పేర్కొంటూ అమర్ కో ఆపరేటివ్ సొసైటీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఇతర ప్లాట్ల యజమానులు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావుల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున అవినాశ్ దేశాయి, రాయ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఇంజినీరింగ్ ప్రమాణాలు, అధికారిక రికార్డుల ప్రకారం ఎఫ్‌టీఎల్ 65 ఎకరాలు మాత్రమే అన్నారు. 160 ఎకరాలు అని ఎక్కడా లేదని చెప్పారు. తమవి పట్టా భూములని, హెచ్ఎండీఏ అనుమతి పొందిన లేఅవుట్ అని.. అధికారులు ఎక్కడ కూల్చివేస్తారోనన్న భయంతో బతకాల్సి వస్తోందని పేర్కొన్నారు. 2014లో ఇచ్చిన ప్రాథమిక నోటిఫికేషన్‌కు తమ అభ్యంతరాలను స్వీకరించడం లేదని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది శ్రీధర్‌రెడ్డి వాదిస్తూ.. పిటిషనర్‌లు పేర్కొంటున్న రికార్డులు తప్పన్నారు. వాటిని ట్యాంపరింగ్ చేశారని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వం ఎఫ్‌టీఎల్‌కు సంబంధించిన తుది నోటిఫికేషన్ ఇవ్వకుండా దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ ఎంత ఉందో చెప్పడం తమ అధికార పరిధిలోకి రాదని స్పష్టం చేసింది. ముందు ప్రభుత్వం తుది నోటిఫికేషన్ జారీ చేస్తేనే విస్తీర్ణం ఎంతో తెలుస్తుందని పేర్కొంది. పిటిషనర్ల అభ్యంతరాలు విన్న తర్వాతే తుది నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదేశిస్తామని తెలిపింది. నేటి నుంచి వారంలోపు పిటిషనర్లు 2014 నాటి ప్రాథమిక నోటిఫికేషన్‌కు అభ్యంతరాలు తెలపాలి. అక్టోబరు 4న లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఎదుట హాజరై అభ్యంతరాలను వివరించాలి. వాటిపై లేక్ ప్రొటెక్షన్ కమిటీ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. తర్వాత ఎఫ్‌టీఎల్ తుది నోటిఫికేషన్ ఇవ్వాలి. మొత్తం ప్రక్రియ అక్టోబరు 4 నుంచి ఆరు వారాల్లో పూర్తి కావాలి. అప్పటివరకు కూల్చివేతలు చేపట్టబోమని ప్రభుత్వ న్యాయవాది అండర్‌టేకింగ్ ఇచ్చారు. దాన్ని మేం రికార్డు చేస్తున్నాం. అలాగే మెరిట్స్‌పై మేం ఎలాంటి అభిప్రాయం వ్యక్తంచేయడం లేదు' అని పేర్కొంటూ విచారణను ముగించింది.

## సంక్షేమ హాస్టళ్లలో మెస్ చార్జీలు పెంచాలి

» సంక్షేమ భవన్ ముందు కేవీపీఎస్ ధర్నా

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) సంక్షేమ భవన్ ముందు ధర్నా నిర్వహించింది. రాష్ట్రంలో 810 హాస్టళ్లలో 64,834 మంది విద్యార్థులు అరకొర సౌకర్యాల మధ్య చదువుకుంటున్నారని సంఘం నేతలు టి.స్కైలాబ్‌బాబు, మాణిక్యం అన్నారు. విద్యార్థుల పాకెట్ మనీ, కాస్మొటిక్ చార్జీలను పెంచాలని, దీపావళిలోపు దుస్తులు, దుప్పట్ల కోసం టెండర్లు పిలిచి పిల్లలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ టీకే శ్రీదేవికి కేవీపీఎస్ నేతలు వినతి పత్రం సమర్పించారు.

### సీఎస్‌కు గురుకుల విద్యాసంస్థల జేఏసీ వినతిపత్రం

రాష్ట్రంలోని ఐదు ప్రభుత్వ గురుకులాల్లో (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్) ఉన్న ఉమ్మడి టైమ్ టేబుల్‌లో మార్పుతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురుకుల విద్యాసంస్థల జేఏసీ తరఫున స్టీరింగ్ కమిటీ సభ్యులు సీఎస్ శాంతికుమారితో పాటు ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులకు వినతి పత్రం అందజేశారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఈ నెల 28న చాక్ డౌన్/పెన్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఓ ప్రకటనలో వెల్లడించారు.

## ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టుల మృతి

చర్ల, సెప్టెంబరు 23: ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో సోమవారం సాయంత్రం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టుల కదలికల నేపథ్యంలో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ముగ్గురు నక్సల్స్ మృతి చెందగా వారిలో ఓ మహిళ ఉంది. ఘటనా స్థలం నుంచి మావోయిస్టులకు చెందిన అధునాతన తుపాకులను పోలీసు బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతదేహాలను నారాయణపూర్ జిల్లా కేంద్రానికి తరలించాయి. మృతులను గుర్తించాల్సి ఉంది. ఇదిలా ఉండగా బీజాపూర్ జిల్లాలో 8 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిపై సుమారు రూ.28లక్షల రివార్డు ఉన్నట్లు తెలుస్తోంది.

## ఫిట్జీ.. స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తులు ప్రారంభం

హైదరాబాద్ , సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ కోచింగ్ సెంటర్ ఫిట్జీ(ఎఫ్ఐఐటీజేఈఈ)... తమ సంస్థలో ప్రవేశాలతో పాటు స్కాలర్‌షిప్ అందించడం కోసం ఏటా నిర్వహించే టాలెంట్ రివార్డ్ పరీక్ష(ఎఫ్‌టీఆర్ఈ)ని ఈసారి కూడా నిర్వహించనుంది. ఈ పరీక్షను ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ నిర్వహిస్తారు. విద్యార్థులు తమకు అనుకూలమైన విధానాన్ని, పరీక్ష తేదీని ఎంచుకోవచ్చు. ఈ పరీక్ష ద్వారా విద్యార్థుల విశ్లేషణ నైపుణ్యాలను, ఐక్యూ, ఆప్టిట్యూడ్ వంటి అంశాలలో వారి సామర్థ్యాన్ని ఫిట్జీ అంచనా వేస్తుంది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి స్కాలర్‌షిప్ అందజేస్తుంది. ఎఫ్‌టీఆర్ఈ అనేది అడ్మిషన్ కమ్ స్కాలర్‌షిప్ పరీక్ష మాత్రమే కాదని, అభ్యర్థుల విద్యా సామర్థ్యాన్ని కచ్చితంగా అంచనా వేయడానికి ఒక సాధనమని ఫిట్జీ గ్రూప్ డైరెక్టర్ ఆర్ ఎల్ త్రిఖా తెలిపారు. విద్యార్థులు అపారమైన అకడమిక్ ప్రయోజనాలను పొందడానికిది సహాయపడుతుందన్నారు. ప్రస్తుతం ఐదవ తరగతి నుండి పన్నెండవ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షకు హాజరుకావడానికి అర్హులు. విద్యార్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం http://www.fiitjee.com/ftre చూడవచ్చు.

హిమాయత్ సాగర్‌లో..

# ఆక్రమణల నివేదికపై అస్పష్టత

**కూల్చివేతలపై హైడ్రా సందిగ్ధం.. జలాశయంలో ఆక్రమణలపై పలు ఫిర్యాదులు**

» ఎఫ్‌టీఎల్ నోటిఫై కాకపోవడంతో..

ఆక్రమణల గుర్తింపులో హైడ్రాకు ఇబ్బందులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): హిమాయత్‌సాగర్‌లో ఆక్రమణల గుర్తింపునకు సంబంధించిన నివేదికపై అస్పష్టత నెలకొంది. జలాశయం వద్ద క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించిన వాటర్‌బోర్డు, నీటి పారుదల శాఖ అధికారులు.. ఇటీవల హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా)కు ఆక్రమణల వివరాలు అందజేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో 83 నిర్మాణాలున్నట్టు నివేదికలో పేర్కొన్నారు. అయితే.. పర్యావరణ వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతరులు ఫిర్యాదు చేసిన పలు ఆక్రమణల వివరాలు నివేదికలో కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మరోసారి సమగ్ర పరిశీలన చేపట్టాల్సిందిగా వాటర్‌బోర్డు, నీటి పారుదల శాఖ అధికారులను కోరాలని హైడ్రా భావిస్తోంది. దాంతోపాటు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) నుంచి రెండు, మూడు దశాబ్దాల క్రితం నాటి జలాశయం మ్యాపులు తీసుకోవాలని నిర్ణయించింది. హిమాయత్‌సాగర్‌కు సంబంధించి గత, ప్రస్తుత మ్యాపులు ఇవ్వాలని కోరింది. మ్యాపుల ఆధారంగా ఆక్రమణలపై సూత్రప్రాయ అంచనాకు రావొచ్చని అధికారులు భావిస్తున్నారు. దీంతో జలాశయంలో ఆక్రమణల తొలగింపును వాయిదా వేసిన హైడ్రా.. పూర్తిస్థాయి స్పష్టత వచ్చిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది. ఫిర్యాదుల్లో పేర్కొన్న నిర్మాణాలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నాయా? లేదా? నిర్ధారించుకున్న అనంతరం కూల్చివేతలు ఉంటాయని సంస్థ వర్గాలు పేర్కొన్నాయి.




### ఇదీ నేపథ్యం..

రాజధాని నగర తాగునీటి అవసరాల కోసం 1927లో రూ.93 లక్షలతో 19.63 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో హిమాయత్‌సాగర్‌ను నిర్మించారు. అయితే, కాలగమనంలో జలాశయం ఆక్రమణకు గురైంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు రావాల్సిన కాలువలపై అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దీంతో జలాశయంలోకి నీటి రాక తగ్గింది. ఇదే అదనుగా కొందరు మట్టి నింపి నిర్మాణాలు చేపట్టారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అతిథి గృహాలు, ఫామ్ హౌస్‌లు, ఇతరత్రా నిర్మాణాలు చేపట్టారు. హైడ్రా ఏర్పాటుతో చెరువుల పరిరక్షణకు నడుం బిగించిన ప్రభుత్వం హిమాయత్‌సాగర్‌లోని ఆక్రమణలూ తొలగించాలని ఆదేశించింది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మాణాల లెక్కలు తేల్చే పని వాటర్‌బోర్డు, నీటిపారుదల శాఖలకు అప్పగించారు. వారు ఇచ్చిన నివేదికపై పునఃపరిశీలన మొదలైంది.

### నోటిఫై కాని ఎఫ్‌టీఎల్

హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ ఇంకా నోటిఫై కాలేదు. నగర, శివారు ప్రాంతాల్లోని పలు చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లకు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన హెచ్ఎండీఏ.. ఈ జలాశయ ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు మాత్రం చర్యలు తీసుకోలేదు. ఇది ఆక్రమణల గుర్తింపునకూ ఇబ్బందికరంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ఒకటికి, రెండు సార్లు పూర్తి వివరాలు పరిశీలించాలని హైడ్రా భావిస్తోంది.

### ఆక్రమణలపై ఫిర్యాదులివీ..

హిమాయత్‌సాగర్‌లో ఆక్రమణలపై పలు స్వచ్ఛంద సంస్థలు హైడ్రాకు ఫిర్యాదు చేశాయి. ఎన్ఆర్ఎస్‌సీ, ధరణి కెడస్ట్రియల్ లేయర్, హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆనందసాయి కన్వెన్షన్.. జలాశయం లోపల ఉందని సామాజిక కార్యకర్త లుబ్నా సార్వత్ ఫిర్యాదు చేశారు. యేటురూ పార్క్‌కు సంబంధించిన ప్రహరీ గోడలు, ఇతర నిర్మాణాలూ హిమాయత్‌సాగర్ లోనే ఉన్నాయని పేర్కొన్నారు. జలాశయం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో.. బీటీ రోడ్లు, కాంపౌండ్ వాల్స్, షెడ్లు తదితర ఆక్రమణల వివరాలను పలు ఎన్జీవోలు హైడ్రాకు సమర్పించాయి.

## కుమార్తెకు న్యాయం జరగడం లేదని వ్యవసాయ బావిలో దూకిన తండ్రి

» అత్తింటివారి వేధింపులపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఆవేదన
» ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కుల సంఘం వాట్సాప్ గ్రూప్‌లో సందేశం.. సిరిసిల్ల జిల్లాలో ఘటన


అగుళ్ల శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 23: అత్తింటి వేధింపులను తాళలేక ఆత్మహత్యాయత్నం చేసిన తన కూతురుకు న్యాయం చేయాలని వేడుకున్నా, పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆవేదనతో ఓ తండ్రి పాడుబడ్డ వ్యవసాయ బావిలో దూకాడు. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన చెందిన అగుళ్ల శ్రీనివాస్(48) కూతురు రమ్యకు పదేళ్ల క్రితం సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మిట్టపల్లి శ్రీకాంత్‌తో పెళ్లయింది. అత్తింటివారి వేధింపులతో ఐదు రోజుల క్రితం రమ్య ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెకు ఆస్పత్రిలో చికిత్స చేయించిన తండ్రి శ్రీనివాస్, కోలుకున్నాక రాచర్లబొప్పాపూర్‌కు తీసుకొచ్చాడు. తన కుమార్తెను అత్తింటి వారు వేధిస్తున్నారని శనివారం ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు పట్టించుకోవడం లేదని, ఫిర్యాదు చేసి రెండ్రోజులు గడిచినా కూతురు అత్తింటి వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని కుటుంబసభ్యులతో చెప్పి మనస్తాపం చెందాడు. తన కూతురికి ఇక న్యాయం జరగదని, కూతురును వేధిస్తున్న అత్తింటివారి వల్లే తాను బావిలో ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ కుల సంఘానికి సంబంధించిన వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు పెట్టాడు. అనంతరం ఇంటి సమీపంలో ఉన్న పాడుబడ్డ వ్యవసాయ బావిలో దూకాడు. సమాచారం అందుకున్న ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు ఘటనస్థలికి చేరుకున్నారు. బావిలో నీటిని తొలగించారు. అయితే శ్రీనివాస్ ఆచూకీ లభించలేదు.

## అమృత్ టెండర్లు కేంద్రం పరిధిలోనివి: మల్లు రవి

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): "సూదిని సృజన్‌రెడ్డి.. సీఎం సతీమణి తమ్ముడైనప్పుడు సీఎంకు సొంత బావమరిది కాకపోతే ఏమైతదంటూ కేటీఆర్ అంటున్నడు.. సృజన్‌రెడ్డి సీఎం సతీమణి సొంత తమ్ముడు కాదు.. ఆమె బాబాయి కొడుకు" అంటూ కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి వెల్లడించారు. అమృత్ పథకం టెండర్ల విషయంలో ప్రజలను కేటీఆర్ తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న టెండర్లకు, సీఎం రేవంత్‌రెడ్డికి సంబంధం ఏంటన్న ఆలోచన కూడా లేకుండా బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజల్లో రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. అమృత్ పథకంలో అక్రమాలు జరిగాయంటూ కేంద్రానికి లేఖ రాశానని చెబుతున్న కేటీఆర్.. కేంద్రం విచారించేదాకా ఆగకుండా ఎందుకు తొందర పడుతున్నారని మల్లు రవి ఒక ప్రకటనలో ప్రశ్నించారు.

## ముదిరాజులను బీసీ-ఏలోకి మార్చండి

» టీపీసీసీ చీఫ్‌కు ముదిరాజ్ సంఘం నేతల వినతి

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి ): ఎన్నికల ముందు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏ కేటగిరీలోకి మార్చాలని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీలను తెలంగాణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్, టీజేఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్, టీపీసీసీ నేత బీమ లక్ష్మణ్ కోరారు. గాంధీభవన్‌లో సోమవారం మహేష్‌కుమార్‌గౌడ్, దీపాదాస్ మున్షీలను కలిసిన వీరు.. ఈమేరకు వినతిపత్రం సమర్పించారు.

### టీపీసీసీ చీఫ్‌కు 3న ఆదివాసీ కాంగ్రెస్ సన్మానం

టీపీసీసీ నూతన అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఈ నెల 3న ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించాలని ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. గాంధీభవన్‌లో సోమవారం బెల్లయ్యనాయక్ అధ్యక్షతన సమావేశమైన కార్యవర్గం.. ఈమేరకు నిర్ణయం తీసుకుంది.

# తెల్లవార్లూ కూల్చివేతలు

**పటాన్‌చెరు పరిధి కిష్టారెడ్డిపేటలో అర్ధరాత్రి 3 భవనాలు నేలమట్టం**

» పటేల్‌గూడలో 24 ఇండ్ల కూల్చివేత


పటేల్‌గూడలో ఇండ్ల శిథిలాల గుట్టలు

పటాన్‌చెరు, సెప్టెంబరు 23: అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా.. పటాన్‌చెరు పరిధి కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ గ్రామాలలో ఆదివారం ఉదయం 7 గంటలకు మొదలుపెట్టిన కూల్చివేతలు ఏకధాటిగా 20 గంటలపాటు కొనసాగాయి! హైడ్రా కూల్చివేతలు పగలు, రాత్రి కొనసాగడం ఇదే తొలిసారి. కిష్టారెడ్డిపేట సర్వే నంబర్ 164 ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఐదంతస్తుల భారీ షాపింగ్ కాంప్లెక్స్‌లు మూడింటిని.. తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో హైడ్రా అధికారులు నేలమట్టం చేశారు. అలాగే పటేల్‌గూడ సర్వే నంబర్ 12లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన 24 ఇండ్లను పూర్తిస్థాయిలో ధ్వంసం చేసి, శ్లాబ్‌లను నేలమట్టం చేశారు. మరో నాలుగు ఇండ్లలో జనాలు ఉండటంతో.. ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీచేశారు. కాగా.. కిష్టారెడ్డిపేటలోని సర్వే నంబర్164లో ఇంకా అనేక అక్రమ కట్టడాలున్నాయి. వాటిపై సస్పెన్స్ కొనసాగుతోంది. అక్కడే.. ప్రభుత్వ భూముల్లో నిర్మించినట్లుగా ఆరోపణలున్న కొన్ని అపార్ట్‌మెంట్ల కూల్చివేతకు సైతం హైడ్రా ఏర్పాట్లు చేస్తోందని ప్రచారం జరుగుతోంది.

### అమీన్‌పూర్‌లో..

వారం రోజులుగా అమీన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములు, చెరువులు కుంటల్లో అక్రమ కట్టడాలపై దృష్టి సారించిన హైడ్రా.. అమీన్‌పూర్ పెద్దచెరువు, శంభునికుంట, బందకొమ్ము చెరువుల్లోని అక్రమ కట్టడాలతో జాబితాను సిద్ధం చేసినట్లు తెలిసింది. వాటికి సంబంధించి నోటీసులు సైతం జారీచేసినట్లు సమాచారం. అక్కడికి కూడా ఏ క్షణాన్నైనా ఎక్స్‌కవేటర్లు ప్రత్యక్షమవుతాయని సమాచారం. అయితే.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 993, 630 సర్వే నంబర్లలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో ఎక్కువ శాతం పేద, మధ్య తరగతి వర్గాలే ఉన్నాయి. వారంతా.. తమ గూడు చెదిరిపోతుందేమోనని కంటి మీద కునుకులేకుండా గడుపుతున్నారు. తమను దారుణంగా వంచించిన బిల్డర్లు, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### మాదాపూర్ కావూరిహిల్స్‌లో పార్కు స్థలంలో జిమ్ కూల్చివేత

మోతినగర్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మాదాపూర్ కావూరి హిల్స్‌లో.. పార్క్ స్థలంలో నిర్మించిన అక్రమ షెడ్లను హైడ్రా సిబ్బంది సోమవారం తొలగించారు. కావూరిహిల్స్‌లోని రోడ్ నెంబర్ 36లో.. సర్వే నంబర్ 42, 43, 44, 45లో గల లే-అవుట్‌లో రెండెకరాల పార్కు స్థలం ఉంది. ఆ స్థలంలో కొన్నాళ్లుగా షెడ్డు ఏర్పాటు చేసి జిమ్ నడుపుతున్నారు. అనుమతి లేకుండా కట్టిన ఆ నిర్మాణాలపై కావూరిహిల్స్ అసోసియేషన్ ప్రతినిధులు 8 ఏళ్ల క్రితం హైకోర్టును ఆశ్రయించారు. కూల్చివేయాలని కోర్టు ఆదేశించినా.. జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించారు. కాలనీవాసులు హైడ్రా దృష్టికి తీసుకెళ్లగా సోమవారం ఉదయం బుల్‌డోజర్‌తో కూల్చివేతలు నిర్వహించారు. అక్కడ 2000 గజాల స్థలం స్వాధీనం చేసుకుని.. పార్క్ అభివృద్ధి నివిత్తం జీహెచ్ఎంసీకి అప్పగించినట్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటించారు. కాగా.. జీహెచ్ఎంసీ నుంచి తాము అనుమతులు తీసుకొనే జిమ్ ఏర్పాటు చేసుకున్నామని, ప్రతి నెలా అద్దె కూడా చెల్లిస్తున్నామని నిర్వాహకులు వాపోయారు.

# అక్రమ హర్మ్యంపై చర్యలేవీ!?

» అక్రమమని విజిలెన్స్ తేల్చినా పట్టించుకోవట్లేదు
» నెట్ నెట్ వెంచర్స్ నిర్మాణంపై నందగిరి హిల్స్ సొసైటీ ఆరోపణ

బంజారాహిల్స్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిబంధనలను తుంగలో తొక్కి జీహెచ్ఎంసీ అనుమతులు పొందిన నెట్ నెట్ వెంచర్స్ అక్రమంగా ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తోందని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తేల్చినా జీహెచ్ఎంసీ అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంపై నందగిరి హిల్స్ కో ఆపరేటివ్ సొసైటీ మండిపడింది. జీహెచ్ఎంసీకి చెందిన అన్ని విభాగాల అధికారులు తప్పుడు అనుమతులు ఇచ్చారని నివేదిక స్పష్టం చేస్తున్నా కమిషనర్ పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారని తప్పుబట్టారు. జూబ్లీహిల్స్ నందగిరి హిల్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కార్యాలయంలో సొసైటీ అధ్యక్షుడు యుగంధర్, కార్యదర్శి రాధిక, సభ్యుడు రాఘవాచార్య, మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి తదితరులు మీడియాతో మాట్లాడారు. నందగిరి హిల్స్ కొండ ప్రాంతమని, దీనిని ఆనుకుని ఉన్న హెచ్ఎండీఏ స్థలాన్ని వేలంలో నెట్ నెట్ వెంచర్స్ కొనుగోలు చేసిందని, దాంతో, నిర్మాణాలకు కొండ ప్రాంతాన్ని కదిలించవద్దని ప్రభుత్వం నిబంధన పెట్టిందని, అయినా.. వంద మీటర్ల కొండను తవ్వి లోయగా మార్చారని ఆరోపించారు. ఇక్కడ జీ+13 అంతస్థులు, 5 స్టిల్టులు, ఒక సెల్లార్‌కు అనుమతులు తీసుకున్నారని, నందగిరి హిల్స్ లే అవుట్‌గా చూపిస్తే ఇన్ని అంతస్థులకు అనుమతులు రావని, అందుకే రోడ్ నంబర్ 45 నిబంధనలను తమకు అనుకూలంగా మార్చుకున్నారని వివరించారు. ఈ అంశంపై నందగిరిహిల్స్ సొసైటీ మొదటి నుంచీ పోరాటం చేస్తోందని, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు చేసిందని, అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్య ధోరణితో, క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే అనుమతులు ఇచ్చారని నివేదిక ఇచ్చారని తెలిపారు. నెట్ నెట్ వెంచర్స్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయడంతోపాటు నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని నివేదికలో పేర్కొన్నారని గుర్తు చేశారు. అయినా, ఇంత వరకూ ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. అందుకే, విజిలెన్స్ నివేదికను యథావిధిగా అమలు చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. త్వరలో హైడ్రా కమిషనర్‌ను కలుస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## లంకలో అరుణోదయం

శ్రీలంక కొత్త అధ్యక్షుడుగా మార్క్సిస్టు నాయకుడు అనుర కుమార దిస్సనాయకే సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. శనివారం జరిగిన ఎన్నికల్లో ఈయన నేతృత్వంలోని ఎన్‌పిపి సంకీర్ణానికి సమీప ప్రత్యర్థి సాజిద్ ప్రేమదాసకంటే పన్నెండు లక్షల ఓట్లు అధికంగా వచ్చాయి. లంకలో పేరున్న రాజపక్సేలు, రణసింఘేలు, ప్రేమదాసల మీద జనం విపరీతమైన ఆగ్రహంతో ఉన్నారని అందుకే బయటి ప్రపంచానికి పెద్దగా తెలియని ఈయనకు పట్టంకట్టారని విశ్లేషకులు అంటున్నారు. ఆర్థికసంక్షోభం అంచున ఉన్న దేశాన్ని ప్రస్తుత విధానాలు బాగుచేయలేవని నమ్మిన ప్రజలు, తమ భవిష్యత్తును ఈ యాభైఐదేళ్ళ వామపక్ష నాయకుడి చేతిలో పెట్టారు.

పదేళ్ళక్రితం జనతావిముక్తి పెరుమన (జేవీపీ)కు అధ్యక్షుడై, ఆరేళ్ల క్రితం ఆ పార్టీ నేతృత్వంలో నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) కూటమిని ఏర్పాటు చేసి, అప్పటి అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడినప్పుడు అనుర కుమార దిస్సనాయకే (ఎకెడి)కు మూడుశాతం ఓట్లు వచ్చాయి. ఇప్పుడు మరో నలభైశాతం ఓట్లు పడటానికి ప్రధాన కారణం ప్రజల ఆర్థిక దుస్థితి, దుర్భరమైపోయిన వారి దైనందిన జీవితాలు. ప్రజల్లో ఉన్న నిరాశానిస్పృహలను ఎకెడి చక్కగా వినియోగించుకున్నారు. ప్రత్యర్థులందరినీ చేతకానివారుగా చీల్చిచెండాడి, తాను సచ్చీలుడినని చేసిన ప్రచారం జనానికి ఎక్కింది. మిగతావారంతా దోచుకోవడానికి వస్తే, తాను రక్షించడానికి వచ్చానని ఆయన చెప్పుకున్నాడు. కష్టాల్లో ఉన్న జనానికి ఇటువంటి మాటలు సులువుగా ఎక్కుతాయి కనుక, వారికి ఆయన ఓ ఉద్ధారకుడిగా కనిపించాడు. రాజపక్సేలు రగల్చిపోయిన అగ్గిని చల్లార్చి, పరిస్థితులను దారికి తెచ్చి, ఇరుగుపొరుగుదేశాల చేయూతతో, ఐఎంఎఫ్ ఆర్థిక సాయంతో దేశాన్ని ఎంతోకొంత గాడినపెట్టాడని మిగతా ప్రపంచమంతా అంటున్న రణిల్ విక్రమసింఘేను కూడా జనం కాదుపొమ్మన్నారు. రాజపక్సేలకు వ్యతిరేకంగా సాగిన ప్రజాఉద్యమంలో చురుకైన పాత్ర పోషించడం, అధ్యక్ష బరిలోకి దిగబోతున్నానని ముందుగానే ప్రకటించడం ఎకెడికి వివిధ వర్గాలను ఆకట్టుకోవడానికి ఉపకరించింది.

ఆయన సారథ్యం వహిస్తున్న జేవీపీకి హింసాత్మక చరిత్ర ఉంది. 1970, 80 దశకాల్లో అది సాయుధ తిరుగుబాట్లు చేసింది, వందలాదిమంది మరణించారు. ఎల్‌టీటీఈ సారథ్యంలో తమిళుల అస్తిత్వపోరాటం మొదలైన తరువాత ఈ పార్టీ లంక జాతీయవాదానికి ప్రతినిధిగా అవతరించి, ఎల్‌టీటీఈతో ప్రత్యక్ష యుద్ధం కూడా చేసింది. భారత్–శ్రీలంక శాంతి ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ జేవీపీ సాగించిన హింసలో వందలమంది మరణించారు. ఈ ఒప్పందం ఆధారంగా ఉనికిలోకి వచ్చిన ప్రాంతీయమండళ్ళకు కొద్దిపాటి అధికారాలు బదలాయించడాన్ని కూడా ఈ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఎకెడి విజయోత్సవంలో ఎర్రజెండాలు కనిపిస్తున్నా అది మతవాద, మితవాద పార్టీయేనని కొందరి వ్యాఖ్యానం. జేవీపీ అధ్యక్షుడైన తరువాత ఆయన గతకాలపు హింసకు క్షమాపణలు కోరారు కానీ, ప్రాంతీయమండళ్ళు కొనసాగుతాయన్న ఒక్కమాట తప్ప తమిళుల విషయంలో ఆయన వైఖరి పెద్దగా మారలేదు. ఆయనకూ, ఆయన పార్టీకి భారత వ్యతిరేకి అన్నపేరుంది. చైనా అనుకూలత గురించి ఇక ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ఎకెడి రాకతో, అదానీ విండ్ పవర్ ప్రాజెక్టు ప్రమాదంలో పడిందని అంటారు. భారత ప్రధాని నరేంద్రమోదీ గత పాలకులతో నేరుగా మాట్లాడి అదానీకి ఈ ప్రాజెక్టు ఇప్పించారన్న ఆరోపణలు వెల్లువెత్తినప్పటినుంచి పక్షంరోజుల క్రితం వరకూ కూడా ఎకెడి ఈ ప్రాజెక్టు రద్దు విషయంలో ఒకేమాట మీద ఉన్నారు. సోమవారం దేశ 9వ అధ్యక్షుడుగా ప్రమాణం చేస్తున్న సందర్భంలో, తాను మెజీషియన్‌ని కాదని, దేశాన్ని ఆర్థికసంక్షోభం నుంచి బయటపడవేయడానికి తన సైద్ధాంతిక కట్టుబాటుకు భిన్నమైన శక్తులతో కూడా సానుకూలంగా వ్యవహరిస్తానని తన ప్రసంగంలో మాటిచ్చారు.

వివిధ ట్రేడ్‌యూనియన్లు, సామాన్యులు ఆయనకు మద్దతుగా నిలిచిన నేపథ్యంలో, విజయావకాశాలు మెరుగుపడుతున్న తరుణంలో భారతదేశం ఆహ్వానించడం, ఆయన పర్యటించడం కూడా జరిగింది. ఇప్పుడు ఎన్నికల ఫలితాల్లో ఎకెడి అధ్యక్షుడిగా నెగ్గినట్టు తేలిన పదినిముషాల్లోనే భారత ప్రతినిధి బృందం స్వయంగా ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపింది. ఇరుగుపొరుగుదేశాలతో సత్సంబంధాలు కొనసాగుతాయన్న ఆయన హామీలో భారత్ వాటా ఎంతో భవిష్యత్తులో తేలుతుంది. 225సీట్ల పార్లమెంటులో మూడు మాత్రమే ఉన్న దిసనాయకే, ఈ వేడి చల్లారకముందే పార్లమెంటు ఎన్నికలకు పోవడానికి సిద్ధపడుతున్నారు. చట్టసభలో అవసరమైనంత సంఖ్యాబలాన్ని సాధించాక ఆ ఎర్రదనాన్ని పూర్తిగా వదిలేసి, అసలు రంగు ప్రదర్శిస్తాడని కొందరి అంచనా.

## ముఖ్యమంత్రికి మంచి భాష నేర్పుదాం!

రాజకీయాల్లో అధికార ప్రతిపక్షాల మధ్య రాజకీయ వాగ్యుద్ధం ఒక సహజ ప్రక్రియ. ఇందులో పదునైన మాటలు, ఘాటైన వ్యాఖ్యలు చోటుచేసుకోవడమూ సహజమే. సభ్యత సరిహద్దు దాటకుండా, ఎంత ఘాటుగానైనా విమర్శలు చేసుకోవచ్చు. ఇది పరిణతి కలిగిన నాయకుల లక్షణం. ప్రస్తుత రాజకీయాల్లో ఈ లక్షణం క్షీణిస్తుండటం విచారకరం. రెండున్నర దశాబ్దాలుగా రాజకీయాలతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉన్న నేను రాజకీయ పరిభాష ఇంతగా దిగజారిపోవడం గతంలో ఎన్నడూ చూడలేదు.

తెలంగాణ ఉద్యమ సందర్భంలో సమైక్యవాద నాయకులతో నిరంతరం తీవ్ర ఘర్షణలు ఎదుర్కొన్నాం. ఉద్యమం అనేది ఎప్పుడైనా ఒక అసాధారణమైన పరిస్థితి. ఆవేశకావేశాలు తీవ్రంగా చెలరేగే వాతావరణం ఉద్యమ సన్నివేశంలో ఎక్కువగా ఏర్పడుతుంది.

తెలంగాణ ఉద్యమంలో జరిగిన రాజకీయ సంవాదాన్ని పరిశీలిస్తే– ఆధారాలు, నిదర్శనాలతో కూడిన సప్రమాణమైన చర్చ, సజావైన భాషలోనే జరగడం గమనించవచ్చు. చరిత్రను పరిశోధించడం, గణాంకాలను ఉదహరించడం, తార్కికంగా వాదించడం, మహాకవుల కవితలను, పద్యాలను ఉటంకించడం వంటి ఉత్తమమైన లక్షణాలు ఉద్యమకారులకు అలవడ్డాయి. ఉద్యమానికి నాయకత్వం వహించిన కేసీఆర్ ప్రసంగాలు విశేషమైన సమాచారంతో, గొప్ప విశ్లేషణతో ప్రజల్ని జాగృతం చేశాయి.



కేసీఆర్ ప్రసంగాల గురించి చెబుతూ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఈ విధంగా అన్నారు: "తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని గురించి నేను ఎంతోమంది నాయకులకు వివరించాను. కానీ కేసీఆర్ అర్థం చేసుకున్నంత లోతుగా మరెవరూ అర్థం చేసుకోలేదు. తెలంగాణ భావజాలాన్ని ప్రజల భాషలో కేసీఆర్ వ్యక్తం చేసినంత గొప్పగా మరే నాయకుడు చేయలేదు," అని ఆయన ప్రశంసించారు. ఉద్యమ క్రమంలో మేధావులకు, కవులకు, కళాకారులకు రాజకీయ నాయకులకు మధ్య ఏర్పడిన సాంగత్యం వల్ల కూడా రాజకీయ వేదికలపై ఒక చక్కని ప్రసంగ శైలి రూపుదిద్దుకున్నది.

ఉద్యమ అవసరాల రీత్యా విషయాన్ని ఎంతో మథించి అవగాహన చేసుకొని ప్రజలకు వివరించే నైపుణ్యాన్ని నాలాంటి నాయకులెందరమో సాధన చేశాం. తెలంగాణ నాయకుల ప్రసంగాలూ, వాదనాపటిమ ప్రత్యర్థులు సైతం ప్రశంసించే స్థాయికి చేరింది. అయితే భావోద్వేగాలు పెరిగినప్పుడు మాత్రం భాష కట్టుతప్పిన ఉదంతాలు లేకపోలేదు. అది అరుదుగా జరిగింది. కానీ దాన్నే సాధారణీకరించి తెలంగాణ నాయకుల భాష బాగా లేదని అప్పటి పాలకవర్గ మీడియా అదే పనిగా ప్రచారం చేసింది.



వెగటుపుట్టే తన భాష ద్వారానే తాను సీఎం కాగలిగానని రేవంత్ నమ్ముతున్నాడు. ఇది ఈ రాష్ట్ర రాజకీయాల్లో దౌర్భాగ్యం. యావత్ సమాజం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి, రాజకీయ భాషను సవరించే పనికి పూనుకోవాలి. ప్రజా చైతన్యమే ఈ పాడు భాష నుంచి విముక్తిని ప్రసాదించాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ప్రయత్నానికి దోహదపడేందుకు నేను సన్నద్ధంగా ఉన్నానని తెలియజేస్తున్నాను.

నూతన రాష్ట్రానికి పరిపాలన సారథిగా కేసీఆర్ పగ్గాలు చేతబూనిన తర్వాత రాజకీయ వాతావరణం మారిపోయింది. తెలంగాణ సమాజంలో ఉద్యమం వల్ల ఏర్పడిన ఆవేశగుణాన్ని తగ్గించి, రాష్ట్ర పురోగమనం దిశగా జనం ఆలోచనలను మళ్లించడంలో కేసీఆర్ సఫలమయ్యారు. ప్రత్యర్థుల మీద దాడికన్నా ప్రగతిమీద చర్చకే ఆయన ప్రాధాన్యమిచ్చారు. అందువల్లనే ప్రతీకార దాడులూ, వికృత భాషా వ్యవహారాలూ చోటుచేసుకోలేదు. ఈ పరిణామం ప్రతిపక్ష పార్టీలకు కంటగింపుగా మారింది. సమున్నతంగా ఎదిగిన కేసీఆర్ వ్యక్తిత్వం ముందు నిలబడటం ప్రతిపక్ష నాయకులకు సమస్యగా మారింది.

తెలంగాణ ఏర్పడిన మొదట్లో సీనియర్ ప్రతిపక్ష నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించేపుడు ఆచితూచి మాట్లాడేవారు. కేసీఆర్ కూడా ప్రతిపక్షం పట్ల అంతే మర్యాదను పాటించేవారు. రాజకీయ చర్చ ఆరోగ్యకరంగా, హుందాగా సాగింది. ఆంధ్రప్రదేశ్‌తో పోల్చితే తెలంగాణలో రాజకీయ విమర్శలు హుందాగా జరుగుతాయని అప్పుడు అందరూ అనేవారు. అయితే రానురాను పరిస్థితి మారిపోయింది. తెలంగాణ రావడం వల్లనే రాజకీయ ఎదుగుదల పొందిన కొంత మంది నాయకులు, విషయ ప్రధానమైన చర్చ ద్వారా కేసీఆర్‌ను ఎదుర్కోలేమని గ్రహించారు. దీంతో అసభ్యకరమైన భాషను ఉపయోగిస్తూ కేసీఆర్ వ్యక్తిత్వాన్ని న్యూనపరిచే పద్ధతిని ఎంచుకున్నారు. ఉద్యమ సందర్భంలో సమైక్యవాదులు, వారి మీడియా ఏ భాషనైతే ప్రయోగించిందో, ఏ వికృత విమర్శలనైతే ప్రయోగించిందో అదే భాషను, అవే విమర్శలను ఈ నాయకులు అందిపుచ్చుకున్నారు. రాజకీయ విలువలకు తిలోదకాలిస్తూ వ్యక్తిగత దాడిని ముమ్మరం చేశారు. అప్పటి నుంచి తెలంగాణలో రాజకీయ భాష తీవ్రంగా పతనం కావడం ప్రారంభమైంది.

ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యక్తిగత కక్షతో, అసభ్యకరమైన భాషలో వ్యక్తిగత విమర్శలను చేయడమే పద్ధతిగా మార్చుకున్నాడు. ఈ వికృత ధోరణిని ఎక్కువగా ఆవాహన చేసుకున్నాడు. దానికి ఆయన నేపథ్యం కారణం. తెలుగుదేశం పార్టీ నాయకుడిగా రేవంత్‌రెడ్డి ఉద్యమంలో నిర్వహించిన ద్రోహ పాత్ర అందరికీ తెలిసిందే. ఉద్యమకారుల మీద రైఫిల్ ఎక్కుపెట్టిన చరిత్ర ఆయన సొంతం. సమైక్యవాద పాలకుల మానస పుత్రుడిగా ఆయనలో కేసీఆర్ మీద తీవ్రమైన కసి, కక్ష ఎప్పటి నుంచో దాగి ఉన్నాయి. పరాయి పాలకుల చేతుల్లో పావుగా మారిన రేవంత్‌రెడ్డి, కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నంలో డబ్బు సంచులతో సహా రెడ్ హ్యాండెడ్‌గా కెమెరాలకు దొరికిపోయిండు. దీంతో ఆయనలో కసి, కక్ష మరింత పెరిగాయి. తను చేసిన నేరం బహిరంగంగా బయటపడినా రేవంత్ ఏ మాత్రం సంకోచపడలేదు. నిస్సిగ్గుగా ఎదురు దాడికి పూనుకున్నాడు. ప్రజల ముందు ఫజీతా పాలైనందుకు రేవంత్‌రెడ్డి స్థానంలో వేరెవరైనా ఉంటే సిగ్గుతో బిక్కచచ్చిపోయేవారు. కానీ, అందుకు భిన్నంగా తన దుర్మార్గాన్ని, అనైతికతను కూడా ఘనతగానే ప్రచారం చేసుకోవడం రేవంత్‌రెడ్డికే చెల్లింది. విషాదమేమిటంటే ఎంతో చరిత్ర కలిగిన కాంగ్రెస్, తమ పార్టీకి మరెవరూ దిక్కులేనట్లుగా తెలుగుదేశం పార్టీ నుంచి వలస వచ్చిన జూనియర్ నాయకుడు రేవంత్‌రెడ్డిని అధ్యక్షుడిగా ఎన్నుకుంది. కాంగ్రెస్ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి మాటలకు మీడియాలో కవరేజీ పెరిగింది. ఇక అక్కడి నుంచీ తెలంగాణలో బజారు భాష పర్వం పరాకాష్ఠకు చేరింది.

ఎప్పుడో ఒకసారి తప్పుడు భాషలో మాట్లాడటం ఎవరికైనా దొర్లే పొరపాటు. కానీ ఎప్పుడూ తప్పుడు భాషలోనే మాట్లాడటం రేవంత్‌రెడ్డి అలవాటు. ఒక్కమాటలో చెప్పాలంటే తప్పుడు భాషే తన భాష. తనకు వేరే విధంగా మాట్లాడటం రాదు. ముఖ్యమంత్రి స్థానంలో కూర్చొన్న తర్వాత కూడా రేవంత్‌రెడ్డి భాషను మార్చుకోవడానికి సిద్ధంగా లేడు. ఎందుకంటే తప్పుడు భాషనే తనలోని ఆకర్షణగా ఆయన భావిస్తున్నాడు. చవకబారుతనం ద్వారానే చప్పట్లు కొట్టించుకోవచ్చునేది ఆయన నమ్మకం. అదే ఆయనలో ఉన్న వైకల్యం. వెగటుపుట్టే తన భాష ద్వారానే తాను సీఎం కాగలిగానని రేవంత్ నమ్ముతున్నాడు. ఇది ఈ రాష్ట్ర రాజకీయాల్లో దౌర్భాగ్యం. ముల్లును ముల్లుతోనే తియ్యాలి అన్నట్లుగా రేవంత్‌రెడ్డికి ఆయన భాషలోనే సమాధానం చెప్పవచ్చు. అది తేలికైన పనే. కానీ అందుకు ఎవరికైనా విజ్ఞత అడ్డువస్తుంది. అయితే విజ్ఞత బలహీనతగా అనిపించడమే ప్రస్తుత పరిస్థితిలోని విషాదం.

ప్రత్యర్థుల శరీర ఆకృతుల మీద వికృత వ్యాఖ్యలు చేయడాన్ని బాడీ షేమింగ్ అని అంటాం. బాడీ షేమింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. అందుకు ఉదాహరణలు కోకొల్లలు. అవి రాయడానికి ఇక్కడ స్థలం సరిపోదు. నా సంస్కారం సరిపోదు. రాజకీయాలకు సంబంధం లేని పసిపిల్లవాడిని సైతం చర్చలోకి లాగి బాడీ షేమింగ్‌కు పాల్పడ్డ రేవంత్‌రెడ్డి వికృతత్వం గురించి ఏం చెప్పగలం. అప్పుడప్పుడు తప్పుడు మాటలు దొర్లడం వేరు. ఇది నాతో సహా అందరి విషయంలోనూ జరిగింది. కానీ, రేవంత్‌రెడ్డిలాగా ఎప్పుడూ తప్పుడు భాషే మాట్లాడటం రాజకీయ దివాలాకోరుతనం. ఎప్పుడూ తప్పుడు మాటలే మాట్లాడటం వేరు. కనుక భాష విషయంలో రాజకీయ నాయకులందరినీ ఒకే గాటన కట్టడం, కట్టి విమర్శించడం సరికాదు.

తమను తాము న్యూట్రల్స్‌గా చెప్పుకుంటూనే కొంతమంది 'మేధావులు' గత ఎన్నికల్లో కాంగ్రెస్ కోసం పని చేశారు. రేవంత్‌రెడ్డి శ్రేయస్సును కోరుకునే ఆ మేధావులైనా భాష విషయంలో ఆయనకు హితవు చెప్పాలి. మౌనం వహిస్తే పరోక్షంగా సమర్థించినవారే అవుతారు. రాజకీయ సంస్కృతి ప్రభావం మొత్తం సమాజం మీద ఉంటుంది. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి అనునిత్యం భ్రష్ట భాషనే ఉపయోగిస్తే అది మొత్తం సమాజాన్ని ఘోరంగా కలుషితం చేస్తుంది. కనుక యావత్ సమాజం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి, రాజకీయ భాషను సవరించే పనికి పూనుకోవాలి. ప్రజా చైతన్యమే ఈ పాడు భాష నుంచి విముక్తిని ప్రసాదించాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ప్రయత్నానికి దోహదపడేందుకు నేను సన్నద్ధంగా ఉన్నానని తెలియజేస్తున్నాను.

■ తన్నీరు హరీశ్‌రావు
శాసనసభ్యులు, సిద్దిపేట

## మావోయిస్టులు ఈ దేశ పౌరులు కాదా?

గత నెల ఆగస్టు 24న సాక్షాత్తు దేశ హోంమంత్రి అమిత్‌షా మార్చి 2026 నాటికి మావోయిస్టు కార్యకలాపాలు నిర్మూలిస్తామని, మావోయిస్టులకు వ్యతిరేకంగా నిర్దాక్షిణ్య వ్యూహాన్ని అవలంబిస్తామని రాయ్‌పూర్‌లో ప్రకటించారు. ఆ ప్రేరణతోనే ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ సరిహద్దులో 2024 సెప్టెంబర్ 3న ఎన్‌కౌంటర్‌గా చెప్పబడుతున్న ఘటనలో తొమ్మిది మంది మావోయిస్టులను చంపారు. వెనువెంటనే సెప్టెంబర్ 5న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కరకగూడెం పరిధిలో ఆరుగురు మావోయిస్టులు పోలీస్ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. మొత్తంగా ఒక్క 2024లోనే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోనే 136 మంది మావోయిస్టులు చంపబడ్డారు. సేఫ్ జోన్‌గా భావించి అటు నుండి వచ్చి తెలంగాణలోని భద్రాద్రి ప్రాంతంలో తలదాచుకుంటున్న వారిని నిర్మూలించే కార్యక్రమంలో భాగమే కరకగూడెంలో జరిగిన ఎన్‌కౌంటర్.

రాజ్యహింసలో భాగంగా అది ఏ ప్రభుత్వమైన గానీ 1996 నుంచి 2018 వరకు దాదాపు 15 వేల మంది మావోయిస్టులను హతం చేశారు. ఈ కాలంలో నక్సల్ దాడుల వలన కానీ, పోలీసుల పొరపాట్లవల్ల కానీ దాదాపు 4000 మంది సామాన్య పౌరులు మరణించారు. నక్సల్స్ అయినా, సామాన్యులైనా మరణించిన వేలాది మంది మృతులు, హతులలో ఎక్కువ భాగం పేద, దళిత, ఆదివాసియులు ఉన్నారనే విషయం గమనార్హం.

నిరుద్యోగం, ఆకలి బాధలు, అణచివేతలు, సామాజిక అవమానాలు, పేదరికం, భూమి సమస్య, చాలీచాలని వేతనాలు, కండ్ల ముందు కనపడే దౌర్జన్యాలు, అక్రమాలపై ఆవేశంతో కూడిన వర్గ కసితోనే పేదవారు నక్సల్‌గా మారుతున్నారు. దీనిని సామాజిక సమస్యగా భావించకుండా శాంతిభద్రతల సమస్యగా చిత్రీకరిస్తూ అణచివేత, నిర్మూలన కార్యక్రమాలకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టడం ఆటవిక రాజ్యాంగాన్ని తలపిస్తుందే గాని, ప్రజాస్వామ్యం భావన మచ్చుకైనా కలగడం లేదు.

ఈ విధమైన నిర్మూలన కార్యక్రమాలు మొదలెట్టి రాజ్యాధికారం, పోలీసు వ్యవస్థ ద్వారా మరెంతమంది నిండు ప్రాణాలు బలితీసుకుంటారు? బలైనవారి భార్య, బిడ్డలు, తల్లిదండ్రులు, వారి ఆక్రందనలు పాలకుల చెవులకు వినపడవా? వారి వేదనలు, బాధలు కనపడవా? కమ్యూనిస్టులు, మావోయిస్టులు, ప్రశ్నించేవారు దేశద్రోహులా? వారిని చంపడానికి ఏ చట్టాలు వర్తిస్తున్నాయి? దేశంలో ఈనాటి సమన్యాయం నినాదం వెనుక ఉన్నది కమ్యూనిస్టులు కాదా? భారతదేశంలోని విప్లవాలకు, సామాజిక ఉద్యమాలకు పెద్ద దిక్కుగా బాసిల్లినటువంటి చండ్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, అలాగే కమూనిస్టు పార్టీ నాయకులు ఇంద్రజిత్‌గుప్తా, భూపేష్ గుప్తా, హీరేన్ ముఖర్జీ, గురుదాస్ దాస్‌గుప్తా భారతదేశ పార్లమెంటులో ఉత్తమ పార్లమెంటేరియన్లుగా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ విముక్తి కోసం ప్రాణాలర్పించిన 4500 మంది యోధులను అందించినది కమ్యూనిస్టు పార్టీ కాదా? తెలంగాణ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, అలాగే దేశంలోని అనేక ప్రాంతాల్లోని పేద ప్రజల కొరకు భూ పోరాటాలు, వెట్టిచాకిరి విముక్తి పోరాటాలు, కుల వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమాలు ప్రారంభించింది కమ్యూనిస్టులు కాదా? ఇంకా దేశం కోసం, తెలంగాణ సమాజం కోసం సర్వస్వం త్యాగం చేసిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్యలాంటి యోధులను అందించింది కమ్యూనిస్టు పార్టీ కాదా? దేశంలోని ప్రతి ప్రగతిగామి చట్టం రూపకల్పన కమ్యూనిస్టుల పోరాట ఫలితం కాదా? ల్యాండ్ సీలింగ్ లాంటి చట్టాల సాధన గానీ, ఎనిమిది గంటల పని హక్కు గానీ, అటవీ హక్కుల చట్టం గానీ, రైతాంగ చట్టాలు గానీ, విద్యా వ్యవస్థలో మార్పులు గానీ, సాంస్కృతిక విప్లవాలు గానీ ఇవన్నీ కమ్యూనిస్టుల ద్వారానే కదా సాధ్యమైంది. తమ కవిత ద్వారా అగ్నిధార కురిపించిన దాశరథి కృష్ణమాచార్య, అలాగే ఆయన సోదరుడు దాశరథి రంగాచార్య, మాటలను తూటాలుగా పేర్చి నిప్పు కణికలు కురిపించి, సామాజిక విప్లవాగ్నిని రగిలించిన శ్రీశ్రీ, సామాన్యుడి వేదన, శోధనకు ప్రతీకగా నిలిచిన ఆరుద్ర లాంటి వారికి ప్రేరణ కల్పించింది కమ్యూనిజం కాదా?




అమిత్ షా చెప్పినట్లుగా 2026 నాటికి మావోయిస్టులను గానీ, ప్రశ్నించే వారిని గానీ హతం చేయవచ్చు. కానీ, మనిషి ఆలోచనలు, భావాలు, ఆవేదనలు, ఆకలి బాధలు నిరంతరం ఉంటాయి. వాటినుంచే విప్లవాలు పుడుతాయి. కూలిపోయిన సమాజం నుంచి చైతన్య పోరాటాలు విలసిల్లుతాయి. సమాజం ఉన్నంత కాలం ప్రశ్న ఉంటుంది. ప్రజలలో భావాలుంటాయి. ప్రశ్న శాశ్వతం. భావాలను అణచలేరు. అంతిమంగా ప్రజలే విజేతలు.



ఏ తప్పు చేయనటువంటి వరవరరావు, సాయిబాబా లాంటి మేధావులను కూడా జైళ్లలో నిర్బంధిస్తున్నారు. బెయిల్ వచ్చిన వరవరరావును కూడా బయటికి రాకుండా ఇప్పటికీ అడ్డుకుంటున్నారు. కేంద్ర విజిలెన్స్ సంస్థల ద్వారా ప్రొఫెసర్ హరగోపాల్, జర్నలిస్టు వేణుగోపాల్ లాంటి వారిపైన కూడా ఊపా చట్టాలను ప్రయోగిస్తూ నిర్బంధాలకు గురి చేస్తున్నారు.

రామకృష్ణ, గణపతి, గణేష్ ఇంకా అనేకమంది బాగా చదువుకున్న మేధావులు తమ కుటుంబాలను త్యాగం చేస్తూ అడవిబాటను ఎంచుకున్నారు. వారి మార్గం తప్పుకావచ్చు. కానీ వారి ఆవేశం న్యాయమైనదే. ముక్కుపచ్చలారని రామకృష్ణ కుమారుడు మున్నాను కూడా ఇటీవలే ఎన్‌కౌంటర్ పేరుతో హతం చేశారు. కమ్యూనిస్టు పార్టీకి, నక్సల్స్‌కు విధానపరమైన విభేదాలున్నప్పటికీ, ప్రశ్నను అణిచివేయడం, ప్రశ్నించే వారిని మానవ హననం చేయడాన్ని కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. సీపీఐ రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా నలమల్ల గిరిప్రసాద్ ఉన్న కాలంలో అక్రమ కేసులతో జైళ్లలో మగ్గుతూ, ఎటువంటి అండదండలు లేని వారిని విడిపించడం కోసం కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఒక లీగల్ సెల్‌ను, పౌరహక్కుల సంఘాన్ని ఏర్పాటు చేయడాన్ని గుర్తుచేస్తున్నాను.

అమిత్ షా చెప్పినట్లుగా 2026 నాటికి మావోయిస్టులను గానీ, ప్రశ్నించే వారిని గానీ హతం చేయవచ్చు. కానీ, మనిషి ఆలోచనలు, భావాలు, ఆవేదనలు, ఆకలి బాధలు నిరంతరం ఉంటాయి. వాటి నుంచే విప్లవాలు పుడుతాయి. కూలిపోయిన సమాజం నుంచి చైతన్య పోరాటాలు విలసిల్లుతాయి. సమాజం ఉన్నంత కాలం ప్రశ్న ఉంటుంది. ప్రజలలో భావాలుంటాయి. ప్రశ్న శాశ్వతం. భావాలను అణచలేరు. అంతిమంగా ప్రజలే విజేతలు.

మావోయిస్టు సోదరులకు కూడా ఒక సూచన చేస్తున్నాను. నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారా ప్రజా ప్రభుత్వం స్థాపించాలనే లక్ష్యంగా గల మీ హక్కును ప్రశ్నించలేము. కానీ ఒక సూచన. ప్రజలను సన్నద్ధం చేసి, చైతన్యపరచకుండా విప్లవ బాటను ఎంచుకోవడం వల్ల వృథా త్యాగాలు మిగులుతాయి. అలాగే హింసకు ప్రతిహింసే సమాధానంగా ప్రభుత్వ రాజ్యహింసకు బలం చేకూర్చే విధంగా కోవర్టుల పేరుతో సామాన్యులను హతమార్చడం (ఇటీవలే రాధ అనే మహిళను కోవర్టు అనే పేరుతో హతమార్చారు), పోలీసు అధికారులు, క్రింది స్థాయి పోలీసులను హతమార్చడం వలన ప్రజా సానుభూతిని కోల్పోతున్నారు. క్రింది స్థాయి పోలీసులు కూడా పేదవారే. ప్రజల సానుభూతిని కోల్పోకుండా మద్దతు పొందే విధంగా మన చర్యలు ఉండాలి. అలాగే ప్రభుత్వ బలగాలు, సైన్యం, పోలీసులతో కూడిన రాజ్యంపై తిరుగుబాటు చేసే క్రమంలో మన ప్రజాబలాన్ని మనకున్న ప్రజాసైన్యం బలాన్ని కూడా అంచనా వేసుకోవాలి.

అందువలన లెనిన్ చూపిన మార్గం అనుసరించి ముందుగా ప్రజాశ్రేణులను, బలమైన ఉద్యమాలను రూపొందించుకోవలసిన అవసరముంది. ఓబీసీలు, దళితులు, గిరిజనులు, ఉద్యోగ, కార్మిక, అసంఘటిత, కనీస వేతనం పొందని కోట్లాది మందిలో రైతాంగం, వ్యవసాయ కూలీలులాంటి వర్గాల్లో పట్టును సాధించుకొని విప్లవ పరివర్తన సాధనకు కృషి చేయవలసిన అవసరముంది. ఆ సమయంలో పాలక వర్గాలు అధికారాన్ని అంటిపెట్టుకుని ఉండటానికి అన్ని రకాల దమన చర్యలు, బల ప్రయోగం, హింస కొనసాగిస్తాయి. ఆధునిక టెక్నాలజీ గూగుల్ శాటిలైట్ మ్యాప్స్, ఫోన్ సిగ్నల్స్, డ్రోన్స్‌ను ఉపయోగిస్తూ నిర్బంధాన్ని మరింత పెంచుతారు. మనకున్న సమ ప్రజా బలంతో వారి హింసను, బలప్రయోగాన్ని త్రిప్పికొట్టే తిరుగుబాటు మార్గాన్ని ఎంచుకోవచ్చు. 1964లో కమ్యూనిస్టు ఉద్యమ చీలిక ఎవరు అంగీకరించినా, అంగీకరించకపోయినా దేశానికి తీవ్రమైన నష్టాన్ని కలిగించింది. కమ్యూనిస్టులందరూ కలవాల్సిన సమయం ఉత్పన్నమయింది. ఈ దేశంలో పేద ప్రజలు, అణగారిన వర్గాలు, మేధావులు, కమ్యూనిస్టుల ఏకీకరణకు ఎదురు చూస్తున్నారు. ఆ రోజు మరెంతో దూరంలేదని ఆశిద్దాం.

• కూనంనేని సాంబశివరావు
ఎంఎల్‌ఏ, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

## ధర్మరక్షణ బోర్డు ప్రతిపాదన ఒక సవాలు!



సనాతన ధర్మ రక్షణకై జాతీయ స్థాయిలో ఒక బోర్డ్ ఏర్పాటు చేయాలని పవన్ కళ్యాణ్ సూచించడం ఆశ్చర్యకరమైన, ఎంతో ఆహ్వానించదగిన విషయం. సాధారణంగా రాజకీయ నాయకులు మతాలకు అతీతంగా ఉన్నట్టు వ్యవహరిస్తుంటారు. అయినా పవన్ కళ్యాణ్ ప్రజానాయకుడిలా ఆలోచించి మాట్లాడారు. ఈ ప్రతిపాదన ద్వారా ఆయన నిద్రపోతున్న హిందూ సమాజానికి, హిందూ మత పెద్దలకు, ప్రభుత్వాలకు అందరికీ ఒక సవాలు విసిరారు అందుకు ఆయన అభినందనీయులు.

సనాతన ధర్మానికి చెందినవారు సుమారు 80శాతం వరకు ఉన్నారు, అల్పసంఖ్యాకులకైతే రక్షణ కావాలి గాని మెజారిటీ వర్గానికి రక్షణ ఏమిటి అని ఒక ప్రశ్న రావచ్చు. అయితే దేశ స్వాతంత్ర్యం తరువాత రాజకీయ ధోరణుల్ని పరిశీలిస్తే అన్నింటికన్నా ఎక్కువ హాని సనాతన ధర్మానికి జరిగిందని చూడగలం. ప్రపంచంలో వందకు పైగా దేశాలు క్రిస్టియన్ దేశాలని, యాభైకి పైగా ఇస్లామిక్ దేశాలని చెప్పుకుంటున్నాయి కానీ 80 శాతం హిందువులు ఉన్న ఈ దేశాన్ని హిందూ దేశమని చెప్పలేం. హిందూ మతాన్ని నిర్మూలించడానికి, దేశాన్ని విడగొట్టడానికి ఎన్ని బయట శక్తులు ప్రయత్నిస్తున్నాయో ఈ వ్యాసంలో చెప్పదలచుకోలేదు. ఒక హిందూ మతాన్ని నిర్మూలించగలిగితే మిగతా మతాలన్నీ వాటంతటవే బలహీనమై కనుమరుగవుతాయి. ఒక హిందూ మతం నశిస్తే భారత్‌లో కూడా ఆఫ్రికా దేశాల్లో లాగా రెండు అబ్రహామిక్ మతాల మధ్య పోరాటాలు, అంతర్యుద్ధాలతో దేశం విడిపోతుంది. అలా చేయాలనే విదేశీ మేధావుల ప్రణాళికలు. అందువల్ల కేవలం హిందూ మతం పైనే విదేశీ శక్తుల ప్రయత్నాలన్నీ.

ప్రపంచంలో ఒకే ఒక హిందూ దేశంగా గుర్తించబడిన నేపాల్‌ను వామపక్ష మేధావులు మావోయిస్టుల చేతిలో పెట్టారు. మనదేశంలోని మార్క్సిస్టులు కూడా నేపాల్ మార్క్సిస్టులతో సహకరించి మావోయిస్టు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ముఖ్య పాత్ర వహించారు. భారత్‌కు నేపాల్‌కు ఉన్న సాంస్కృతిక సంబంధాలను తెగగొట్టడానికి అన్ని ప్రయత్నాలు చేశారు. నేపాల్‌ను చైనాకు బానిసదేశంగా మార్చిన ఈ మేధావులే భారతదేశాన్ని కూడా అలా చేయాలని దీర్ఘకాలిక వ్యూహాలతో ఉన్నారు.

మత ప్రాతిపదికపై ఏర్పడిన ఓటు బ్యాంకులు రాజకీయ వర్గాలను ప్రభావితం చేస్తాయి. దీనితో రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకులను సంతృప్తిపరిచే పథకాలను అమలు చేస్తారు. మెజారిటీ వర్గాన్ని ఏ విధంగా కులాల పేరిట చీలగొట్టారన్నది అందరికీ తెలిసిందే. హిందూ సమాజానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడానికి ఏ వర్గము ముందుకు రాలేదు. భారతీయ మతాల గురించి మాట్లాడే ఆరెస్సెస్–విశ్వహిందూ పరిషత్ లాంటి సంస్థలకు మత ఛాందసవాదులు అనే ముద్ర వేసి వాటిని నోరెత్తకుండా చేస్తున్నాం. కానీ అదే సమయంలో ఇతర మతాల సంస్థలకు పెద్దపీట వేసి మన ఉదార స్వభావాన్ని చాటుకుంటున్నాం. సెక్యులరిజం ఇదే అంటున్నాం. ఇతర మతాల రక్షణకై ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన సంస్థలను చూస్తే ఇది స్పష్టం అవుతుంది. దేవాలయాల ఆస్తుల్ని రక్షించుకోవడానికి ఉన్న ఎండోమెంట్ లాంటి వ్యవస్థలు నామమాత్రంగానే ఉన్నాయి. వాటిలో పనిచేసేవారు ప్రభుత్వ కీలుబొమ్మలే, అధికార పార్టీల కీలుబొమ్మలే.

ఇతర మతాల పుస్తకాల్ని మనం చదవకపోవడం, మన పుస్తకాల గురించి ఎదుటివాడు చెప్పిన దాన్ని నమ్మడం మన లక్షణం. సొంత బుద్ధితో అన్ని మతాల గూర్చి చదివితే సనాతన ధర్మాన్ని ఎందుకు రక్షించుకోవాలో మనకే తెలుస్తుంది. ఈ విషయంపై ఎంతో చెప్పవచ్చు. సమాజంలోని వ్యక్తి మతానికి అతీతంగా వెళ్లి తన స్వరూపాన్ని తెలుసుకోవాలని చెప్పే ఒకే ఒక మతం హిందూ మతం. జీవుడే భగవంతుడు అన్న విషయాన్ని తెలుసుకొని అలా వ్యవహరించమని చెప్పే మతం. ఇందులో చెప్పబడిన దేవుడు కూడా ఎవరి పట్ల ద్వేషం లేని వ్యక్తి. నన్నే పూజించు అని ఏ దేవుడు చెప్పడు. నన్ను కాక ఎవరిని పూజించిన నన్ను పూజించినట్లే అని కూడా భగవద్గీతలో శ్రీకృష్ణుడు అంటాడు. మత దురహంకారం లేని ఒకే ఒక మతం హిందూ మతం. వందలాది సంప్రదాయాలు ఉన్నప్పటికీ వాటన్నింటినీ కలిపి ఉంచిన ఉపనిషత్తుల సిద్ధాంతం ప్రపంచానికి ఆదర్శప్రాయమైంది. ఎదుటివాడిని తమ మతంలోకి మార్చాలి అనే ప్రస్తావన ఇందులో లేదు. ప్రపంచ శాంతికి ఒకే ఒక మార్గం సనాతన ధర్మం.



ఇతర మతాల పుస్తకాల్ని మనం చదవకపోవడం, మన పుస్తకాల గురించి ఎదుటివాడు చెప్పిన దాన్ని నమ్మడం మన లక్షణం. సొంత బుద్ధితో అన్ని మతాల గూర్చి చదివితే సనాతన ధర్మాన్ని ఎందుకు రక్షించుకోవాలో మనకే తెలుస్తుంది. ప్రపంచ శాంతికి ఒకే ఒక మార్గం సనాతన ధర్మం.

సనాతన ధర్మం అంటేనే కులం అని అసహ్యించుకునే వాళ్ళు ఉంటారు. కానీ హిందూ మతం కులాన్ని సృష్టించలేదన్న విషయం మన పుస్తకాలను చదివితేనే తెలుస్తుంది. హిందూ మతం కుల వ్యవస్థను సృష్టించినట్లు ఏ పుస్తకంలోనూ చూడలేము. సమాజం అవసరాలను బట్టి కులాలు ఏర్పడ్డాయి గాని ఏ దేవుడు గాని, ఏ ఋషి గాని కులాన్ని సృష్టించలేదు– అని సవాలు చేసి ఈ విషయంపై నా ఇటీవలి పుస్తకంలో చర్చించడం జరిగింది.

సనాతన ధర్మం పరిధి చాలా విస్తారమైనది. వైదిక సంస్కృతితో మొదలైన ఈ ధర్మానికి బౌద్ధం, జైన మతం సిక్కు మతం కాల క్రమంలో కొత్త శాఖలుగా వచ్చాయి. వీటన్నింటిని ప్రస్తుతం భిన్న మతాలుగా మనం చెపుతున్నప్పటికీ మన సంప్రదాయం ప్రకారం వీటన్నిటిని వివిధ దర్శనాలుగానే పేర్కొన్నారు. వీటన్నింటిలో సిద్ధాంత విషయంలో భేదం కొంత ఉన్నప్పటికీ ధర్మం విషయంలో తేడా లేదు. సనాతన ధర్మం రక్షణ బోర్డ్ పరిధిలోకి హిందూ మతం మాత్రమే కాక బౌద్ధం, జైన మతం, సిక్కు మతాలను కూడా చేర్చవచ్చు. హిందూమతంలోనే వందలకొద్దీ సంప్రదాయాలు మరి వీరందరూ ఈ బోర్డు పరిధిలోకి రావడానికి అంగీకరిస్తారా అన్నది ఒక విషయం. తమ ఉనికిని కాపాడుకోవాలంటే అందరూ ఈ బోర్డు పరిధిలోకి రావడం ఒకటే మార్గం.

○ కె. అరవిందరావు
మాజీ డీజీపీ

## ఒకే దేశం ఒకే ఎన్నికకు ఇది సమయం కాదు

కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం ఒకే ఎన్నికల విధానానికి అంగీకారం తెలిపింది. అది చట్టమై, కార్యరూపం దాల్చడానికి మొదటిగా అవసరమైన కేబినెట్ ఆమోదం పొందింది. అయితే ఈ దిశగా ఇది మొదటి అడుగు మాత్రమే. వాస్తవ రూపం పొందాలంటే చాలా దూరం, సమయం, కృషి అవసరమౌతాయి. నిజానికి దేశమంతా, రాష్ట్రాల, స్థానిక సంస్థలు సహా ఎన్నికల్ని ఒకేసారి పూర్తి చెయ్యాలనుకోవడం మంచిదే. అది ఆచరణలో పెట్టడానికి మాత్రం ఇప్పుడున్న వాతావరణం గానీ, సంసిద్ధత గానీ సరిపోదు. ఉదాహరణకి ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలనే తీసుకుందాం. జమ్మూకాశ్మీరు, హర్యానా, మహారాష్ట్రలకు ఒకేసారి జరపొచ్చు. కానీ పండుగలు, భద్రత పేరుతో మహారాష్ట్ర ఎన్నికల్ని ఎన్నికల సంఘం వెనక్కి పెట్టింది. మూడు రాష్ట్రాల ఎన్నికల నిర్వహణకే ముప్పయిసార్లు ఆలోచించాల్సి వస్తే, దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడాన్ని ఆలోచించగలమా? రెండోది అలా చేస్తే ఖర్చు తగ్గుతుందని అంటున్నారు. ఎలా తగ్గుతుంది? ఇప్పుడున్న యంత్రాల్ని వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరుగుతున్నప్పుడు చక్కగా తక్కువ ఖర్చుతో వాడుకోవచ్చు. అదే దేశమంతా అయితే అందుకు సరిపడా కోట్ల కొద్దీ యంత్రాల్ని సమకూర్చుకోవాలి. బలగాల్ని, సిబ్బందినీ ఎక్కువగా నియమించాలి. ఎన్నికల దశల్ని పెంచాలి.

మరో వైపు పంచాయితీ ఎన్నికలకు కూడా జాతీయ అంశాలే అజెండా అవుతాయి. స్థానిక అంశాల్ని, స్థానిక పార్టీల్ని అప్రధానంగా మార్చేస్తాయి. రాష్ట్రాల్లో ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ రాకపోయినా, ఒకవేళ వచ్చినా కేంద్రంలో బలమైన పక్షం తలచుకుంటే రాష్ట్ర పాలనలో ఒడిదుడుకులు ఎక్కువవుతాయి. ఎన్నికైన ప్రభుత్వం ఒకవేళ మధ్యలో పడిపోయి ఎన్నికలకు వెళ్తే ఆ ప్రభుత్వానికి ఐదేళ్ల ఆయుష్షు ఉండదన్న భయంతో, ఆ పరిస్థితి తప్పించడానికి పార్టీల్లో కప్పదాట్లు పెరుగుతాయి. వీటన్నింటి కన్నా ముందు ఈ విధానానికి మద్దతుదారు బీజేపీకి పార్లమెంటులో సంపూర్ణ ఆధిక్యం లేదు. మిత్రుల మధ్య కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. మూడింట రెండొంతుల మెజారిటీతో అవసరమైన రాజ్యాంగ సవరణలు ఈ విధానానికి కావాలి. ఆ బలం ప్రస్తుతానికి పాలక పక్షానికి లేదు. సగం రాష్ట్రాల మద్దతు సాధించడం కూడా కష్టం. కాబట్టి ప్రస్తుతానికి ఒకే దేశం ఒకే ఎన్నికలకు ఇది సమయం కాదు.

– డి.వి.జి. శంకరరావు

## చైతన్య మహిళా సంఘం ఆవిర్భావ దినోత్సవ సభ

మహిళలకు ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమానత్వం కోసం 1995లో ఆంధ్రప్రదేశ్ చైతన్య మహిళా సంఘం ఏర్పడింది. అప్పటి నుంచి రాజ్యహింసని ఎదుర్కొంటూ రాజీలేని పోరాటం చేస్తూనే ఉంది. చట్టాలలో మార్పులు, సవరణలు జరిగినప్పుడు వర్క్‌షాప్స్ పెట్టి కార్యకర్తలకు అవగాహన కలిగించింది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొంటూ 2010 సెప్టెంబర్ 24న చైతన్య మహిళా సంఘంగా పేరు మార్చుకున్నది. నేడు సమాజంలో మహిళల పరిస్థితి అధ్వానంగా తయారయింది. పసిపిల్లల నుంచి ముసలి వాళ్ల వరకు అందరిపై లైంగిక దాడులు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. పనిచేసే చోట మహిళలకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. మహిళల భద్రత కోసం ఎన్ని చట్టాలు వచ్చినా అమలు మాత్రం శూన్యం. అత్యాచారాల నివారణ కోసం మత్తు పదార్థాలను బ్యాన్ చేయాలని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వానికి నివేదికలు ఇస్తోంది. ఈ నేపథ్యంలో చైతన్య మహిళా సంఘం 29వ ఆవిర్భావ దినోత్సవ సభ హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నేటి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరుగుతుంది. కె. శ్రీనివాస్, దీప్తి, సంధ్య, అనసూయ, స్వరూప, కృష్ణకుమారి, మల్లు లక్ష్మి ప్రసంగిస్తారు.

– చైతన్య మహిళా సంఘం



# రామప్ప భద్రత.. గాలిలో దీపమేనా?

- 20 ఉప ఆలయాల పరిస్థితీ అంతే
- రూ.కోట్లలో అభివృద్ధి పనులు.. అయినా కరువైన రక్షణ
- ప్రపంచ స్థాయి గుర్తింపున్నా కానరాని సీసీ కెమెరాలు
- నిర్వహణపై భక్తుల ఆక్షేపణలు

7



రక్షణ చర్యలకు నోచుకోని రామప్ప దేవాలయం ఆవరణలోని ఉప ఆలయం గొల్లాలగుడి



అది ప్రపంచ వారసత్వ సంపదగా.. యునెస్కో గుర్తింపు పొందిన.. ప్రాచీన శిల్పకళా సంపదకు నిలయమైన రామప్ప దేవాలయం. ఇక్కడ ప్రధాన ఆలయానికి అనుబంధంగా 20 ఉప ఆలయాలున్నాయి. ఈ అద్భుత కట్టడాలను తిలకించేందుకు వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. అలాంటి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చిస్తున్నా.. రక్షణ మాత్రం కరువైంది. ఇందుకు ఇటీవల రామప్ప అనుబంధ ఆలయమైన గొల్లాలగుడి వద్ద గుప్తనిధుల కోసం జరిగిన తవ్వకాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. అంతేకాదు ఏకంగా వెయ్యి కిలోల బరువున్న నక్షత్రాకారపు ప్రాకారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు కిందికి తోశారు. దీంతో రామలింగేశ్వరుడి రక్షణపై అనుమానాలు పెరుగుతున్నాయి. అయితే రామప్ప పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం పట్ల ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి.

- వెంకటాపూర్ (రామప్ప)




# అనుమతుల కోసం అడ్డదారులు!

- ఫార్మసీ కళాశాలల కేయూ అధికారుల మాయాజాలం
- బోధన, పరిశోధన పరికరాలు, వసతుల్లేకున్నా ఓకే
- వర్సిటీ బృందం తనిఖీల్లో వెలుగులోకి వాస్తవాలు
- ఆ కమిటీ నిరాకరణ తర్వాత.. మరో కమిటీ నియామకంతో అనుమానాలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23: కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఫార్మసీ కళాశాల కోర్సుల నిర్వహణకు అనుమతులిచ్చే విషయంలో వర్సిటీ ఉన్నతాధికారులు అడ్డదారులు తొక్కారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆగస్టు చివరి వారంలో తనిఖీల కోసం వర్సిటీ ఉన్నతాధికారులు ఏర్పాటు చేసిన కమిటీని కాదని సెప్టెంబరు 6న మళ్లీ అదే కళాశాలలకు అనుమతి కోసం మరో కమిటీని నియామిస్తూ తీసుకున్న నిర్ణయమే ఇందుకు నిదర్శనమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో డీ ఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ కళాశాలున్నాయి. ఒక్కో కళాశాల రాష్ట్ర ప్రభుత్వం అనుమతితో పాటు సంబంధిత వర్సిటీ అనుమతి తీసుకుని కళాశాల నిర్వహించుకోవాల్సి ఉంటుంది. ఏటేటా సంబంధిత కళాశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, బోధనేతర సౌకర్యాలపై వర్సిటీ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా తనిఖీలు చేపడతారు. ఆ తర్వాత అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆయా కళాశాలలకు వర్సిటీ అనుబంధ గుర్తింపును కొనసాగిస్తోంది. అయితే 2024-25 ఏడాదికి గాను ఆగస్టు చివరి వారంలో వర్సిటీ ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ కృష్ణవేణితో పాటు వర్సిటీలోని డీన్ అకాడమిక్, డీన్ సీడీసీ అధికారుల నేతృత్వంలో వర్సిటీ పరిధిలోని ఫార్మసీ కళాశాల తనిఖీలు చేపట్టారు. వీరు ఉమ్మడి ఖమ్మం, వరంగల్‌లోని పలు ఫార్మసీ కళాశాలలను తనిఖీలు చేశారు.

### వర్సిటీ తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు

వర్సిటీ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య నేతృత్వంలో వర్సిటీ పరిధిలోని ఫార్మసీ కళాశాలల్లో చేపట్టిన తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూసినట్టు తెలిస్తోంది. ప్రధానంగా ఖమ్మంలోని 3 ఫార్మసీ కళాశాలల్లో సరైన బోధన, పరిశోధన పరికరాలు లేవని గుర్తించారు. అలాగే వాస్తవాలను వక్రీకరించి ఓ కళాశాల యాజమాన్యం తప్పుడు పత్రాలను సృష్టిం చినట్టు గుర్తించారు. దీంతో ఈ ఏడాదికి కోర్సుల అను మతికి ఫార్మసీ డీన్ నేతృత్వంలోని తనిఖీల కమిటీ నిరాకరించింది. అంతేకాకుండా గతంలో ఆయా కళాశా లలకు ఎలా అనుమతులు ఇచ్చారనే అంశంపై ఆరా తీశారు. కళాశాలలో కనీస ప్రమాణాల్లేకుండా బోధన పరిశోధన ఏలా సాగించారనే విషయాలపై కమిటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం. ఆ కళాశాల అనుమతుల విషయంలో గతంలో వర్సిటీ ఉన్నతాధికారులు వసూళ్లకు పాల్పడినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### అదే కళాశాలల తనిఖీలకు మరో కమిటీ..

ఆగస్టు ఆఖరి వారంలో ఫార్మసీ కళాశాల అనుబంధ గుర్తింపు కోసం తనిఖీలకు నియమించిన ఫార్మసీ డీన్ కమిటీని కాదని వారం రోజుల్లోనే రాజకీ య ఒత్తిళ్లకు తలొగ్గి రెండో కమిటీని నియ మించడం వర్సిటీలో వివాదాస్పదంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 3 ఫార్మసీ కళాశాలలకు అనుమతులను నిరాకరించడంతో ఈనెల 6న మరో కమిటీని నియమించారనే విమర్శలున్నాయి. ఖమ్మంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర రాజకీ య పలుకుబడిన కల్గిన నాయకులు వర్సిటీ ఉన్నతాధికారులపై ఒత్తిడి పెంచడంతోనే మరో కమిటీని నియమించి ఫార్మసీ కళాశాలకు అనుమతులు ఇప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

రెండో దఫా నియామించిన కమిటీలో వర్సిటీ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలకు చెందిన డాక్టర్ స్వరూప, డాక్టర్ షయేదా. డాక్టర్ నాగరాజు, డీన్ సీడీసీ, డీన్ అకాడమిక్ అధికారుల బృందంతో మరో కమిటీని నియామించారు.

### ఆరోపణలు ఇవే..

ఖమ్మంలోని మూడు ఫార్మసీ కళాశాలకు అనుమతులు నిరాకరించడంతో వాటిలో లోపాలపై చర్చలకు దారితీస్తోంది. ప్రధానంగా ఫార్మసీ కళాశాలకు ఆసుపత్రుల అనుబంధాలు లేవు. అలాగే సరైన బోధన సిబ్బంది లేరని, సరైన బోధన సిబ్బందితో పాటు కళాశాలకు సరైన రాష్ట్ర ప్రభుత్వ అనుమతుల్లేవని గుర్తించారు. వర్సిటీ పరిధిలోని ఫార్మసీ కళాశాలల్లో అనుమతులను మొదటి తనిఖీల కమిటీ నిరాకరించడంతో ఆయా కళాశాలల యాజమాన్యాలు రాజకీయ పైరవీలు, ఒత్తిళ్లు మొదలుపెట్టారు. మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ వీప్‌లు, ఎమ్మెల్యేలు, ఇతర పలుకుబడిన అధికార పార్టీ నేతలు వర్సిటీ ఉన్నతాధికారులపై పైరవీలకు దిగారు. ఒత్తిళ్ళు పెంచారు. ఎలాగైన తమ అనుచరుల కళాశాలకు ఫార్మసీ అనుబంధ గుర్తింపును కొనసాగించాలని తీవ్ర ప్రయత్నాలు మొదలెట్టారు.

### సెకండ్ ఒపీనియన్ కోసమే రెండో కమిటీ

- ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, రిజిస్ట్రార్, కేయూ వరంగల్



కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలల 2024-25 ఏడాది వర్సిటీ అనుబంధ గుర్తింపు కోసం మొదటి కమిటీని నియమించాం. అయితే కళాశాల యాజమాన్యాలు తమ అభ్యంతరాలతో వినతి పత్రాలను ఇచ్చాయి. కమిటీ వచ్చిన సమయంలో తాము ప్రిపరేషన్‌లో లేమని మరికొంత సమయం కావాలని అడిగాయి. దీంతో ఇన్‌చార్జి వీసీ ఐఏఎస్ అధికారి వాకాటి కరుణ అనుమతితో సెకండ్ ఒపినియన్ కోసమే రెండో కమిటీని నియమించాం. దీనిపై ఎలాంటి అభ్యంతరాలు లేవు. పూర్తి ప్రజాస్వామ్య బద్ధంగానే కమిటీలు పనిచేస్తాయి.



బాధితుల నుంచి వినతులు స్వీకరించి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య

# సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- ప్రజావాణిలో కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 23 : ప్రజావాణికి వచ్చే సమస్యలు వెంటనే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు వచ్చారు. గత 3 వారాలు అనివార్య కారణాల వలన ప్రజావాణి నిర్వహించకపోవడంతో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి పెద్ద సంఖ్యలో బాధితులు సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ప్రజావాణికి 139 దరఖాస్తులు రాగా అందులో ఎక్కువగా రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించినవి వచ్చాయి. ప్రతీ సమస్యపై వచ్చిన దరఖాస్తును కలెక్టర్ ప్రావీణ్య ఓపికగా పరిశీలించి సంబంధిత అధికారిని పిలిచి సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరిస్తామని, బాధితులు అధైర్య పడొద్దన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో వై.వి గణేష్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### 139 దరఖాస్తులు..

బాధితుల నుంచి 139 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా హనుమకొండ ఆర్డీవో కార్యాలయానికి 22 దరఖాస్తులు వచ్చాయి. జీడబ్ల్యూఎంసీకి 10 దరఖాస్తులు రాగా కాజీపేట తహసీల్దార్ కార్యాలయానికి 7, పరకాల ఆర్డీవో కార్యాలయానికి 6, ఎంజీఎం సూపరింటెండెంట్‌కు 6, కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి 6, ఐనవోలు తహసీల్దార్ కార్యాలయానికి 6, శాయంపేట తహసీల్దార్ కార్యాలయానికి 5, 2 బీహెచ్‌కే నోడల్ ఆఫీసర్‌కు 4, శాయంపేట ఎంపీడీఓ కార్యాలయానికి 4, హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయానికి 4 దరఖాస్తులతో పాటు మిగతా డిపార్ట్‌మెంట్‌లకు 2, 3, 1 దరఖాస్తుల చొప్పున వచ్చాయి. ఇందులో జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన సమస్యలపై ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి.



# రాక్షస పాలన పోయి.. ప్రజాపాలన వచ్చింది

- వరంగల్, ఖమ్మంలో హైడ్రా ఏర్పాటు చేయాలి
- నాలాలు, అక్రమ కట్టడాలు కూల్చివేయాలి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు
- సన్న రకం వడ్లకు రూ.500 బోనస్
- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

భీమదేవరపల్లి, సెప్టెంబరు 23: రాష్ట్రంలో రాక్షస పాలన పోయి.. ప్రజా పాలన వచ్చిందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రామ్ అన్నారు. మండలంలోని కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం కోడె మొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపు చెల్లించారు. ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో కోదండరామ్‌కు స్వాగతం పలికారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నియంతృత్వ పాలన పీడ విరగడయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజాపాలన వచ్చిందన్నారు. అన్ని రంగాల ప్రజలకు న్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఈ ఖరీఫ్ సీజన్ నుంచే సన్న వడ్లకు రూ. 500 బోనస్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేస్తామన్నారు. తెలంగాణ జన సమితి భవిష్యత్‌లో మరింత బలపడే అవకాశం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించాలని కోరిన కోరిక తీర్చిన వీరభద్రస్వామికి ముడుపు కట్టానన్నారు. కానీ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన రాష్ట్రంలో నియంతృత్వ పాలన పదేళ్లు సాగిందన్నారు. దీంతో వీరభద్రస్వామి ముడుపు చెల్లించలేదన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాపాలన రావడంతో ముడుపు చెల్లించానన్నారు. వరంగల్, ఖమ్మం జిల్లాలో హైడ్రా ఏర్పాటు చేయాలన్నారు. ఖమ్మం జిల్లాలో మొన్న కురిసిన వర్షాలకు సగం పట్టణం జలమయమైందన్నారు. గతంలో వరంగల్ జిల్లాలో కూడా ఇదే పరిస్థితి నెలకొందన్నారు. దీంతో నాలాలు, చెరువులో అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేయాలన్నారు. ఇందుకు ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీనే వేతనాలు వస్తున్నాయన్నారు. అలాగే ఆలయాల్లో పనిచేసే అర్చకులకు 1వ తేదీనే వేతనాలు అందించేలా సీఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానన్నారు. తమకు 1వ తేదీనే వేతనాలు అందించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ కోదండరామ్‌కు అర్చకులు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో జేఏసీ ఛైర్మన్ ద్యాగల సారయ్య, జేఏసీ కో-కన్వీనర్ చెప్యాల ప్రభాకర్, ఉప్పుల కుమారస్వామి, చెప్యాల ప్రకాష్, కాశిరెడ్డి ఆదిరెడ్డి, గాండ్ల పద్మ, మాట్ల వెంకటస్వామి, రేణికుంట్ల భిక్షపతి, ఎదులాపురం తిరుపతి, సిద్ధమల్ల శ్రీనివాస్, పిడిశెట్టి శ్రీను, వేముల జగదీష్, ముక్కెర రాజు, పిడిశెట్టి కనకయ్య, యాటపోలు శ్రీనివాస్, చిదురాల స్వరూప, ఏనుగు స్రవంతి, శారద, మంజుల, అన్నపూర్ణ, మాడ్గుల సంపత్ తదితరులు పాల్గొన్నారు.



వీరభద్రస్వామికి ముడుపు చెల్లిస్తున్న ఎమ్మెల్సీ కోదండరామ్

## జమిలీ ఎన్నికలు రాజ్యాంగానికి విరుద్ధం

- కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి
- రుణమాఫీ అందరికి వర్తింపజేయాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

వివరాలు : 6లో..



# టెక్స్‌టైల్ పార్క్‌కు భూములిచ్చినవారికి ఉపాధి కల్పించాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 23 : మెగా టెక్స్‌టైల్ పార్క్ కోసం భూములిచ్చిన కుటుంబాలతో పాటు పరకాల నియోజకవర్గ యువతకు ఉపాధి కల్పించేందుకు అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో పరకాల నియోజకవర్గ పరిధిలో మెగా జాబ్ మేళా, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో సంగెం, గీసుగొండ మండలాలతో పాటు ఇతర మండలాల స్థానికులకు ఉపాధి కల్పన, తదితర అంశాలపై ఎమ్మెల్యే చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ పరకాల నియోజకవర్గ పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు టెక్స్‌టైల్ పార్క్ కోసం భూములు ఇచ్చిన కుటంబాల నుంచి మొత్తం 3836 మంది ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్నారని, వీరందరి ఉపాధి కోసం సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. వీరందరికీ వివిధ సంస్థలలో ఉపాధి కల్పనకు పూర్తిస్థాయి నివేదికను అధికారులు రూపొందించాలన్నారు. ఉపాధి కల్పనపై రెండు జిల్లాల కలెక్టర్లు, అధికారులు కృషి చేయాలని, వివిధ పరిశ్రమల్లో విడతల వారిగా ఉపాధి కల్పించాలని సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ వివిధ ఉపాధి అవకాశాలకు వచ్చిన దరఖాస్తులలో అర్హతలను ముందుగా పరిగణలోకి తీసుకుని వారి జాబితాను సిద్ధం చేస్తే వివిధ సంస్థలలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మార్గం సుగమమౌతుందన్నారు.

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో అర్హులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో సెట్విన్ ఎండీ మన్మోహన్, పరిశ్రమలు, ఉపాధి కల్పన, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి




# జమిలి ఎన్నికలు రాజ్యాంగానికి విరుద్ధం

**కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి - సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి**


విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భీమదేవరపల్లి, సెప్టెంబరు 23: జెమిలీ ఎన్నికలు రాజ్యాంగానికి విరుద్ధమని, నరేంద్ర మోదీ ప్రభుత్వం దీని ద్వారా ప్రజలకు ఏం లాభమో చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఇంట్లో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ఒకేసారి జరిపినా అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు జరపడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రాష్ట్రాలపై పెత్తనం చెలాయించేందుకే కేంద్ర ప్రభుత్వం జెవిఎలీ ప్రతిపాదనలు తీసుకువస్తుందన్నారు. కులగణన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చివేయడం అమానుషమన్నారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతపై తమకు అభ్యంతరం లేదన్నారు. పేదల ఇండ్లను కూల్చివేస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. రూ. 1400 కోట్లతో నిర్మిస్తున్న ఎల్కతుర్తి-రామాయణపేట హైవే నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అధికారులతో విచారణ జరపాలన్నారు. ఈ నెల 26న హైవేపై సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ అందరి రైతులకు అందడం లేదన్నారు. ఇటీవల వియత్నాం దేశ పర్యటనకు వెళ్లి వచ్చిన చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావును సీపీఐ నాయకురాలు మంచాల రమాదేవి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, బీ సంపత్, అశోక్, స్టాలిన్, రమాదేవి, రామచంద్రారెడ్డి, తిరుపతి, ఆదరి రమేష్, మార్పు సంజీవరెడ్డి, గడ్డం రాజనర్సు, కృష్ణారెడ్డి, రొంటాల శ్యామ్, వేల్పుల చరణ్, రవితేజ, బీ సదానందం తదితరులు పాల్గొన్నారు.

# కేయూ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌కు అరుదైన అవకాశం

**అస్ట్రేలియా అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక**



కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23: కాకతీయ యూనివర్సిటీ గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌కు అరుదైన అవకాశం లభించింది. అక్టోబరు 3,4 తేదీల్లో అస్ట్రేలియా ఖండంలోని పెర్త్ నగరంలో జరిగే ప్రతిష్ఠాత్మక అట్లాంటిక్ ఫెడరేషన్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందింది. సదస్సులో ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ ' మ్యాథమేటికల్ టెక్నిక్స్ ఇన్ ఇంజనీరింగ్ అప్లికేషన్స్ (ఐసీఎంటీఈఏ-24) ఏ సోల్యూషన్ టూ పజి స్టోకాస్టిక్ లీనియర్ సిస్టమ్స్ యూజింగ్ ట్రయాంగులర్ అండ్ స్క్యూసిమెట్రిక్ స్ప్లిటింగ్ ఇంటరేటివ్ మెథడ్ అనే అంశం పై పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. ఈ సందర్భంగా ఆయనను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ .మల్లారెడ్డి, మ్యాథ్స్ విభాగం ప్రొఫెసర్లు భారవిశర్మ, సోమయ్య, తిరుమలదేవి అభినందించారు.

# రోడ్లు, బ్రిడ్జీల నిర్మాణానికి రూ. 60 కోట్ల నిధులు

**బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

భీమదేవరపల్లి, సెప్టెంబరు 23 : హుస్నాబాద్ నియోజకవర్గంలో రోడ్లు, పలు బ్రిడ్జీల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 60కోట్ల నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ ఎంఆర్‌ఆర్ గ్రాండ్ల కింద రూ. 10కోట్లు, పంచాయతీరాజ్ సీఆర్‌ఆర్ గ్రాండ్ల కింద రూ. 50కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. భీమదేవరపల్లి మండలం మల్లారం ఎక్స్ రోడ్ నుంచి రసూల్‌పల్లిలో రూ. 86లక్షలతో బీటీ రోడ్, భీమదేవరపల్లి మండలంలోని అవల్దార్‌పల్లి ఆర్‌అండ్‌బీ రోడ్ నుంచి ఎర్రబెల్లి వరకు రూ. 37లక్షల బీటీ రోడ్, గట్లనర్సింగాపూర్, లంబాడితండ ఎక్స్ రోడ్ వరకు రూ. 374లక్షలు, ముల్కనూర్ ఎస్‌బీహెచ్ నుంచి కొత్తపల్లి ఎక్స్ రోడ్ వరకు రూ. 135లక్షలు, భీమదేవరపల్లి మండలం కొప్పూర్ ఎక్స్ రోడ్‌కు రూ. 117లక్షలు, మండలంలోని వంగర ఎర్రగడ్డ కల్వర్టు నిర్మాణం, బ్రిడ్జీ నిర్మాణానికి రూ. 80లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వీటితో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ముగిసిన జిల్లా స్థాయి చెస్ పోటీలు


విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 23 : తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలు సోమవారం ముగిసాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్-15 బాలబాలికల విభాగంలో నిర్వహించిన చెస్ పోటీలలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి 100మంది క్రీడాకారులు పాల్గొనడం జరిగిందని క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. రెండు రోజుల పాటు క్రీడాకారుల మధ్య నువ్వా నేనా అనే విధంగా గెలుపే లక్ష్యంగా పోటీ తత్వాన్ని ప్రదర్శించారు. బాలుర విభాగంలో జి. విద్యాధర్, ఎం. అభినవ్ రెడ్డి, అల్లాడి శ్రీవాత్సవ్, డి. జితేష్ బాలికల విభాగంలో జాన్వీ తోట, పి. లక్ష్మీశార్వాణి, కె. ఆరాధ్య, ఎం. హాస్య లు అత్యుత్తమ ప్రతిభతో రాణించి అక్టోబరు చివరి వారంలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని కన్నా వెల్లడించారు. ఈ మేరకు విజేతులుగా నిలిచిన క్రీడాకారులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్స్ ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు సీఐలు, ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, సెప్టెంబరు 23: వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్ఐలను బదిలీ చేస్తూ సోమవారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐలు ఎం.అబ్బయ్య సీసీఎస్ వరంగల్ నుంచి నర్మెట్ట, ఎం.సాయిరమణ నర్మెట్ట నుంచి దుగ్గొండి అలాగే ఎస్ఐలు చింత రాజు ఇంతజార్‌గంజ్ నుంచి కొడకండ్ల, ఎస్.రాజన్‌బాబు వరంగల్ ట్రాఫిక్ నుంచి జనగాంకు బదిలీ అయ్యారు.




# ఫాంహౌస్ పాలన కాదు మాది ప్రజాపాలన

**వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**వంగపహాడ్‌లో పీఏసీఎన్ నూతన భవనం ప్రారంభం**


వంగపహాడ్‌లో నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 23 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా ఫాంహౌస్ నుంచి మానిటరింగ్ చేసిన ప్రభుత్వం మాది కాదని ప్రజల కోసం, ప్రజల చేత ఎన్నుకోబడిన నిజమైన ప్రభుత్వం మాది అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ వంగపహాడ్‌లో పీఏసీఎస్ ( ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం) ఆధ్వర్యంలో నిర్మించిన నూతన భవనం, గోదామును ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు అతిథులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతిగా పని చేస్తున్నా కొందరు బీఆర్ఎస్ నాయకులు, ట్విట్టర్ వేదికగా కామెంట్స్ చేయడం సరైంది కాదని మండి పడ్డారు. గత ప్రభుత్వాలు రైతులకు రుణ మాఫీ చేయాలంటే అష్టకష్టాలు పడేవారని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క సారే రూ. 2 లక్షల రుణ మాఫీ చేశాడని గుర్తు చేశారు. ఇంకా కొందరు రైతులకు రుణమాఫీ విషయంలో కొన్ని సాకేంతిక కారణాలు ఉన్నాయని త్వరలో పరిష్కారం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్‌లో ట్విట్టర్ టిల్లు, కౌశిక్‌రెడ్డి వంటి అటెన్షన్ డైవర్షన్ బ్యాచ్ పని చేస్తుందని గుర్తు చేశారు. సోషల్ మీడియా వేదికగా దుర్ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు.

టెక్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ.. ప్రస్తుతం వంగపహాడ్ పీఏసీఎస్ ఏపీబీ బ్యాంకు నుంచి డీసీసీబీకి మార్చమని పాలక వర్గం సభ్యులు చాలా సార్లు కోరారని అతి త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రుణమాఫీ కానీ రైతులు దిగులు పడాల్సిన అవసరం లేదని అందరికి న్యాయం జరుగుతుందన్నారు. దసరా కానుకగా రైతులు పండించే వరి ధాన్యానికి రూ. 500 బోనస్, రైతు భరోసా ఇవ్వనున్నట్టు చెప్పారు. ప్రస్తుతం పీఏసీఎస్ భవనం రూ. 30 లక్షలతో నిర్మాణం జరిగిందని చైర్మన్ మేరుగు రాజేశ్ గౌడ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీవో నీరజ, డీసీసీబీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, వంగపహాడ్ పీఏసీఎస్ డైరెక్టర్లు రుద్రారపు రాజు, మేరుగు రేణుక, గండు అశోక్ యాదవ్, పావం జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


**ప్రపంచ టాప్ శాస్త్రవేత్తలలో**

# వరంగల్ ప్రొఫెసర్‌కు చోటు


డాక్టర్ రమేశ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 23: ప్రపంచ టాప్ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో వరంగల్ జిల్లా నర్సంపేట మెడికల్ కళాశాల బయోకెమిస్ట్రీ ఇన్‌చార్జి విభాగం అధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కందిమల్ల రమేశ్‌కు చోటు దక్కింది. ఇటీవల స్టాన్ ఫర్డ్, కాలిఫోర్నియా, ఎల్సివియర్ విశ్వవిద్యాలయాలు కలిసి ప్రపంచంలోని టాప్ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాను రూపొందించాయి. ఈ జాబితాలో డాక్టర్ కందిమల్ల రమేశ్‌కు స్థానం దక్కింది. 2021-2023 కొనసాగే ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో స్థానం సంపాదించారు. న్యూరో సర్జరీ, న్యూరో శాస్త్రంపై అనేక పరిశోధనలు చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్న ఏకైక వ్యక్తిగా నిలిచారు. అమెరికాలోని నాసా, ఏమోరి యూనివర్సిటీ, జార్జియా టెక్ యూనివర్సిటీ, టెక్సాస్ విశ్వవిద్యాలయం లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో వివిధ హోదాల్లో పని చేశారు. డాక్టర్ రమేశ్ 100కు పైగా పరిశోధన పత్రాలను, అల్జీమర్స్, స్కిజోఫినియా, ఆంటి వ్యాధులపై ప్రచురించారు. ప్రపంచస్థాయి శాస్త్రవేత్తల జాబితాలో స్థానం దక్కించుకున్న డాక్టర్ కందిమల్ల రమేశ్‌ను పలువురు ఐఎంఏ వైద్యులు ప్రశంసించారు.







# కొనసాగుతున్న ఉత్కర్ష

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 23 : కాకతీయ మెడికల్ కాలేజీ వార్షిక ఉత్సవం ఉత్కర్ష 24 కార్యక్రమం మూడవ రోజు ఉత్సాహంగా కొనసాగింది. సోమవారం ఇంపల్స్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సైక్లింగ్, పరుగెత్తడం, జంపింగ్, క్లైంబింగ్, ఇతర క్రీడల్లో విద్యార్థులు పాల్గొన్నారు. క్రికెట్ ఫైనల్స్‌లో పోస్టు గ్రాడ్యుయేట్లు చాంపియన్‌షిప్‌ను గెల్చుకున్నారు. సాయంత్రం విద్యార్థులు చిత్రలహరి (షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్) ఇందులో మెడికల్ విద్యార్థులు రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌లు ప్రదర్శించారు. కాకతీయ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు డాక్టర్ భరత్, డాక్టర్ మౌనిక దంపతుల కూతురుకు ఉత్కర్ష అనే పేరు పెట్టారు. కేఎంసీలో మాకు చాలా నేర్పిందని, కాలేజీ మీద ఉన్న ప్రేమతో తమ కూతురికి ఉత్కర్ష అనే పేరును పెట్టినట్లు వారు తెలిపారు. మంగళవారం విద్యార్థులు మెగా రక్త దాన శిబిరం, సాయంత్రం కార్నివల్ నైట్ నిర్వహించనున్నారు.

# పలు రైళ్లు ఆలస్యం

కాజీపేట, సెప్టెంబరు 23 : కాజీపేట టౌన్ - హసన్‌పర్తి రైల్వే స్టేషన్ల మధ్య ఎఫ్ క్యాబిన్ వద్ద సోమవారం మూడో లైన్ బైపాస్ పనులు చేపట్టారు. రైల్వే అధికారులు పర్యవేక్షణలో 400 మంది గ్యాంగ్‌మెన్‌లు ఒక యూనిట్‌గా ఏర్పడి లాకింగ్, ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టారు. నాలుగు గంటలు బ్లాక్ తీసుకుని ఈ పనులు చేపట్టడంతో కాజీపేట, బల్లార్షా, వరంగల్ రైల్వే స్టేషన్ల మార్గంలోని పలు రైళ్లు అలస్యంగా నడిచాయి. పనుల అనంతరం రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ఈ పనులు డిప్యూటీ సీఈ భార్గవ్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ భటియా, టీఐ అగ్గి రవీందర్, పీడబ్ల్యూ గోపిల పర్యవేక్షణలో చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

# 'నూతన జాతీయ పెన్షన్ స్కీంతో ప్రయోజనాలు'

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23 : నూతన జాతీయ పెన్షన్ స్కీంతో ఉద్యోగులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఏపీ రాజమండ్రి ఆదికవి నన్నయ్య వర్సిటీ కామర్స్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఉదయభాస్కర్ అన్నారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో అకుట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి అధ్యక్షతన నేషనల్ పెన్షన్ స్కీంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కీలక ప్రసంగం చేసిన ఉదయభాస్కర్ మాట్లాడుతూ. ప్రతి ఒక్క ఉద్యోగి తప్పనిసరిగా ఎన్‌పీఎస్‌లోకి మారాలని ఎందుకంటే రాష్ట్ర ప్రభుత్వం అడిట్ అభ్యంతరాలను వ్యక్తం చేస్తోందని సూచించారు. 80 సీడీసీ కింద ఐటీ కోసం ఎన్‌పీఎస్ అవసరం ఉంటుందని చెప్పారు. అనంతరం వర్సిటీ ఉద్యోగ సంఘాల నేతలు డాక్టర్ మామిడాల ఇస్తారి, వల్లాల తిరుపతి, పోలేపాక కోర్నేల్‌లు మాట్లాడుతూ.. వర్సిటీలో ఉద్యోగులు, అడ్మినిస్ట్రేటీవ్ అధికారులు తమను ఎన్‌పీఎస్‌లోకి మార్చేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు కామర్స్ విభాగం ప్రొఫెసర్ రాజేందర్ నలుగురితో కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. ఈ సదస్సులో వర్సిటీ ప్రొఫెసర్లు, ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# 'రామప్ప' భద్రత..
# గాలిలో దీపమేనా?

- రూ.కోట్లలో అభివృద్ధి పనులు.. అయినా కరువైన రక్షణ
- ప్రపంచ స్థాయి గుర్తింపున్నా కానరాని సీసీ కెమెరాలు
- నిర్వహణపై భక్తుల నుంచి వ్యక్తమవుతున్న ఆక్షేపణలు

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 23 : యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి రక్షణ కరువైంది. పర్యాటకంగా ప్రపంచ పటంలో ఉన్నత స్థానం పొందినా స్థానికంగా మాత్రం ఈ వారసత్వ సంపదకు రక్షణ కరువైంది. ఇక ప్రధాన ఆలయానికి అనుబంధంగా ఉన్న 20 ఉప ఆలయాల భద్రత గాలిలో దీపంగా మారింది. రూ.కోట్లు వెచ్చించి రామప్పను అభివృద్ధి చేస్తున్నా రక్షణ కల్పించడంలో మాత్రం అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోంది. తాజాగా గొల్లాలగుడి తవ్వకాలే ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్న రామలింగేశ్వరుడి రక్షణపై భక్తుల్లో అనుమానాలు పెరుగుతున్నాయి.

**వీఐపీలు వచ్చినప్పుడే రక్షణ**

సుప్రసిద్ధ రామప్ప దేవాలయానికి 2022 జూలైలో యునెస్కో గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు రావడం కోసం కేంద్ర పురావస్తుశాఖ, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అనేక అభివృద్ధి పనులు చేపట్టాయి. గుర్తింపు తీసుకొచ్చేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. గుర్తింపు వచ్చాక రాష్ట్రపతి మొదలు అనేక మంది వీవీఐపీలు రామప్పను సందర్శించిన సమయంలో మాత్రమే పోలీసులు రక్షణగా వస్తున్నారు. ఆ తరువాత మళ్లీ యథావిధిగా రామలింగేశ్వరుడికి రక్షణ కరువవుతోంది.

**ఉప ఆలయాలనూ గాలికొదిలేశారు..**

రామప్ప అలయానికి అనుబంధంగా 20 ఉప ఆలయాలు, ప్రధాన ఆలయాలు చుట్టుపక్కల ఉన్నాయి. వాటి రక్షణను అధికారులు గాలికి వదిలేస్తున్నారు. ఫలితంగా గొల్లాలగుడిలో గుర్తుతెలియని దుండగులు తవ్వకాలు చేపట్టారు. ఏకంగా 1000కిలోల బరువు ఉన్న నక్షత్రాకారపు ప్రాకారాన్ని పైకప్పు కిందికి తోశారు. కిందకు తోశాక ప్రాకారం పైభాగంలో పుష్పాకారంలో ఉన్న టంకాన్ని పగులగొట్టారు. ఇదంతా ఒకరిద్దరు కలిసి చేసిన పనికాదని జరిగిన ఘటనను పరిశీలిస్తే తెలుస్తోంది. స్థానికుల సహకారం ఉంటే తప్ప ఇంత బరువును కిందికి తోయలేరన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం కనుక ఈఘటనను సిబ్బంది చూసి ఉండకపోతే దుండగులు మరికొన్ని ఉప ఆలయాలపై కూడా ఇదే తరహాలో దాడులకు పాల్పడి ఉండేవారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**అభివృద్ధి పనులు చేస్తున్నా సీసీ కెమెరాలు కరువు**

యునెస్కో గుర్తింపు పొందిన అనంతరం రామప్ప పరిసర ప్రాంగణంలో రూ.కోట్లు వెచ్చించి చేస్తున్న పలు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. అటు కాంట్రాక్టర్లు కానీ, ఇటు కేంద్ర పురావస్తుశాఖ అధికారులు కానీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం పట్ల భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ పర్యాటకులకు ఏదైనా ఇబ్బంది ఏర్పడితే కనీసం గుర్తించేందుకు సీసీ కెమెరా లు కూడా లేవు. పైగా ఆలయం వద్ద ఇలాంటి సెక్యూ రిటీని కూడా నియమించకపోవడం పట్ల సర్వత్రా వి మర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ గుర్తింపు వచ్చినా ఇంకా అభద్రతలోనే రామప్ప ఆలయం ఉంద ని స్థానికులు వాపోతున్నారు.

**టంఖంలో వజ్రాలు ఉన్నాయనే..**

రామప్ప అలయానికి సమీపంలోని గొల్లాలగుడిలో రెండురోజుల క్రితం గుప్తనిధుల కోసం తవ్వకాలు జరి గినట్టు వెలుగులోకి వచ్చిన క్రమంలో అలయం పై భాగంలో ఉన్న పుష్పాకారపు పైకప్పు భాగంలో ఉన్న టంఖాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఆటంఖంలో వజ్ర, వైడూర్యాలు ఉన్నాయనే ఆశతో కొందరు వ్యక్తు లు దానిని పగులగొట్టిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పైభాగం నుంచి కిందికి తీసుకురావడానికి సుమారు 10మంది ప్రయత్నంచేస్తే తప్ప ఆ ప్రకారం కిందికి వచ్చే అవకాశంలేదని స్థానికులు భావిస్తున్నారు.

## 20 ఉప ఆలయాల పరిస్థితీ అంతే



రామప్ప దేవాలయం ఆవరణలోని గొల్లాలగుడి



దీపశిఖలతో చెక్కిన టంఖం

**రామప్ప గుడులకు రక్షణ కల్పించాలి**

ఆకిరెడ్డి రామ్మోహన్‌రావు,
రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్



రామప్ప ప్రధాన అలయం తోపాటు దాని పరిధిలో ఉన్న గుడులను వెలికితీసి వాటికి ర క్షణ కవచాలను ఏర్పాటు చేసి అలయాలకు భద్రత కల్పించా లి. గొల్లాలగుడి పైకప్పు దీప శిఖలో అనేక కళాకృతులు చెక్కి ఉండేవి. అలాంటి అనేక కళాకృతులు మరుగునపడి ఉన్నాయి. వాటి ని నియంత్రిత రక్షణ వ్యవస్థ పరిధిలో ఉంచాలి. అలాగే పురావస్తుశాఖ రక్షణ, నిర్వహణ సిబ్బంది ని పెంచాలి.

**ప్రధాన ఆలయంపై కన్నేస్తే ఇక అంతే..**

రామప్ప ప్రధాన ఆలయం పరిధుల్లో దుండగులు ఎలాంటి తవ్వకాలు చేపట్టినా అంతర్జాతీయ పర్యాటక సమాజం ముందు తలదించుకోవాల్సి వస్తుంది. కనీస స్థాయి భద్రత కల్పించకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. ప్రపంచ పర్యాటక ముఖచిత్రంలో ఉన్న త స్థానం సంపాదించిన రామప్పకు ఇప్పటికైనా రక్షణ కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.

## గొల్లాలగుడిని సందర్శించిన కలెక్టర్ దివాకర

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 23: మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయం తూర్పు రోడ్డు, గొల్లాల గుడిని సోమవారం ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామప్ప దేవాలయం తూర్పు రోడ్డు అభివృద్ధి పనుల్లో వేగం పెంచి ఏరియా మ్యాపింగ్ సర్వేచేసి బౌండ్రీ పిల్లర్ ఫిక్స్ చేయాలన్నారు. కెనాల్‌కు సంబంధించిన ఏరియా సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఆయన రామప్ప ఉప ఆలయాల్లో ఒకటైన గొల్లాలగుడిని సందర్శించి గుడి పైకప్పు, దెబ్బతిన్న శిఖరం, పైకప్పులో వికసించే తామరపువ్వు గుర్తుతో ఉండి పూర్తిగా ధ్వంసమైన శిల్పాన్ని పరిశీలించారు. దేవాలయం పూర్తి వివరాలను పురావస్తు శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దేవాలయంలో ధ్వంసమైన శిల్పం, పువ్వు, అన్ని డాక్యుమెంట్ చేయాలని, రాత్రి కాపలాదారుడిని ఏర్పాటు చేయాలని కలెక్టర్ పురావస్తు శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ అధికారి మల్లేశం, ఇరిగేషన్ డీఈ రవీందర్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో రాజు, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



ధ్వంసమైన శిల్పాలను పరిశీలిస్తున్న ములుగు కలెక్టర్ దివాకర



ప్రాజెక్టు పనుల రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

## చిన్న కాళేశ్వరంపై చిగురిస్తున్న ఆశలు

మహదేవపూర్, సెప్టెంబరు 23: మహదేవపూర్, కాటారం, మల్హర్, మహాముత్తారం మండలాలకు సాగునీరు అందించేందుకు గాను చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆశలు చిగురిస్తున్నాయి. సుమారుగా 45వేల ఎకరాల పంట భూములకు నీరందించేందుకు ప్రాజెక్టు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ చూపి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష జరిపి చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి 70వేల ఎకరాల భూ సేకరణకు రూ.14 కోట్లు, వీరసాగర్‌లో సబ్‌స్టేషన్ విద్యుత్ సరఫరాకు రూ.31.39 కోట్ల నిధులు మంజూరైనట్లు ఈఈ యాదగిరి తెలిపారు. ప్రస్తుతం ఈఈ పర్యవేక్షణలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

## నేడు కాళేశ్వరానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాక

మహదేవపూర్, సెప్టెంబరు 23: మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి సన్నిధికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, కమిషనర్ హన్మంతరావులు మంగళవారం రానున్నారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సన్నిధానంలో సరస్వతి పుష్కరాలపై సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే సరస్వతి పుష్కరాల సమావేశాలు నిర్వహించడానికి ముందస్తుగా కాళేశ్వరంలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. అలాగే రూ.25 కోట్లతో 8ఏళ్ల క్రితం మంజూరైన పనులపై కూడా ఆరా తీసినట్లు తెలిసింది.

## 30న విద్యార్థులకు జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23: హంటర్‌రోడ్‌లోని రీజనల్ సైన్స్ సెంటర్‌లో ఈ నెల 30న పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలను నిర్వహిస్తున్నట్లు డీఈవో డి. వాసంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని, రాష్ట్ర స్థాయిలో విజేతలైన విద్యార్థులు దక్షిణ భారత స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో పాల్గొంటారని, అక్కడ విజేతలైన విద్యార్థులు జనవరి 2025లో బెంగుళూరులో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందని ఆమె పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామిని సంప్రదించాలని ఆమె సూచించారు.

# బోగస్ పాలనతో కేసీఆర్ ప్రజలను మోసం చేశారు

- ప్రజల అభిప్రాయాలను పట్టించుకోలేదు
- ఇప్పటి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం
- కేయూ సింపోజియంలో సామాజిక వేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్




మాట్లాడుతున్న హరగోపాల్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23 : కేసీఆర్ పాలనంతా బోగస్‌గా సాగిందని, తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ప్రముఖ సామాజిక వేత్త, రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో కేయూ ఆర్థశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బానోతు సురేశ్‌లాల్ అధ్యక్షతన 'డికెడెల్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ ఇష్యూస్ చాలెంజెస్' అనే అంశంపై సింపోజియం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలందరూ ఉద్యమం చేసి ఆశించిన డెమోక్రటిక్ పాలిటిక్స్‌కు బదులుగా విరుద్ధమైన పాలన సాగించారని విశ్లేషించారు. బీఆర్ఎస్ పాలన నిర్బంధం, నిరంకుశత్వంతో పాలన సాగిందన్నారు. కేసీఆర్ పాలనలో అక్రమంగా 221 కేసులు నమోదు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. యూజీసీ వర్సిటీలకు భారీగా నిధుల్లో కోత విధించిందని, వర్సిటీ స్వయం ప్రతిపత్తిని ప్రభుత్వాలు దెబ్బతీస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంతో పాటు వ్యవసాయ రంగాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు.

ప్రత్యేక అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అప్పట్లో అధికారం చేపట్టగానే తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు, వలసలతో పాటు అస్తిత్వం కోల్పోయిన యువత అకాంక్షలను తుంగలో తొక్కారని ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా పదవి బాధ్యతలు చేపట్టిన వెంటనే తమది పక్క రాజకీయ పార్టీ అంటూ రాష్ట్రం కోసం పోరాడిన మేధావులు, యువత, విద్యావేత్తల ఆలోచనలు పట్టించుకోలేదని అన్నారు. ఖరీఫ్‌లో రైతుల పేరుతో నమోదైన భూములను ధరణి పోర్టల్‌లో సాయంత్రం పని ప్రారంభించి రాత్రికి తమకు అనుకూలమైన పేర్లకు మార్చేవారని అన్నారు. కాళేశ్వరంతో పాటు రాష్ట్రంలోని మిగతా నీటి ప్రాజెక్టుల్లో అవకతవకలు, అవినీతి జరిగిందన్నారు. కేసీఆర్ తన హయంలో రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని ధ్వజమెత్తారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి కీలక ప్రసంగం చేశారు. తెలంగాణ రాష్ట్రం నీళ్ళు, నిధులు, నియామకాల కోసమే అంటూ ప్రగల్భాలు పలికినప్పటికీ తీర రాష్ట్రం సిద్ధించిన తర్వాత వాటిని మరిచారని అన్నారు. తమిళనాడుతో పోలిస్తే తెలంగాణలో విద్య ప్రమాణాలు తక్కువగా ఉన్నాయని చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ.. అర్థశాస్త్రంలో దత్తాంశాల ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. వర్సిటీల్లో ఫ్యాకల్టీతో పాటు నిధుల కొరత ఉందన్నారు. పాలక మండలి సభ్యులు పుల్లూరి సుధాకర్ మాట్లాడుతూ.. వరంగల్‌లో డ్రైయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదన్నారు. రిటైర్డు ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ మాట్లాడుతూ.. అభివృద్ధి హైదరాబాద్‌లో కేంద్రీకృతం కాకుండా రాష్ట్రమంతా విస్తరించాలని చెప్పారు.

కేయూ అర్థశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి, సమస్యలు, సవాళ్ళకు సరైన మార్గదర్శనంగా సింపో జియం నిర్వహించినట్లు తెలిపారు. మాజీ వీసీ ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, ఈసీ మెంబర్ డాక్టర్ చిర్ర రాజు, కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ప్రొఫెసర్ ఎ.సదానందం, ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ప్రొఫెసర్ గుగులోత్ వీరన్ననా యక్, ప్రొఫెసర్ సీహెచ్. సమ్మయ్య కృష్ణమాచారి, పరిశోధకులు జి.రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

# పార్ట్‌టైం అధ్యాపకుల నియామకానికి త్వరలో నోటిఫికేషన్?

- సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన వీసీ
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23 : కాకతీయ యూనివర్సిటీలో ఏడేళ్లుగా పార్ట్‌టైం అధ్యాపకుల నియామక నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం, వర్సిటీలో విద్యార్థులకు బోధన సక్రమంగా జరగకపోవడం, విద్యార్థులు పడుతున్న పలు ఇబ్బందులను వివరిస్తూ 'పాఠాలు చెప్పే వారేరీ' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి.. సమస్య గురించి రాష్ట్ర ఉన్నతా విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లతో త్వరలోనే నోటిఫికేషన్ జారీ కానుంది. ఈ మేరకు తమకు వీసీ నుంచి సమాచారం అందిందని వర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్‌లు, పార్టుటైం ఆశావాహులు తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని తాము రిజిస్ట్రార్ వద్దకు తీసుకెళ్లామని, వర్సిటీలో ఉన్న పరిస్థితులను విన్నవించామని, రిజిస్ట్రార్ మల్లారెడ్డి స్పందించి.. పార్టుటైం నోటిఫికేషన్ కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వీలైనంత త్వరగా ఉన్నతాధికారుల అనుమతిలో నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇదిలా ఉండగా సోమవారం వర్సిటీ సెనెట్ హాల్‌లో జరిగిన అర్థశాస్త్ర విభాగం సింపోజియంలో వర్సిటీల్లో పార్టుటైం నియామకాల్లేవనే అంశాన్ని పలువురు మాట్లాడారు. వర్సిటీలో అధ్యాపక నియామలు చేపట్టకపోవడంతో ఒక తరానికి నష్టం చేసినట్లేనని ఆందోళన వ్యక్తం చేశారు.

**స్పందించిన ఎమ్మెల్సీ కోదండరాం..**

సోమవారం వర్సిటీకి వచ్చిన ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన పీహెచ్‌డీ డాక్టరేట్లు, ఆశవహులు 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనాన్ని చూపించారు. సమస్యలను విని స్పందించిన కోదండరాం వెంటనే వర్సిటీ క్యాంపస్‌లో రిజిస్ట్రార్ మల్లారెడ్డితో చర్చించారు. పార్ట్‌టైం నోటిఫికేషన్ విడుదలకు ఉన్న ఇబ్బందులపై ఆరా తీశారు. రాష్ట్ర ఉన్నత విద్యా ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణల దృష్టికి తీసుకెళ్లి పార్టుటైం నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని ఆదేశించారు. దాంతో తాము ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలపై దృష్టి సారించామని.. వీలైనంత త్వరగా ఇస్తామని వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ వర్సిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ వడ్డెపల్లి మధు, బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత డాక్టర్ పాలమాకుల కొమురయ్య, బీఆర్ఎస్వీ వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అరూరి రంజిత్, డాక్టర్ మద్దిరాల మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌లు ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి పత్రాన్ని అందచేశారు. రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు.



కోదండరాంకు వినతి పత్రాన్ని ఇస్తున్న వర్సిటీ డాక్టరేట్ అభ్యర్థులు

## 27న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23: జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ములుగురోడ్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, వరంగల్, హనుమకొండలోని అపోలో ఫార్మసీ కేంద్రాల్లో ఫార్మసిస్ట్/అసిస్టెంట్/అప్రెంటిషిప్‌గా పనిచేసేందుకు 50 ఖాళీలకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు గల డీఫార్మసీ, బీ ఫార్మసీ, ఎంఫార్మసీ, టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ పాసైన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ యువకులు వారి జీరాక్స్ సర్టిఫికెట్లతో ఈ నెల 27న ములుగు రోడ్‌లోని ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు. పూర్తి విరాలకు 78933 94393 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

**వరంగల్ వ్యవసాయ మార్కెట్ ధరలు**
(క్వింటాల్‌కు-రూ.లలో)

| పంట | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| మక్కలు (బిల్టీరకం) | 2,660 | 2,405 |
| పల్లికాయ (సూక) | 5,600 | 4,500 |
| పల్లికాయ (పచ్చిది ) | 4,400 | 3,800 |
| కందులు | 8,059 | 7,575 |
| పెసళ్లు | 7,652 | 4,052 |
| పత్తి | 7,650 | 5,500 |
| కొత్తపత్తి | 7,225 | 6,500 |
| పసుపు (కాడి) | 13,130 | 12,000 |
| పసుపు (గోల) | 12,455 | 10,800 |
| తేజ మిర్చి | 12,500 | 10,000 |
| తేజ ఏసీ | 18,800 | 14,000 |
| వండర్‌హాట్ ఏసీ | 15,000 | 13,000 |
| యూఎస్341 ఏసీ | 16,500 | 11,000 |
| తాలు మిర్చి | 6,000 | 3,000 |

- వరంగల్ వ్యవసాయం

## స్కై మార్షల్ ఆర్ట్స్‌లో శివాత్మికకు బంగారు పతకం



శివాత్మికను విజేతంగా ప్రకటిస్తున్న న్యాయనిర్ణేతలు

హనుమకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఎల్‌బీ ఇండోర్ స్టేడియంలో జరిగిన తెలంగాణ స్కై మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో హనుమకొండకు చెందిన సిహెచ్ శివాత్మిక అండర్ 17 (42 కేజీ) విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. తెలంగాణ స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి 650మంది పోటీ పడ్డారు. వీరందరిని దాటుకొని విజేతగా నిలిచిన హనుమకొండ స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్‌కు చెందిన శివాత్మిక నవంబర్ నెలలో ఉత్తరాఖండ్‌లో జరుగబోయే జాతీయ స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలలో పాల్గొనేందు కు ఎంపికయ్యారు. బంగారు పతకం సాధించిన శివాత్మికను తెలంగాణ స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.అంజనేయులు, వైస్‌ప్రెసిడెంట్ బండారి సంతోష్, కోచ్‌లు రామ్‌చందర్, సాగర్, కర్ర వెంకటేశ్, సిహెచ్ కరుణాకర్, సీహెచ్ సుప్రియ, పి దినేష్, ఏ గణేష్, యూ రణదీప్, జి వైష్ణవి అభినందించారు.

## చిలుపూర్‌లో పట్టపగలు దొంగతనం

- హెల్మెట్లు ధరించి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు
- ఓ ఇంట్లో చొరబడి మూడు తులాల గొలుసు చోరీ

చిలుపూర్, సెప్టెంబరు 23 : పట్టపగలు హెల్మెట్లు ధరించి బైక్‌పై వచ్చిన ఆగంతకుల్లో ఒకరు ఓ ఇంట్లోకి ప్రవేశించి, ఒంటరిగా ఉన్న మహిళను కత్తితో బెదిరించి ఆమె మెడలో ఉన్న మూడు తులాల గొలుసుకును లాక్కెళ్ళాడు. అనంతరం బైక్‌పై ఇద్దరూ పారిపోయారు. ఈ ఘటన చిలుపూర్ మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత మహిళ జంగిటి రాధిక -లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రాధిక తన భర్త వివిధ పనుల నిమిత్తం వరంగల్‌కు వెళ్ళడంతో మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం ఇంట్లో కూర్చుని టీవీ చూస్తోంది. ఈ లోగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఇంటి ముందు ఆగారు. ఒకరు బైక్ దగ్గర ఉండగా, మరొక వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించాడు. వచ్చీరాగానే కత్తితో పొడిచి చంపుతానని మెడలో ఉన్న బంగారం ఇవ్వాలని బెదిరించాడు. అతడిని ప్రతిఘటించే ప్రయత్నం చేసిన ప్రయత్నం ఫలించకపోగా, ఆమె మెడలో ఉన్న మూడు తులాల (రూ.2.50 లక్షల విలువ గల) బంగారు గొలుసును లాక్కెళ్లి పారిపోయారు. బాధిత మహిళ రాధిక -లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



చిలుపూర్‌లో దొంగతనం జరిగిన తీరును బాధిత మహిళను అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

## నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 : నవోదయ పాఠశాలల్లో ఆరవ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును అక్టోబరు 7 వరకు పొడిగించినట్లు మామునూరు నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ బి. పూర్ణిమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. https://navodaya.gov.in అనే వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.


## శ్రీపతిపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

**రూ. 2.15 లక్షల నగదు, 10 తులాల బంగారం, 5 తులాల వెండి అపహరణ**

చిలుపూర్, సెప్టెంబరు 23 : తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి రూ. 2.15లక్షల నగదుతో పాటు, 10తులాల బంగారం, 5 తులాల వెండి ఎత్తుకెళ్ళిన ఘటన జనగామ జిల్లా చిల్పూరు మండలంలోని శ్రీపతిపల్లిలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మూడికె లక్ష్మికి భర్త కొన్నేళ్ళ క్రితం చనిపోగా, కుమారుడు హైదరాబాద్‌లో ప్రైవేటు గా ఉద్యోగం చేస్తున్నాడు. కొడుకును చూడడం కోసం ఐదు రోజుల క్రితం లక్ష్మి ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లింది. ఇదే అదనుగా భావించిన దొంగలు ఆదివారం రాత్రి ఇంటి తాళం పగులగొట్టి సొత్తును దోచు కెళ్ళారు. సోమవారం ఉదయం ఇంటికి వెసిన తాళం పగులగొట్టడాన్ని గమనించిన సమీప బంధువులు ఆమెకు ఫోన్ ద్వారా సమాచారమందించారు. దీంతో సమీప గ్రామంలో లక్ష్మి కుమార్తె హారిక గ్రామానికి చేరుకుంది. బీరువా తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి చోరీ జరిగినట్లు గుర్తించింది. సమాచారమందుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, జనగామ రూరల్ (రఘునాథపల్లి) సీఐ ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి, చిలుపూర్ ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్‌తో కలిసి చిలుపూర్, శ్రీపతిపల్లి గ్రామాలకు చేరుకున్నారు. దొంగతనాలు జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. దొంగలను పట్టుకోవడం కోసం సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

## 'పద్మావతి' హాల్టింగ్ అయోమయం

- నెక్కొండలో డౌన్‌కు ఓకే.. అప్‌కు నో...
- ప్రైవేట్ యాప్‌లలో తప్పుడు సమాచారంతో ప్రయాణికుల ఇబ్బందులు



ఓ యాప్‌లో నెక్కొండలో హాల్టింగ్ చూపుతున్న దృశ్యం

నెక్కొండ, సెప్టెంబరు 23 : సికింద్రాబాద్-తిరుపతి (12764 / 12763 ) పద్మావతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ విషయంలో ప్రయాణికుల్లో అయోమయం నెలకొంది. నెక్కొండ రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఉండగా.. తిరుపతి నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే రైళ్లకు హాల్టింగ్ లేదు. ఈ క్రమంలో సికింద్రాబాద్ వైపు వచ్చే ఎక్స్‌ప్రెస్‌కు అప్ హాల్టింగ్ ఇప్పించాలని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్‌ను కోరారు. దాంతో మూడు నెలలుగా నెక్కొండ స్టేషన్‌లో అప్ హాల్టింగ్ ఇప్పించారు. కానీ అది మున్నాళ్ల ముచ్చటే అయింది. ఈనెల 15 నుంచి అప్ హాల్టింగ్‌ను రద్దుచేశారు. కానీ ప్రైవేట్ యాప్‌ల్లో మాత్రం నెక్కొండలో పద్మావతి అప్ హాల్టింగ్ చూపుతుండడంతో తికమకపడుతున్నారు. ఇక తిరుపతి పుణ్యక్షేత్రానికి నిత్యం వందల మంది వెళ్తుంటారు. నెక్కొండ స్టేషన్‌లో రైలు ఎక్కి తిరుపతి వెళ్లి.. తిరుగుప్రయాణంలో అదే రైల్లో నెక్కొండకు రావాలని భావిస్తున్నారు. కానీ ఈ స్టేషన్‌లో రైలు ఆగకపోవడంతో వరంగల్‌లో దిగాల్సి వస్తోంది. కొన్ని ప్రైవేట్ యాప్(ఆన్‌లైన్)లో నెక్కొండ స్టేషన్‌లో అప్ పద్మావతి హాల్టింగ్ చూపించడంతో ఆన్‌లైన్‌లో టికెట్ రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## కార్మికులకు రూ.10లక్షలు ఇవ్వాలి




సమావేశంలో మాట్లాడుతున్న వేల్పుల సారంగపాణి

బాలసముద్రం, సెప్టెంబరు 23: భవన నిర్మాణ కార్మికులు మృతి చెందితే రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సారంగపాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డీ రామ్మూర్తి, గుంటి రాజేందర్, ఆర్ పూర్ణచందర్, భద్రయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

## వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, సెప్టెంబరు 23: వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏకశిల హౌసింగ్ కోఆపరేటివ్ సొసైటీ నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు పిన్నా శివకుమార్, కార్యదర్శి బీఆర్ లెనిన్, అడ్వైజర్ కక్కెర్ల అనిల్‌కుమార్ గౌడ్‌లు మాట్లాడుతూ 2009లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హసన్‌పర్తి మండలం మునిపల్లి గ్రామంలో 10.33 ఎకరాల ప్రభుత్వ భూమిని 200 మంది సొసైటీ సభ్యులకు కేటాయించారని చెప్పారు. జీవో కాపీలను ఎమ్మెల్యేకు చూపించి వివరించారు. ఇళ్ల స్థలాల ప్రక్రియను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయార్టీగా చేపట్టి అందజేసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలోని రెండు సొసైటీలకు అప్పగించే విషయంలో హెడ్ ఆన్ అకౌంట్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. 15 రోజుల్లో ఇళ్ల స్థలాల ప్రక్రియను పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు తోట సుధాకర్, తుమ్మ శ్రీధర్‌రెడ్డి, నాయకపు సుభాష్ గౌడ్, గడ్డం కేశవమూర్తి, బూర్ల నరేందర్, కంచె కుమారస్వామి, వీ రాజేశ్వర్‌రావు, సుభాష్, ఏకశిల హౌసింగ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణి హెల్ప్‌డెస్క్‌ను సందర్శించిన కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 23 : ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వస్తున్న వృద్ధులు, వికలాంగులు, మహిళలకు సహాయం చేసేందుకు సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో వయోవృద్ధుల సంక్షేమ సంస్థ విద్యారణ్యపురి పేరిట హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ హెల్ప్‌డెస్క్‌ను సోమవారం ఉదయం కలెక్టరేట్ ఏవో సత్యనారాయణ ప్రారంభించారు. మధ్యాహ్నం కలెక్టర్ ప్రావీణ్య హెల్ప్ డెస్క్‌ను సందర్శించి మాట్లాడారు. ఇక నుండి ప్రతీ ప్రజావాణికి వచ్చే వృద్ధులు, వికలాంగులు, మహిళకు సహాయం చేసేందుకు హెల్ప్‌డెస్క్ అందుబాటులో ఉంటుందని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తేరాల యుగేందర్ తెలిపారు.

## మార్కెట్ కమిటీ ఛైర్మన్‌ను సన్మానించిన మార్నేని

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 23 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమించిన గంట సంజీవరెడ్డిని హనుమకొండలోని డీసీసీబీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ఛైర్మన్ మార్నేనీ రవిందర్‌రావు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

వేలేరు, సెప్టెంబరు 23: ఎస్జీఎఫ్ మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను హెచ్‌ఎం జీ రాజన్న సోవారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నారు. అండర్ 14, 17 విభాగంలో బాలికలకు సోమవారం, బాలురకు మంగళవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడంతో పాటు, బహుమతులను ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి ఎం చంద్రమౌళి, ఫిజికల్ డైరెక్టర్లు రాజేశ్వరి, స్వప్న, సునీల్ కుమార్, పీఈటీలు కిరణ్మయి, సంజీవ్, స్వామి, ఉపాధ్యాయులు సమ్మయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ ఫిర్యాదులపై స్పందించండి

### కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

### బల్దియా గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 23 : గ్రీవెన్స్ ఫిర్యాదులపై అధికారులకు తక్షణమే స్పందించి ఫిర్యాదుదారులకు సరియైన సమయంలో సత్వరమే న్యాయం చేయాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ బల్దియా కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి (గ్రీవెన్స్ సెల్) కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కమిషనర్ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన తర్వాత వెంటనే అక్కడి ఆయా విభాగాల అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 79ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, ట్యాక్సీల విభాగం అధికారి బిర్రు శ్రీనివాస్, డీసీపీ ప్రసన్నరాణి, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, టీపీఆర్‌వో కోళ రాజేశ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు. ఇంజనీరింగ్ - 23, హెల్త్, శానిటేషన్ -6, ప్రాపర్టీ ట్యాక్స్ రెవెన్యూ - 5, టౌన్‌ప్లానింగ్ - 43, ఎలక్ట్రికల్ - 2 మొత్తం 79 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

**బాధితుల ఫిర్యాదులు ఇలా..**

- చర్చీ ముందు మురుగు కాల్వ నీరు వదిలేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతుందని ఏనుమాముల సుందరయ్యనగర్‌కు చెందిన తెలుగు బాప్టిస్ట్ చర్చీ సంఘం సభ్యులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ హనుమాన్‌నగర్ రోడ్డు నెంబర్ -2లో ఇటీవల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి మధ్యలోనే వదిలి వేశారు. భారీ వాహనాలు కచ్చా రోడ్డుపై ప్రయాణించడంతో మంచి నీటి పైప్ లైన్ ధ్వంసమై డ్రైనేజీ నీరు మంచి నీటిలో కలుస్తుందని హనుమాన్‌నగర్ అభివృద్ధి కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ వికాస్‌నగర్ కాలనీలో ఓ ఇంటిపై సెల్ టవర్ నిర్మాణాలు జరుగుతున్నాయని, టవర్‌ను నిలిపివేయాలని ఎన్‌జీవోఎస్ కాలనీ కమిటీ నాయకులు ఫిర్యాదు చేశారు.
- భద్రకాళి బండ్‌ను వీక్షించేందుకు వచ్చిన వారు తమ ఇండ్ల ముందు వాహనాలు పార్కింగ్ చేయడంతో చాలా ఇబ్బందిగా ఉందని హంటర్ రోడ్డు దుర్గాకాలనీ రోడ్డు నెంబర్ -2 కాలనీకి వారు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ 47వ డివిజన్ భవానినగర్‌లో చాలా ప్రాంతాల్లో డ్రైనేజీ, సీసీ రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, బల్దియా అధికారులు వెంటనే స్పందించి అభివృద్ధి చేయాలని డివిజన్ కార్పొరేటర్ సుంకు నర్సింగరావు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

## శ్మశాన వాటికను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

### సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 23 : పెద్దమ్మగడ్డలో ఉన్న దళిత శ్మశాన వాటికను ఆక్రమించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం చేయాలని సీపీఎం నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొట్ల చక్రపాణి మాట్లాడుతూ దళిత శ్మశాన వాటికను అక్రమంగా కూల్చివేసి కబ్జా చేయాలని చూస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి దళిత శ్మశాన వాటికను రక్షించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సారంపెల్లి వాసుదేవరెడ్డి, నాయకులు గాదె రమేష్, మంద మల్లేశం, కుమారస్వామి తదితరులు ఉన్నారు.

**డీహెచ్‌పీఎస్ నాయకుల ధర్నా**

దళితులపైన జరుగుతున్న అత్యాచారాలపై ప్రత్యేక చట్టం తీసుకురావాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు నిమ్మల మనోహర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను నీరుగార్చడం ద్వారా దళితులపై దాడులు పెరుగుతున్నాయని, అందుకే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ముమ్మరం చేసి తగు చర్యలు తీసుకుని దళితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు రొంటాల దేవా, మద్దెల ఎల్లేష్, మునిగాల బిక్షపతి, శంకర్‌నాయక్, కొట్టె వెంకటేష్, బొడిగె కమలాకర్, వనజ, లత, రాణి, సుశీల తదితరులు ఉన్నారు.



ఎంజీఎంలో సమ్మక్కను పరామర్శిస్తున్న ఎంపీ కావ్య

## పారిశుధ్య కార్మికురాలికి అండగా నిలిచిన ఎంపీ

### ప్రజారోగ్య విభాగం అధికారులపై ఫైర్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 23: విధులలో భాగంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయి ఎంజీఎంలో చికిత్స పొందుతున్న పారిశుధ్య కార్మికురాలు రామంచ సమ్మక్కను సోమవారం వరంగల్ ఎంపీ కడియం కావ్య పరామర్శించి భరోసా కల్పించారు. రోడ్డు ప్రమాదం జరిగినా పట్టించుకోని ప్రజారోగ్యం విభాగం అధికారులపై ఫైర్ అయ్యారు. హనుమకొండ ఎన్‌జీవోఎస్ కాలనీలో విధులు నిర్వర్తిస్తుండగా గుర్తు తెలియని కారు సమ్మక్కను ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రస్తుతం పక్షం రోజులుగా రెండు కాళ్లు కోల్పోయి ఎంజీఎంలో చికిత్స పొందుతోంది. బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదని తెలుసుకుని ఎంపీ కడియం కావ్య ఎంజీఎంకు వెళ్లి సమ్మక్కను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఎంజీఎం వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్‌కు ఫోన్ చేసి సమ్మక్కకు రావాల్సిన బెనిఫిట్స్ త్వరగా వచ్చే విధంగా చొరవ చూపాలన్నారు. అనంతరం సమ్మక్కకు ఆర్థిక సహాయం అందించారు.

## ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 23 : బల్దియా ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరుగనున్న కౌన్సిల్ సమావేశంలో ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వరంగల్ బహుజన మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం మేయర్ గుండు సుధారాణికి బల్దియా కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవలు గుర్తించి పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. మేయర్‌ను కలిసిన వారిలో సంఘం నాయకులు వక్కల రాణాసాగర్, సుద్దాల కుమార్, ఎర్ర అరుణ్, చిరంజీవి, కుమారస్వామి, ఎర్ర రాము, రాజేశ్, రఘులు ఉన్నారు.

## గుట్కాల పట్టివేత.. రూ.8 లక్షల సరుకు స్వాధీనం

వరంగల్ క్రైం, సెప్టెంబరు 23 : జనగామ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుర్మవాడ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.8 లక్షల 36వేల విలువైన గుట్కాలను పట్టుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన జి.రామ్ అనే వ్యక్తి గత కొంతకాలంగా జనగామలో వ్యాపారం చేస్తూ నివసిస్తున్నాడు. ఇతడి నివాసంలో పెద్ద ఎత్తున గుట్కా నిల్వలున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం దాడి చేశారు. నిషేధిత గుట్కాను స్వాధీనం చేసుకుని నిందితుడు రామ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించడం జరిగింది.

## అండర్-19 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 23 : వరంగల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 26నుంచి నిర్వహించనున్న అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో పాల్గొనున్న ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టును సోమవారం ఎంపిక చేసినట్లు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. గత రెండు రోజులుగా వరంగల్ దేశాయిపేట సీకేఎం కళాశాల క్రీడా మైదానంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించగా ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల నుంచి సుమారు 200మంది క్రీడాకారులు పాల్గొనడం జరిగిందన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రికెట్ ఎంపిక పోటీలలో బ్యాటింగ్, బౌలింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 18 మంది క్రీడాకారులను అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీకి ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్, మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభానురావు, క్రీడా పోటీల సెలక్షన్ కమిటీ మెంబర్స్ అభినవ వినయ్, మట్టెడ కుమార్, తోట రాము, మెతుకు కుమార్ పాల్గొన్నారు.



అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీకి ఎంపికైన జిల్లా జట్టుతో అసోసియేషన్ సభ్యులు

●అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీకి ఎంపికైన జిల్లా జట్టు సభ్యులు...

జె. పార్థీపన్, పి. రంగారావు, కె. ఆరోగ్యచందర్, బి. వితేష్, ఆర్. అర్జున్, పి. రిశ్వంత్, ఏ. రిత్విక్, ఏ. లక్ష్మణ్, ఎం. రాంచరణ్. ఎస్. అద్విక్, ఏ. ఆదిత్య, ఏ, రామ్, ఎం. పూజిత్, ఎండీ. మోమీన్‌అమీన్, వి. హర్షిక్‌రాజ్, కె. శశిధర్, కె. విగ్నేష్, ఎండీ. హస్సన్‌లు ఎంపికైన వారిలో ఉన్నారు.

## 'చలో హైదరాబాద్'కు తరలిన కార్మికులు

కాజీపేట, సెప్టెంబరు 23 : కార్మికుల సంక్షేమ బోర్డును ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించడాన్ని నిరసిస్తూ హైదరాబాద్ లేబర్ ఆఫీస్ ముట్టడికి సోమవారం కార్మికులు హైదరాబాద్ తరలివెళ్లారు. వాహనాలకు రాష్ట్ర భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు ఎంజాల మల్లేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేలు సారంగపాణి జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. సంక్షేమ బోర్డు నుంచి గత ప్రభుత్వం ప్రకటించిన లక్ష బైకులను కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు రవి, కొండన్న, ఎన్ సాయికుమార్, జక్కుల రమేశ్, బాలశౌరీ, కే ఐలయ్య, ఎస్ అశోక్ పాల్గొన్నారు.

## రిజర్వేషన్లు రద్దు దేశ ప్రతిష్టకు భంగమే..

వడ్డెపల్లి, సెప్టెంబరు 23: కేంద్రంలో తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత బడుగు, బలహీన వర్గాల రిజర్వేషన్లు రద్దు చేస్తామని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మాట్లాడడం దేశ ప్రతిష్టకు భంగమేనని బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్ అన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు తాడెం రాజేందర్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ ఎస్సీ మోర్చ శ్రేణులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గడ్డం మహేందర్, తాడెం రాజేందర్ మాట్లాడుతూ అమెరికా పర్యటన సందర్భంగా రాహుల్‌గాంధీ బడుగు, బలహీన వర్గాల రిజర్వేషన్లను తొలగిస్తామని ప్రకటించడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ప్రదర్శనలో బీజేపీ ఎస్సీ మోర్చ జిల్లా ఇన్‌చార్జి జాడి రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల రమేష్, ఉపాధ్యక్షుడు ముడుసు స్టాలిన్ పాల్గొన్నారు.

## నేడు ఎన్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక దినోత్సవం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23: కేయూ సెనెట్ హాల్‌లో జాతీయ సేవ పథకం (ఎన్‌ఎస్‌ఎస్)వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తామని కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అతిథులుగా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, వర్సిటీ పాలక మండలి సభ్యులు పాల్గొని మాట్లాడుతారని ప్రొఫెసర్ ఈసం నారాయణ వెల్లడించారు.

## రేషన్ బియ్యం పట్టివేత

కాజీపేట, సెప్టెంబరు 23 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వై సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఓ వ్యక్తి వివిధ ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం సేకరించి డీజిల్‌కాలనీ వద్ద ఓ స్థలంలో నిల్వ చేశాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం చెందిన మాట్ల రమేశ్ మడికొండ ప్రాంతంలో తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి తమ ప్రాంతంలో ఎక్కు ధరకు అమ్ముతున్నట్లు ఒప్పుకున్నాడు. 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## ప్రతీ రైతుకు రుణం మంజూరు

### పీఏసీఎస్ ఛైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి

ధర్మసాగర్, సెప్టెంబరు 23: రుణమాఫీ అయిన ప్రతి రైతుకు తిరిగి రుణాలు మంజూరు చేస్తామని పీఏసీఎస్ ఛైర్మన్ రాజేశ్వరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పీఏసీఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పీఏసీఎస్ సంఘం ప్రస్తుతం లాభాల బాటలో నడుస్తుందని తెలిపారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు బ్యాంక్, గోడౌన్‌ల నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. ఈ భవనలను అక్టోబర్‌లో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. బ్యాంక్‌లో సభ్యత్వం ఉన్న రైతు గొడుగు లింగయ్య ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబానికి రూ. లక్ష ప్రమాద బీమా చెక్కును ఛైర్మన్ అందజేశారు. వైస్ ఛైర్మన్ యాద కుమారస్వామి, డైరెక్టర్లు లెనిన్, విజయ, బీ అమరేందర్‌రెడ్డి, వీరయ్య పాల్గొన్నారు.

## జీవోను ఉపసంహరించుకోవాలి

### టీపీటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి

వేలేరు, సెప్టెంబరు 23: ఉపాధ్యాయుల రేషనలైజేషన్ జీవోను ప్రభుత్వం ఉపసంహరించాలని టీపీటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నబోయిన తిరుపతి అన్నారు. సోమవారం మండలంలోని మల్లికుదుర్ల, పీచర, గుండ్ల సాగర్, శాలపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును కల్పించాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. జీవో 25 వల్ల ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రమాదంలో ఉందన్నారు.

## నల్లబెల్లం పట్టివేత

కాజీపేట, సెప్టెంబరు 23 : అక్రమంగా తరలిస్తున్న నల్లం బెల్లం, పటికను సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట టౌన్ స్టేషన్ సమీపంలో సోమవారం పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానస్పదంగా ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ బ్యాగులు తనిఖీ చేశారు. 1,180 కిలోల నల్లబెల్లం, 170 కిలోల పటిక దొరికింది. పట్టుబడ్డ వారిలో చెన్నరావుపేటకు చెందిన బోడ రాజు, నెక్కొండకు చెందిన మాలోత్ రాములు, కెలోజు మాజీ, భూక్య పద్మ ఉన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ నల్లబెల్లం, పటిక విలువ రూ. 55 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 23 : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని కిషన్‌పురలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, బొక్కలగడ్డ, శ్రీనగర్‌కాలనీ, పోచమ్మకుంట, కమ్మరివాడ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.



విజయ సంకేతం చూపిస్తున్న గ్రేటర్ ప్రైవేట్ హాస్టల్స్ అసోసియేషన్ కార్యవర్గం

## ప్రైవేట్ హాస్టల్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

### అధ్యక్షుడిగా కాసు శ్రీనివాస్‌రెడ్డి విజయం

న్యూశాయంపేట, సెప్టెంబరు 22: గ్రేటర్ వరంగల్ ప్రైవేట్ హాస్టల్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికైంది. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో కాసు శ్రీనివాస్ రెడ్డి(కేఎస్‌ఆర్) ప్యానెల్ క్లీన్‌స్వీప్ చేసింది. అధ్యక్షుడిగా కాసు శ్రీనివాస్ రెడ్డి విజయం సాధించారు. శ్రీనివాస్‌రెడ్డి తన ప్రత్యర్థి ఏరుకొండ పవన్‌కుమార్ గౌడ్‌పై 71 ఓట్ల తేడాతో విజయం సాధించారు. గ్రేటర్ వరంగల్ ప్రైవేట్ హాస్టల్స్ అసోసియేషన్‌లో 437 ఓట్లు ఉండగా 405 ఓట్లు పోలయ్యాయి. శ్రీనివాస్‌రెడ్డికి 237 ఓట్లు రాగా పవన్‌కుమార్ గౌడ్‌కు 166ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా జినుకల లక్ష్మణరావు, ఉపాధ్యక్షులుగా రాసూరి రాజేష్, కోశాధికారిగా చింతల నాగిరెడ్డి(నాగరాజు), సహాయ కార్యదర్శిగా శీలం శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా డోలె రాజు, బూర్గుల ప్రమోదాదేవి విజయం సాధించారు. విజయం సాధించినకార్యవర్గం బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.

## తాగునీటి సమస్యలను పరిష్కరించండి

### దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌ను అకస్మికంగా తనిఖీ చేసిన మేయర్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 23 : గ్రేటర్ వరంగల్ 22వ డివిజన్ దేశాయిపేట ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్‌ను వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అకస్మికంగా తనిఖీ చేశారు. ఫిల్టర్‌బెడ్‌లో పని చేస్తున్న సిబ్బంది హాజరు పట్టికతో పాటు రిజిస్టర్‌లను పరిశీలించారు. వాటర్ మానిటరింగ్ సెల్, హెయిల్ బ్లోయింగ్, ఫిల్టర్ మీడియా, సంప్, సంప్ హౌస్‌లను పరిశీలించి అక్కడ పని చేస్తున్న వారికి తగు సూచనలు చేశారు. ధర్మసాగర్ నుంచి ఫిల్టర్‌బెడ్‌కి వచ్చే రా వాటర్, ఫిల్టర్ బెడ్‌లోని నీటి శుద్ధి ప్రక్రియ, క్లోరినేషన్ చేసిన తర్వాత ప్రజలకు సరఫరా అయ్యే నీటి నాణ్యతను పరిశీలించారు. ముఖ్యంగా రైల్వేగేటు ప్రాంతంలో పలు కాలనీలకు నీటి సరఫరా సరిగా అందడం లేదని ఫిర్యాదులు వచ్చాయని ప్రజల సమస్యను త్వరితగతిన పరిశీలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈలు రంగారావు, రాజ్‌కుమార్, ఏఈలు కృష్ణమూర్తి, హరికుమార్, ముజామిల్, హబీబుద్దీన్ పాల్గొన్నారు.



హనుమకొండలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి జలమయమైన బస్టాండ్ ప్రాంతం

మీకు తెలుసా?

## ఆహారం వ్యామోహం

కొన్ని పదార్థాల మీదకు పదే పదే మనసు మళ్లడం, మనం తీసుకుంటున్న ఆహారంలో పోషక లోపానికి సంకేతం. మనందరం సాధారణంగా ఎదుర్కొనే ఏడు రకాల ఫుడ్ క్రేవింగ్స్ వాటికి కారణమైన విటమిన్ లోపాల గురించి తెలుసుకుందాం!

- **చాక్లెట్:** చాక్లెట్లు తినాలనిపిస్తే, మెగ్నీషియం తగ్గిందని అర్థం. కండరాలు, నాడుల పనితీరుకూ, రక్తంలోని చక్కెర నియంత్రణకూ, ఎముకల ఆరోగ్యానికీ మెగ్నీషియం అవసరం. కాబట్టి చాక్లెట్ తినాలనిపించినప్పుడు, మెగ్నీషియం సమృద్ధిగా దొరికే ఆకుకూరలు, నట్స్, సీడ్స్ తింటూ ఉండాలి.
- **తీపి పదార్థాలు:** తీపి తినాలనే యావకు కారణం క్రోమియం లోపం. క్రోమియం, రక్తంలోని చక్కెర మోతాదుల నియంత్రణకు తోడ్పడుతుంది. ఈ ఖనిజ లవణం లోపిస్తే, ఆ లోటును వెంటనే భర్తీ చేసుకోవడం కోసం శరీరం తీపి తినాలనే కోరికను పెంచుతుంది. కాబట్టి క్రోమియం సమృద్ధిగా దొరికే బ్రొకొలి, ద్రాక్ష, బంగాళాదుంపలు, వెల్లుల్లి, లేత మాంసం తింటూ ఉండాలి.
- **ఉప్పు:** మన ఆహారం ద్వారా సరిపడా ఉప్పు అందుతూనే ఉంటుంది. అయినా కొన్నిసార్లు సాల్టీ స్నాక్స్ మీదకు మనసు మళ్లుతూ ఉంటుంది. ఇది సోడియం లోపానికి సూచన. మరీ ముఖ్యంగా ఎక్కువగా చమటను కోల్పోతూ ఉండేవాళ్లు లేదా కొన్ని రకాల మందులను తీసుకుంటున్న వాళ్లలో ఈ లక్షణం సర్వసాధారణం. శరీరంలో ద్రవాలను నిలిపి ఉంచడానికీ, నాడీ పనితీరుకూ సోడియం అవసరం. అయితే ఉప్పు తినాలని అనిపించినప్పుడు, చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్ లాంటివి ఎంచుకోకుండా, ఆలివ్స్, భోజనంలో సముద్రపు ఉప్పును కలుపుకోవడం ఆరోగ్యకరం.
- **చీజ్:** చీజ్ లేదా ఇతరత్రా పాల ఉత్పత్తుల మీదకు మనసు మళ్లుతూ ఉంటే, క్యాల్షియం లోపంగా భావించాలి. ఎముకల ఆరోగ్యానికీ, కండరాల పనితీరుకూ, నాడీ సంకేత ప్రసారాలకూ క్యాల్షియం అవసరం. కాబట్టి పాలు, పెరుగు, చీజ్ లేదా సోయా, టోఫు, బాదం, ఆకుకూరలను ఆహారంలో చేర్చుకుంటూ ఉండాలి.



- **మాంసం:** రక్తలేమికి గురైన వాళ్లకు మాంసం తినాలనిపిస్తుంది. ఇందుకు కారణం ఐరన్ లోపం. వృక్షాధారిత ఆహారం తినేవాళ్లు, మహిళలు, పిల్లల్లో ఐరన్ లోపం ఎక్కువ. ఈ లోపాన్ని భర్తీ చేయడం కోసం మాంసాహారం మీదే ఆధారపడవలసిన అవసరం లేదు. పప్పులు, చిక్కుళ్లు, పాలకూరల్లో కూడా ఐరన్ పుష్కలంగా దొరుకుతుంది. అయితే ఐరన్ సమృద్ధిగా దొరికే పదార్థాలకు విటమిన్ సిని కూడా జోడించినప్పుడే, శరీరం ఐరన్‌ను సమర్థంగా శోషించుకోగలుగుతుంది.
- **కార్బ్స్:** బ్రెడ్, పాస్తాల మీదకు మనసు మళ్లితే కార్బ్స్ క్రేవింగ్‌గా భావించాలి. కొన్ని సందర్భాల్లో సెరటోనిన్ లోపంలో కూడా ఇదే లక్షణం కనిపిస్తుంది. పిండిపదార్థాలు తినడం వల్ల, భావోద్వేగాలతో సంబంధముండే సెరటోనిన్ అనే న్యూరో ట్రాన్స్‌మీటర్ విడుదల పెరుగుతుంది. ఇలా కార్బ్స్ తినడం మనసు తేలికపడినా, శరీరంలోకి అదనపు క్యాలరీలు చేరిపోతూ ఉంటాయి. కాబట్టి సెరటోనిన్ మోతాదును పెంచే సంక్లిష్టమైన పిండిపదార్థాలతో కూడిన పండ్లు, కూరగాయలు, దుంపలు (చిలగడదుంప) తినాలి.

ఫిట్‌నెస్

## ఈ వ్యాయామంతో శరీరం దృఢం


స్ట్రెంగ్త్ ట్రైనింగ్‌లో డెడ్ లిఫ్ట్‌కు ప్రత్యేకమైన స్థానం ఉంది. దృఢమైన శరీరాకృతి కోసం ప్రతి రోజూ డెడ్ లిఫ్ట్ సాధన చేయడం అవసరం. అయితే ఈ వ్యాయామం, వయసు, దారుఢ్యం, ఆరోగ్యం... ఈ మూడు అంశాల మీద ఆధారపడి ఉంటుంది.

సాధారణంగా డెడ్ లిఫ్ట్... బాడీ పోశ్చర్, ఎముకల సాంద్రతలను పెంచుతుంది. అయితే ఫిట్‌నెస్ లెవెల్, ఫామ్, తీవ్రత, రికవరీ మొదలైన భిన్నమైన అంశాల మీదే ఈ వ్యాయామం ప్రతికూల, అనుకూల ఫలితాలు ఆధారపడి ఉంటాయి. డెడ్ లిఫ్ట్‌ను ప్రతి రోజూ సాధన చేస్తే..

- **దారుఢ్యం:** పిరుదుల కండరాలు, పిక్కల్లోని కండరాలు, వెన్ను, కోర్ కండరాలను ఈ వ్యాయామం బలపరుస్తుంది. ఈ వ్యాయామంతో ఈ కండర సమూహాలు దృఢపడి, కండరాల బరువు, పరిమాణాలు పెరుగుతాయి.



- **పోశ్చర్:** సరైన పోశ్చర్‌కు తోడ్పడే కండరాలు ఈ వ్యాయామంతో బలపడతాయి. వెన్ను నిటారుగా మారుతుంది. కాబట్టి పట్టు తప్పి పడిపోవడం, తూలిపడడం లాంటి ప్రమాదాలు తప్పుతాయి.
- **ఎముకల సాంద్రత:** ఈ వ్యాయామంతో ఎముకల ఎదుగుదల, సాంద్రత పెరుగుతుంది. దాంతో ఆస్టియొపోరోసిస్ తగ్గి, పెద్ద వయసులో ఎముకలు విరిగే ప్రమాదాలు తగ్గుతాయి.
- **పట్టు:** చేతుల్లో పట్టు పెరుగుతుంది. దాంతో దైనందిన జీవితంలో చేతుల్లో నుంచి వస్తువులు జారి పడిపోవడం, చేతులు పట్టుతప్పడం లాంటి పొరపాట్లకు ఆస్కారం ఉండదు.
- **అతి శిక్షణ:** ఇది తీవ్రమైన వ్యాయామం. కేంద్ర నాడీ వ్యవస్థ, మస్క్యులో స్కెలెటల్ వ్యవస్థల మీద ఒత్తిడి పెంచే వ్యాయామమిది. ప్రతి రోజూ ఈ వ్యాయామం చేసేవారు, తగినంత విశ్రాంతి కూడా తీసుకుంటూ ఉండాలి. లేదంటే అలసట పెరిగి, ప్రమాదాలకు దారి తీసే ప్రమాదం ఉంటుంది.
- **కీళ్ల ఒత్తిడి:** డెడ్ లిఫ్ట్‌తో వెన్ను, పిరుదులు, మోకాళ్ల మీద ఒత్తిడి పడుతుంది. ఊబకాయులు, కీళ్ల సమస్యలు ఉన్నవాళ్లు ఈ వ్యాయామానికి దూరంగా ఉండాలి.



అవేర్‌నెస్

# పని ఒత్తిడి ప్రాణం తీస్తుందా..?

ఎంత ఒత్తిడి ఉంటే అంత పని జరుగుతుందని కొందరు భావిస్తారు. అయితే ఒత్తిడిని భరించే సామర్థ్యం అందర్లో ఒకేలా ఉండదని పూణె ఉద్యోగిని అకాల మరణం నిరూపించింది. నిజంగానే పని ఒత్తిడి మరణానికి చేరువ చేస్తుందా? ఒత్తిడి, ఆందోళనలతో మానసిక, శారీరక ఆరోగ్యాలు దెబ్బ తినకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి? వైద్యులు ఏమంటున్నారు?

వ్యక్తిత్వం, స్వభావాలను బట్టి పని ఒత్తిడిని భరించే సామర్థ్యం మారుతూ ఉంటుంది. ఒకే మోతాదు పని, ఇద్దరు వ్యక్తుల మీద భిన్నమైన ప్రభావాన్ని కనబరుస్తుంది. ఒకరు సవాలుగా తీసుకుని, సమర్థంగా పనిని సమయానికి ముగించగలిగితే, ఇంకొకరు ఒత్తిడి, ఆందోళనలకు లోనై ఆలస్యంగా పనిని పూర్తి చేయగలుగుతారు. వ్యక్తిగత సమస్యలు, పని ప్రదేశంలో ఎక్కువ గంటల పాటు గడపడం, సమయానికి ఆహారం తీసుకోలేకపోవడం... ఇలా ఎన్నో అంశాలు పని ఒత్తిడికి తోడవుతూ ఉంటాయి. మరీ ముఖ్యంగా ఎలాగైనా టార్గెట్‌ను అందుకోవాలనే ఆలోచనతో నిద్ర మానుకుని పని చేయడం వల్ల, శరీరం రెట్టింపు ఒత్తిడికి లోనవుతుంది. ఇవన్నీ అంతిమంగా డిప్రెషన్‌కు దారి తీస్తాయి. ఈ కుంగుబాటును ఎవరికి వారు కనిపెట్టలేకపోవడం, కుటుంబసభ్యులు, సహోద్యోగులు పట్టించుకోకపోవడం, సమయానికి అప్రమత్తం అవలేకపోవడం వల్ల, అంతిమంగా పని ఒత్తిడి, ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తుంది.

### కారణాలు కోకొల్లలు

చేతిలో ఉద్యోగం పోతే మళ్లీ కొత్త ఉద్యోగం సంపాదించుకోవడం కష్టమైపోతున్న పరిస్థితి కొనసాగుతోంది. దాంతో ఎలాగైనా ఉద్యోగంలో కొనసాగాలనే ఒత్తిడి ప్రతి ఒక్కర్లో ఉంటోంది. మరీ ముఖ్యంగా కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వాళ్లు పని ఒత్తిడికి తోడు, కొత్త వర్క్ ప్లేస్‌లో సర్దుకుపోగలగడంలో ఇబ్బందులను కూడా ఎదుర్కొంటూ ఉంటారు. సహోద్యోగుల సహకారం లోపించడం, పోటీతత్వంతో కూడిన వాతావరణం, అస్పష్టతతో కూడిన ఉద్యోగ అంచనాలు, అదనపు బాధ్యతలు, గుర్తింపుకు నోచుకోలేకపోవడం, పెరిగిన ఊరికి, కుటుంబానికి దూరంగా కొత్త ఊళ్లో ఉండవలసిరావడం, కెరీర్‌నూ, వ్యక్తిగత జీవితాన్నీ సమంగా నిర్వహించలేకపోవడం, ఉద్యోగంలో భాగంగా సామర్థ్యానికీ, అనుభవానికీ మించిన పని చేయవలసి రావడం లాంటి ఇబ్బందులన్నీ అప్పటికే ఉన్న పని ఒత్తిడికి తోడవుతూ ఉంటాయి. అయితే కొంతమంది తమలో పెరిగిపోయే ఒత్తిడిని స్వయంగా గ్రహించకపోగా, ఆఫీసు పనిని ఇంట్లో కొనసాగిస్తూ ఒత్తిడిని పెంచుకుంటూ ఉంటారు. ఆఫీసు నుంచి బయటపడినా, మెయిల్స్, వాట్సాప్‌లను చెక్ చేసుకుంటూ, నిరంతరం ఉద్యోగ సంబంధ ఆలోచనలు, పని ప్రణాళికలతోనే రోజంతా గడిపేస్తూ ఉంటారు. ఇలాంటప్పుడు ఒత్తిడి నుంచి స్వాంతన పొందే అవకాశమే ఉండదు.

### లక్షణాల మీద కన్నేసి...

ఎంత కష్టపడినా, చేయవలసిన పనుల చిట్టా పెరిగిపోతున్నా, పని నుంచి బ్రేక్ తీసుకున్నప్పటికీ అలసట తగ్గకపోతున్నా, పనిని కొనసాగించలేకపోతున్నా, పని ఒత్తిడితో కుంగుబాటుకు (బర్నవుట్) గురవుతున్నట్టు గ్రహించాలి. ఈ బర్నవుట్ కొన్ని లక్షణాల ద్వారా బయల్పడుతూ ఉంటుంది. నిరాశలో కూరుకుపోవడం, ఇతరులతో డిస్కనెక్ట్ అయిపోవడం, ప్రేరణ, శక్తి లోపించడం, ఇతర పనుల మీద ఆసక్తి కోల్పోవడం లాంటి లక్షణాలు దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తున్నట్టు గ్రహించిన వెంటనే అప్రమత్తం కావాలి. మరీ ముఖ్యంగా కొన్ని లక్షణాల మీద ఓ కన్నేసి ఉంచాలి. అవేంటంటే...

- పని పట్ల ఆసక్తి సన్నగిల్లడం
- తీవ్రమైన అలసట
- నిద్రాభంగం
- బరువు పెరగడం
- నిరాశ, నిస్సహాయతలు
- మౌనంగా మారిపోవడం
- కోపం, చికాకు పెరగడం
- తీవ్రమైన భావోద్వేగాలు

### ఒత్తిడితో, గుండెకు చేటు

పని ఒత్తిడి మానసిక ఆరోగ్యంతో పాటు గుండె ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తుంది. కాబట్టి ఒత్తిడితో మొత్తం ఆరోగ్యం మీద పడే ప్రభావం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడం అవసరం. తీవ్రమైన ఒత్తిడి శరీరంలో ఫైట్ ఆర్ ఫ్లైట్ మెకానిజంను ప్రేరేపిస్తుంది. ఫలితంగా గుండె కొట్టుకునే వేగం, రక్తపోటు పెరుగుతాయి. ఇదే పరిస్థితి దీర్ఘకాలం కొనసాగితే, హృద్రోగాలు, జీర్ణసంబంధ రుగ్మతలు తలెత్తుతాయి. ఇమ్యూనిటీ కూడా కుంటుపడుతుంది. ఎక్కువ గంటల పాటు ఒకే చోట కూర్చుని పని చేయడం వల్ల ఊబకాయం, శరీర భంగిమ సమస్యలు కూడా తలెత్తుతాయి. ఎక్కువ పని గంటల వల్ల విశ్రాంతికీ, వ్యాయామానికీ సమయం ఉండకపోవడం, ఇంటి భోజనాలకు బదులుగా జంక్ ఫుడ్‌కు దగ్గరవడం, ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం ధూమపానానికి అలవాటు పడడం, నిద్ర కోసం మద్యాన్ని ఆశ్రయించడం లాంటివన్నీ ఆరోగ్య సమస్యలను పెంచుతాయి.

**మహిళల మీద ప్రభావం ఎక్కువ**



ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలు కూడా సమంగా నిర్వహించవలసిన రెట్టింపు ఒత్తిడి మహిళల మీద ఎక్కువగా ఉంటుంది. పైగా నెలసరి సమయంలో తలెత్తే హార్మోన్ల హెచ్చుతగ్గుల ప్రభావం, పని సామర్థ్యాన్ని కుంటుపరచవచ్చు. అలాగే పని ప్రదేశంలో చిన్నా చితకా చివాట్లను సైతం మహిళలు తీవ్రంగా పరిగణించి, మానసికంగా కుంగిపోతూ ఉంటారు. అంచనాలను అందుకోలేక పోయామనే ఆత్మన్యూనతకు లోనయ్యే స్వభావం కూడా మహిళల్లోనే ఎక్కువ. అలాగే ఆఫీసు గందరగోళాన్నంతా ఇంటికి వెంట తెచ్చుకుని, అదే ఆలోచనలతో నిద్రను పాడుచేసుకునే మహిళలూ ఉంటారు. ఇలాంటి వారి మీద ఒత్తిడి, ఆందోళనలు పదింతల ప్రభావాన్ని చూపిస్తాయి.

### పరిష్కారాలున్నాయి

మోయలేని బరువును భుజాలకెత్తుకుంటే, ఆ ప్రభావం కచ్చితంగా మనసు, శరీరాల మీద పడుతుంది. ఈ సరళమైన తర్కాన్ని నిర్లక్ష్యం చేసే ఉద్యోగులు, స్వీయ సామర్థ్యాన్ని ఎక్కువగా అంచనా వేసుకుంటూ ఉంటారు. దాంతో సామర్థ్యానికి మించిన పనిని నెత్తిన వేసుకుని, సమయానికి పని పూర్తి చేయలేక ఒత్తిడికి గురవుతూ ఉంటారు. కానీ తమ సామర్థ్యం ఎంతో, ఎంత పనికి పూర్తి న్యాయం చేయగలుగుతారో ఎవరికి వారు తెలుసుకోవాలి. 'నో' చెప్పడానికి వెనకాడి, మొహమాటంకొద్దీ పనిని నెత్తిన వేసుకుని, సతమతమైపోయేవాళ్లూ ఉంటారు. ఇలాంటి వాళ్లు, నేనింత పనిని మాత్రమే చేయలేననీ, ఇంకొకరి సహాయం అవసరమనీ నిర్మొహమాటంగా చెప్పి, పని ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. అలాగే అరుదుగా తప్పనిసరి పరిస్థితుల్లోనే రాత్రి పనికి ఒప్పుకోవాలి. రాత్రి ఉద్యోగాలు చేసేవాళ్లు, పగటి వేళ కంటి నిండా నిద్రపోయేలా ప్లాన్ చేసుకోవాలి. భోజన వేళలను కూడా అందుకు తగ్గట్టు సర్దుబాటు చేసుకోవాలి. ధూమపానం, మద్యంతో ఒత్తిడి పెరుగుతుందే తప్ప ఏమాత్రం తగ్గదనే వాస్తవాన్ని గ్రహించాలి. గంటల తరబడి డెస్క్‌లకే అతుక్కుపోకుండా, మధ్యలో లేచి అటూ ఇటూ నడుస్తూ ఉండాలి. నీళ్లు తాగుతూ ఉండాలి.

- **వ్యాయామం:** వ్యాయామం ఒత్తిడిని తగ్గిస్తుంది. కాబట్టి రోజుకు కనీసం అరగంట పాటైనా వ్యాయామం చేయాలి.
- **ధ్యానం:** ధ్యానం, ప్రాణాయామాలతో మనసు నెమ్మదించి, ఒత్తిడి, ఆందోనలు అదుపులోకొస్తాయి.
- **సపోర్ట్:** సహోద్యోగులు, స్నేహితులు, కుటుంబ సభ్యుల తోడ్పాటుతో ఒత్తిడిని తగ్గించుకోవాలి.
- **సరిహద్దులు:** నో చెప్పడం అలవాటు చేసుకోవడంతో పాటు, పని ఒత్తిడిని సమన్వయపరుచుకోవాలి.



డాక్టర్ జ్యోతిర్మయి
సీనియర్ కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్,
మనహ క్లినిక్, హైదరాబాద్.

# ఆహారాన్ని ఆచితూచి...

హెల్తీ ఫుడ్

చికిత్సలతోనే కాదు సహజసిద్ధమైన పదార్థాలతోనూ ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచుకోవచ్చు. అందుబాటులో ఉండే పదార్థాలను తగిన రీతిలో వాడుకోగలిగితే మెరుగైన ఆరోగ్యం సమకూరుతుంది.



### చక్కెరకు విరు గుడు కాకరకాయ

మధుమేహం అదుపులో ఉంచుకోవడానికి ఎక్కువమంది కాకరకాయ రసం తాగుతూ ఉంటారు. ప్రతిరోజూ పరగడుపునే కాకరకాయ రసం తాగితే రక్తంలో చక్కెర స్థాయులు అదుపులోకొచ్చి, మధుమేహ దుష్ఫలితాలైన ఊబకాయం, హృద్రోగాలు, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్‌లు తగ్గుముఖం పడతాయి. అయితే కాకర చేదు రుచి కారణంగా ఈ రసాన్ని తాగడానికి అందరూ ఇష్టపడరు. కానీ దీన్లో మధుమేహం మీద ప్రభావం చూపించే పాలీపెప్టైడ్, విసిన్, చరాటిన్ అనే మూడు ప్రధాన కాంపౌండ్లు ఉంటాయి. ఇవి ఇన్సులిన్‌ను అనుకరిస్తూ, కణాలు చక్కెర పరమాణువులను గ్రహించేలా చేస్తాయి. అలాగే ఇన్సులిన్ విడుదలను పెంచి, కాలేయాన్ని ప్రేరేపించి, శరీరం గ్లూకోజ్‌ను పీల్చుకునే సామర్థ్యాన్ని పెంచుతాయి. కాబట్టి కాకర రసంతో మధుమేహాన్ని అదుపులో ఉంచుకునే ప్రయత్నం చేయాలి. అయితే చేదుగా ఉండే ఈ రసాన్ని తాగలేకపోతుంటే.... ఆ జ్యూస్‌ను రుచికరంగా మార్చుకుని తాగాలి. అదెలాగంటే..

### కాకర రుచిగా!

**కావలసిన పదార్థాలు:**

కాకరకాయలు - 2 లేదా 3
నిమ్మకాయ - అర చెక్క
పసుపు - పావు టీస్పూను
ఉప్పు - చిటికెడు

**తయారీ ఇలా!**

- కాకరకాయలు శుభ్రంగా కడిగి తొక్కు తీయాలి. తొక్కు తీయకుండా కూడా వాడుకోవచ్చు.
- కాకరకాయలును నిలువుగా కోసి, లోపలున్న విత్తనాలు తీసేయాలి.
- తర్వాత చిన్న ముక్కలుగా తరగాలి.
- ఈ ముక్కలను అర చెంచా ఉప్పు కలిపిన నీటిలో 10 నిమిషాలపాటు నానబెట్టాలి.
- తర్వాత ఈ ముక్కలను మిక్సీలో వేసి తిప్పాలి.
- తర్వాత గ్లాసులో పోసి నిమ్మరసం, పసుపు, ఉప్పు, వేసి కలిపి తాగాలి.
- ఇలా తాగలేకపోతే, వడగట్టుకుని కూడా తాగవచ్చు.



### చక్కెర కంటే తేనె మేలేనా?

తేనె, చక్కెర రెండూ తీపి వస్తువులే అయినా తేనె ఆరోగ్యకరమైన తీపి పదార్థం అనే నమ్మకం ఏర్పడిపోయింది. దీన్లో నిజమెంత? చక్కెర బదులు తేనె వాడడం ఆరోగ్యకరమా?

తేనె, చక్కెర రెండూ పిండి పదార్థాలే! వీటిలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌లు వేర్వేరు పరిమాణాల్లో ఉంటాయి. తేనెలో 40% ఫ్రక్టోజ్, 30 % గ్లూకోజ్ ఉంటే, చక్కెరలో 50% ఫ్రక్టోజ్, 50% గ్లూకోజ్ ఉంటాయి.

స్వీట్స్‌లో వాడే శుద్ధిచేసిన ఫ్రక్టోజ్ (సుగర్) కాలేయం సహాయంతో మెటబలైజ్ అయి ఊబకాయం, కాలేయ కొవ్వు, మధుమేహాలకు దారి తీస్తుంది. అయితే ఫ్రక్టోజ్, గ్లూకోజ్‌లు రెండూ శరీరంలోకి చేరుకున్న వెంటనే జీర్ణమై, రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి.

### చక్కెర కంటే తేనె మేలు!

నిజమే! ఎందుకంటే చక్కెరలో లేని నీరు, పూల పుప్పొడి, మెగ్నీషియం, పొటాషియం మొదలైన ఖనిజ లవణాలు తేనెలో ఉంటాయి. ఈ అదనపు అంశాలే తేనెకు అదనపు పోషకాలను జోడిస్తున్నాయి. తేనెతో పోలిస్తే చక్కెరకు గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువ. అంటే... ఇది రక్తంలోని చక్కెర స్థాయిని వెనువెంటనే పెంచేస్తుంది. ఇందుకు కారణం తేనెలో ఉండే ఖనిజ లవణాలు దీన్లో లేకపోవడమే! అయితే తేనె, చక్కెరకు మించిన కేలరీలను శరీరానికి అందిస్తుంది. ఒక టీస్పూను చక్కెరలో 49 కేలరీలు ఉంటే, అంతే తేనెలో 64 కేలరీలు ఉంటాయి. కాబట్టి ఎలాంటి తీపి అయినా అనర్థదాయకమనే విషయం దృష్టిలో పెట్టుకుని తగుమాత్రంగా వాడాలి.

### మాంసకృత్తులు మాంసంలోనే ఉంటాయా?

శాకాహారుల రక్తలేమికి కారణం వారు మాంసం తినకపోవడమే అనుకుంటూ ఉంటారు. కానీ నిజానికి మాంసకృత్తులు పుష్కలంగా పొందగలిగే శాకాహారమూ ఉంది. కాకపోతే వాటి పట్ల అవగాహన లేకపోవడంతో సరిపడా ప్రొటీన్లు పొందలేక రక్తలేమికి గురవుతూ ఉంటాం!

- **మాంసకృత్తులు ఉండే శాకాహారం:** పుట్టగొడుగులు, పచ్చి బఠాణీ, కాలీఫ్లవర్, చిక్కుళ్లు, నట్స్, ఆకుకూరలు, పప్పుల్లో మాంసకృతులు ఎక్కువ. ప్రతిరోజూ ఆహారంలో ఇవి ఉండేలా చూసుకోవాలి. ఆకుపచ్చని కూరగాయలు ఎంచుకోవాలి.
- **శాకాహరమే మేలు:** ప్రొటీన్లు ఎక్కువగా ఉండే మాంసాహారంతో పోలిస్తే శాకాహారం తేలికగా అరుగుతుంది. సమపాళ్లలో మాంసకృత్తులు ఉండే మాంసాహారం కంటే అదే పరిమాణంలో ఉండే శాకాహారంలో అదనంగా పీచు కూడా ఉంటుంది. కాబట్టి మలబద్ధకం సమస్య కూడా తలెత్తదు.



ఎంత కష్టపడినా, చేయవలసిన పనుల చిట్టా పెరిగిపోతున్నా, పని నుంచి బ్రేక్ తీసుకున్నప్పటికీ అలసట తగ్గకపోతున్నా, పనిని కొనసాగించలేకపోతున్నా, పని ఒత్తిడితో కుంగుబాటుకు (బర్నవుట్) గురవుతున్నట్టు గ్రహించాలి.



అవగాహన

## ఐస్ బాత్ మంచిదేనా?


అథ్లెట్లు, ఫిట్‌నెస్ నిపుణులు, ప్రముఖులు, ఆరోగ్య ప్రయోజనాలను పొందడం కోసం గడ్డకట్టిన నీళ్లలో స్నానం చేస్తున్న సందర్భాలను చూస్తూ ఉంటాం. అయితే ఈ ఐస్ బాత్ నిజంగానే ఆరోగ్యానికి ప్రయోజనం కలిగిస్తుందా?

- **ఏం జరుగుతుంది:** చల్లనీళ్లలో మునగడం వల్ల అకస్మాత్తుగా క్షీణించిన నీటి తాపమానం వల్ల మన రక్తనాళాలు కుంచించుకుపోతాయి. దాంతో శరీర తాపమానాన్ని నిలకడగా ఉంచడం కోసం, ప్రధాన అంతర్గత అవయవాలను కాపాడుకోవడం కోసం, అవయవాల్లోని రక్తం మొత్తం కోర్ దగ్గరకు పరుగులు పెడుతుంది.
- **నొప్పుల తగ్గుదల:** అథ్లెట్లు ఐస్ బాత్స్ తీసుకోడానికి ప్రధాన కారణం ఇదే! ఐస్ బాత్‌తో కండరాల నొప్పులు తగ్గుతాయి. దెబ్బతిన్న కణజాలం తాపమానం తగ్గి రక్తనాళాలు కుంచించుకుపోయి, కండరాల నొప్పులు, వాపులు తగ్గుతాయి. దాంతో తీవ్రమైన వ్యాయామాలు చేసే వాళ్లు, తదనంతర కండర నొప్పుల నుంచి ఉపశమనం పొందడం కోసం ఐస్ బాత్‌ను ఆశ్రయించవచ్చు.
- **కోలుకోవచ్చు:** వ్యాయామ సమయంలో శరీరంలో పేరుకుపోయే లాక్టిక్ యాసిడ్ శరీరం నుంచి బయటకు వెళ్లిపోతుంది. చల్ల నీళ్లలో మునిగి, బయటకు రావడం వల్ల కుంచించుకుపోయి, తిరిగి వ్యాకోచించే రక్తనాళాల ఫలితంగా ఈ ఫ్లషింగ్ మెకానిజం ప్రేరేపితమవుతుంది. దీంతో మెటబాలిక్ వేస్ట్ బయటకు వెళ్లిపోయి కండరాలు త్వరగా కోలుకుంటాయి.
- **వ్యాధినిరోధకశక్తి:** క్రమం తప్పకుండా ఐస్‌బాత్ చేస్తూ ఉంటే, లింఫ్ వ్యవస్థ ప్రేరేపితమై, శరీరంలోని వ్యర్థాలు, విషాలు బయటకు వెళ్లిపోతాయి. చల్లనీళ్లలో మునిగి, బయటకు రావడం వల్ల సంకోచ, వ్యాకోచాలకు గురయ్యే కండరాలతో లింఫ్ ద్రవాలు శరీరమంతా ప్రసరించి, తెల్ల రక్తకణాల ఉత్పత్తిని పెంచుతాయి. ఫలితంగా ఇమ్యూనిటీ పెరుగుతుంది.
- **రక్తప్రసరణ:** ప్రారంభంలో రక్తనాళాలు సంకోచించినా, నీళ్లలో నుంచి బయటకు రాగానే అవి వ్యాకోచిస్తాయి. ఈ ప్రక్రియ, మారిపోయే తాపమానాలకు అలవాటు



పడేలా శరీరాన్ని ప్రోత్సహించి, తద్వారా రక్తప్రసరణను పెంచుతుంది. రక్తప్రసరణ మెరుగవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది.
- **మానసిక ఆరోగ్యం:** చల్లనీళ్లతో శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. శరీర సహజసిద్ధ నొప్పి నివారిణులు, మూడ్ ఎలివేటర్లు అయిన ఈ ఎండార్ఫిన్లు విడుదలవడంతో నొప్పులు తగ్గి, మనసు తేలికపడుతుంది.
- **జాగ్రత్తలు:** ఐస్ బాత్స్‌తో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నప్పటికీ, చల్లనీటి స్నానాలతో కొన్ని దుష్ప్రయోజనాలు కూడా పొంచి ఉంటాయి. కాబట్టి చల్లనీళ్లలో పరిమిత సమయమే గడుపుతూ, శరీర కోర్ తాపమానం క్షీణించకుండా చూసుకోవాలి. చల్లనీళ్ల ప్రయోజనాలు పొందడం కోసం 10 నుంచి 15 నిమిషాలు చల్లనీళ్లలో మునిగి ఉంటే సరిపోతుంది. చల్లనీళ్లు రక్తపోటును పెంచుతాయి కాబట్టి గుండె జబ్బులున్నవాళ్లు వైద్యుల సలహా మేరకు నడుచుకోవాలి.

నవ్య చిత్రజ్యోతి
మంగళవారం 24 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com



## ఇంకో 75 రోజుల్లో పుష్ప రూల్

'పుష్ప ద రూల్.. భారతీయ సినీపరిశ్రమ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమా ఇది. అల్లు అర్జున్ నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం మరో 75 రోజుల్లో అంటే డిసెంబర్ 6న విడుదల కానుంది. అంటే పుష్ప రూల్‌కు కౌంట్ డౌన్ మొదలైందన్నమాట. అల్లు అర్జున్ నటన కోసం, దర్శకుడు సుకుమార్ టేకింగ్, మేకింగ్ కోసం అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. మరోవైపు నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. కంటెంట్ పరంగానే కాకుండా సాంకేతికంగా కూడా ఈ సినిమా అత్యున్నత స్థాయిలో ఉంటుందని నిర్మాతలు నవీన్ యర్నేని, రవిశంకర్ చెప్పారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు, టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిందనీ, ఇక వచ్చే ప్రతి ప్రమోషనల్ కంటెంట్ అదిరిపోయే రీతిలో ఉంటుందని వారు తెలిపారు. రశ్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

## టిక్కెట్ ధర పెంపునకు ప్రభుత్వ అనుమతి



జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న దేవర సినిమా ఈ నెల 27న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో దేవర సినిమా టిక్కెట్ల ధరలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. అంతేకాదు మిడ్ నైట్ షోలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మిడ్ నైట్ షోలు ఆడించేందుకు 29 థియేటర్లకు అనుమతించింది. ఈ మేరకు హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సినిమా రిలీజ్ రోజున ఆరు షోలు ఆడించేందుకు థియేటర్లకు అనుమతి ఇచ్చారు. మరుసటి రోజు నుంచి అక్టోబరు 6 వరకు రోజుకు 5 షోలు ఆడించుకునే వెసులు బాటు కల్పించారు. తొలిరోజు టిక్కెట్ ధరలను రూ. 100 పెంచుకునేందుకు అనుమతించారు. సింగిల్ స్క్రీన్‌లలో టిక్కెట్‌పై రూ. 25, మల్టీప్లెక్స్‌లో రూ. 50 పెంచుకునే అవకాశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ సినిమాకు టికెట్ రేటు పెంచే సదుపాయం అక్కడి ప్రభుత్వం కల్పించిన సంగతి విదితమే.

**అమెరికా వెళ్లిన ఎన్టీఆర్**

జూనియర్ ఎన్టీఆర్ తన సతీమణి ప్రణతీతో కలసి అమెరికా బయలుదేరారు. లాస్‌ఏంజిల్స్‌లోని బియాండ్‌ఫెస్ట్‌లో ఈ నెల 26 సాయంత్రం జరిగే దేవర స్క్రీనింగ్‌కి హాజరు కానున్నారు. అలాగే అక్కడ కొన్ని మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇవ్వనున్నారు.




మహేశ్‌బాబు, నమ్రత శిరోద్కర్ సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. వరద బాధితుల సహాయార్థం ప్రకటించిన రూ.50 లక్షల చెక్కును సీఎంకు అందజేశారు. అలాగే ఏ.ఎమ్.బి తరఫున మరో రూ. 10లక్షల చెక్కును కూడా మహేశ్‌బాబు అందజేశారు

## సెట్‌లో దర్శకుడి బర్త్ డే



సిద్ధు జొన్నలగడ్డ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జాక్'. 'కొంచెం క్రాక్' అనేది ట్యాగ్ లైన్. సీనియర్ ప్రొడ్యూసర్ బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం నేపాల్‌లో జరుగుతోంది. ఇప్పటికి ఎనభై శాతం చిత్రం పూర్తయిందనీ, ఫ్రెష్ కామెడీతో లాఫింగ్ రైడ్‌లా సినిమా ఉంటుందని నిర్మాత చెప్పారు. సోమవారం దర్శకుడు భాస్కర్ పుట్టినరోజు కావడంతో సెట్‌లో సెలబ్రేట్ చేశారు. ప్రకాశ్‌రాజ్, హీరోయిన్ వైష్ణవి తదితరులు కూడా పాల్గొన్నారు.

## చారిత్రక యోధుడి పాత్రలో తొలిసారి!



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ మళ్లీ ముఖానికి మేకప్ వేసుకుని కెమెరా ముందుకు వచ్చారు. ఆయన తొలిసారిగా చారిత్రక యోధుడి పాత్ర పోషిస్తున్న 'హరి హర వీరమల్లు' సినిమా తాజా షెడ్యూల్ సోమవారం ఉదయం విజయవాడలో మొదలైంది. కళా దర్శకుడు తోట తరణి రూపొందించిన భారీ సెట్‌లో యుద్ధ సన్నివేశాన్ని దర్శకుడు జ్యోతికృష్ణ చిత్రీకరిస్తున్నారు. హాలీవుడ్ యాక్షన్ డైరెక్టర్ నిక్ పావెల్ సారథ్యంలో జరుగుతున్న ఈ చిత్రీకరణలో నాజర్, రఘుబాబు, అయ్యప్ప పి.శర్మ, సునీల్ తదితరులతో పాటు ఫైటర్లు, జూనియర్ ఆర్టిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. నిధి అగర్వాల్ చిత్ర కథానాయిక కాగా, బాలీవుడ్ నటులు బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.వచ్చే ఏడాది మార్చి 28న 'హరిహర వీరమల్లు' పార్ట్ వన్ విడుదలవుతుందని వెల్లడిస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. పవన్‌కల్యాణ్‌ను సరికొత్తగా చూడబోతున్నామని ఈ పోస్టర్‌తో హామీ ఇచ్చారు దర్శకనిర్మాతలు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రాన్ని ఎ.ఎం.రత్నం సమర్పణలో ఎ.దయాకరరావు చెప్పారు,

## ఆ వీధికి నాన్న పేరు పెట్టండి

**స్టాలిన్‌కు ఎస్పీ చరణ్ వినతి**



గానగంధర్వుడు, సినీ నేపథ్యగాయకుడు దివంగత ఎస్.పి.బాలసుబ్రమణ్యం నివసించిన కామ్‌దార్‌నగర్‌కు ఆయన పేరును పెట్టాలని ఎస్పీబీ తనయుడు, సినీ నేపథ్యగాయకుడు ఎస్పీ .చరణ్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం చెన్నై సచివాలయం ప్రాంగణంలో ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్ సెల్‌లో వినతిపత్రం సమర్పించారు. ఇందులో.. 'సంగీత ప్రపంచంలో తన మధురమైన గాత్రంతో కోట్లాదిమంది అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జీవించివున్న సమయంలో స్థానిక నుంగంబాక్కంలోని కామ్‌దార్‌నగర్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసివుండేవారు. ప్రస్తుతం ఆయన భౌతికంగా లేకపోవడంతో ఆయనను స్మరించుకునేలా ఎస్పీబీ నివసించిన కామ్‌దార్‌నగర్‌కు 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నగర్ లేదా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వీధి'గా నామకరణం చేయాలని కోరుతున్నాను. ఈ వినతిని పెద్దమనసుతో అంగీకరించి, తమతో పాటు కోట్లాదిమంది ఎస్పీబీ అభిమానుల కోరికను తీర్చాలని కోరుతున్నాం' అని ఎస్పీ చరణ్ కోరారు. కాగా, ఈ నెల 25వ తేదీన ఎస్పీబీ నాలుగో వర్ధంతి వేడుకలు జరుగనున్న విషయం తెల్సిందే.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

## ఆస్కార్‌కి వెళ్తున్న లాపతా లేడీస్

వచ్చే ఏడాది జరిగే ఆస్కార్ అవార్డుల వేడుకకు ఇండియా నుంచి వెళ్లే సినిమా ఖరారైపోయింది. ఆ చిత్రమే.. బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ మాజీ భార్య.. 'ధోబీ ఘాట్' ఫేమ్ కిరణ్ రావు దర్శకత్వం వహించిన 'లాపతా లేడీస్'. 2025 సంవత్సరానికిగాను ఉత్తమ విదేశీ చిత్రాల జాబితాలో మన దేశం నుంచి అధికారిక ఎంట్రీగా 'లాపతా లేడీస్' చిత్రాన్ని నామినేట్ చేస్తున్నట్టు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎఫ్ఐ) ఛైర్మన్ జహ్నూ బారువా ఇతర నిర్వాహకులు రవి కొట్టార్కర, సి.కళ్యాణ్ తదితరులతో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ ఏడాది ఆస్కార్ నామినేషన్ల కోసం తెలుగు, తమిళం, మలయాళం, మరాఠీ, హిందీ భాషలకు చెందిన 29 చిత్రాలను 13 మందితో కూడిన కమిటీ సభ్యులు షార్ట్‌లిస్ట్‌చేయగా, అందులో 'లాపతా లేడీస్'ను అధికారిక ఎంట్రీగా సభ్యులంతా ఎంపిక చేసినట్టు జహ్నూ బారువా వెల్లడించారు. కాగా, మార్చి ఒకటిన విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక అవార్డులనూ పొందింది.



అలాగే, భారతదేశ అత్యున్నత న్యాయస్థానం 75వ వార్షికోత్సవాల్లోనూ ఆ చిత్రాన్ని ప్రదర్శించడం విశేషం. కొత్తగా పెళ్లైన ఓ గ్రామీణ జంట జీవితాల్లో జరిగిన అనూహ్య సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. వారు ఎదుర్కొన్న అనేక సమస్యలను ఇందులో మనసుకు హత్తుకునేలా తెరకెక్కించడమే ఈ చిత్ర విజయానికి కారణం. ఈ సినిమాతో పాటు తెలుగు చిత్రసీమ నుంచి 'కల్కి 2898 ఏ.డీ', 'హను-మాన్', 'మంగళవారం' చిత్రాలు.. బాలీవుడ్ నుంచి 'యానిమల్', 'కిల్', 'శ్రీకాంత్', 'ఆర్టికల్ 370', 'మైదాన్'.. మలయాళం నుంచి నేషనల్ అవార్డ్ విన్నర్ "ఆట్టమ్', 'ఆడు జీవితమ్', 'ఆల్ వియ్ ఇమాజిన్ ఆజ్ లైట్'.. తమిళ్ నుంచి 'వాజై', 'మహరాజా' వంటి 29 చిత్రాలు పోటీ పడ్డాయి.

**నమ్మకం నిజమైంది**

'లాపతా లేడీస్' ఆస్కార్‌కు ఎంపికైనందుకు దర్శకురాలు కిరణ్ రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ఈ చిత్రం ఆస్కార్‌కు నామినేట్ అవుతుందని ఇంతకు ముందే ఓ ఇంటర్వ్యూలో చెప్పాను. నా నమ్మకం నిజమైంది. సినిమా కోసం అహర్నిశలు శ్రమించిన మా చిత్రబృందానికి దక్కిన గుర్తింపు ఇది. భారత్‌లో ఈ సినిమాను ఎలా ఆదరించారో.. అంతర్జాతీయంగానూ అంతే ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అని అన్నారు.




## అన్నయ్య హగ్ చేసుకున్నాడు



తమిళ నటుడు కార్తీ నటించిన తాజా చిత్రం 'సత్యమ్ సుందరమ్'. '96' ఫేమ్ సి.ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను సూర్య, జ్యోతిక నిర్మించారు. అరవింద స్వామి కీలక పాత్ర పోషించారు. ఈ నెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా హీరో కార్తీ మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమా స్క్రిప్ట్‌ను చదవగానే నా కళ్ల వెంట ఆనందభాష్పాలు వచ్చాయి. అద్భుతమైన మానవ విలువలు ఉన్న కథ ఇది. ఈ కథను మొదట దర్శకుడు నవలగా తీసుకువద్దామని రాసుకున్నారు. అదృష్టవశాత్తు ఇది సినిమాగా తెరకెక్కింది. ఇందులో నాది అమాయకత్వం.. చలాకీతనం కలగలసిన క్యారెక్టర్. సున్నితమైన భావోద్వేగాలతో నిండిన ఫీల్ గుడ్ చిత్రమిది. నా పాత్ర, అరవింద స్వామి పాత్ర గుర్తుండిపోతాయి. '96' చిత్రంలాగే.. ఈ సినిమా కథ కూడా ఒక్క రాత్రిలోనే జరుగుతుంది. గ్రామీణ జీవితాన్ని.. మన సంప్రదాయాల్ని.. మూలాల్ని తిరిగి గుర్తుచేసేలా ఉండే ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. గోవింద్ వసంత్ అందించిన మ్యూజిక్ చాలా వినసొంపుగా ఉంటుంది. ప్రతీ పాట అర్థవంతంగా ఉండి హృదయాల్ని కదిలిస్తుంది. ప్రేక్షకులకు రియల్ ఎమోషన్స్‌ను పరిచయం చేసే ఇలాంటి చిత్రాలు రావడం చాలా అరుదు. ఈ సినిమాను చూసిన అన్నయ్య సూర్య చేసుకుని హగ్ చేసుకుని ప్రశంసించారు. నా మొదటి సినిమా తర్వాత ఇన్నేళ్లకు అన్నయ్య అంతలా ఎక్సైట్ అయిన చిత్రమిదే" అని చెప్పారు.




**ఇన్ ప్రోగ్రెస్**

## సంక్రాంతి బరిలో మరో సినిమా



వచ్చే సంక్రాంతికి విడుదలయ్యే సినిమాల జాబితాలో మరో పేరు చేరింది. సందీప్‌కిషన్ హీరోగా నటిస్తున్న 30వ సినిమా అది. ఈ చిత్రానికి 'మజాకా' అనే పేరు నిర్ణయించారు. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్, రిలీజ్ టైమ్ ఒకేసారి విడుదల చేసి ప్రమోషన్స్ ప్రారంభించారు నిర్మాత.

## నీ జతగా



ప్రముఖ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు సుదర్శన్ హీరోగా నటిస్తున్న 'మిస్టర్ సెలెబ్రిటీ' చిత్రంలోని మెలోడీ సాంగ్‌ను హీరో గోపీచంద్ విడుదల చేసి కొత్త హీరోకు, యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'నీ జతగా' అంటూ సాగే ఈ పాటను గణేశా రచించగా, జావెద్ అలీ పాడారు. వినోద్ యాజమాన్య సంగీత దర్శకుడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. చందిన రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్.పాండురంగారావు ఈ సినిమాను నిర్మించారు.

## కుతంత్రమే ఆమె మంత్రం



విష్ణు మంచు హీరోగా డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రం నుంచి నటి ఐశ్వర్య పోషిస్తున్న మారెమ్మ పాత్రకు సంబంధించిన లుక్‌ను సోమవారం విడుదల చేశారు. అందరినీ భయపెట్టే విధంగా ఈ లుక్ ఉంది. 'అడవిని పీడించే అరాచకం.. మారెమ్మ, కుతంత్రమే ఆమె మంత్రం' అంటూ రిలీజ్ చేసిన పోస్టర్ అందరినీ ఆకట్టుకునే విధంగా ఉంది. డిసెంబర్‌లో విడుదలయ్యే ఈ పాన్ ఇండియా మూవీకి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకుడు.

## ఏఐ మ్యూజిక్‌తో 'ఐ వాంట్ లవ్'



డైరెక్టర్ ఆర్జీవీ బ్యానర్‌పై గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'శారీ'. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని రవి వర్మ నిర్మిస్తున్నారు. సత్య యాదు, ఆరాధ్య దేవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలోని మొదటి గీతం 'ఐ వాంట్ లవ్'ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "ఈ సినిమాలోని మొత్తం పాటలను ఏ.ఐను ఉపయోగించే కంపోజ్ చేశాము. నేపథ్య సంగీతానికి కూడా ఏ.ఐతోనే ముందుకు వెళ్లాం. ఇకపై 'ఆర్జీవీ మ్యూజిక్ డెన్' నుంచి వచ్చే ప్రతీ పాటలో ఏ.ఐ యాప్స్‌తో తయారు చేసిన సంగీతం మాత్రమే ఉంటుంది" అని చెప్పారు.

**దిక్సూచి DIKSUCHI**

## ఐఐటీ తిరుపతిలో ఎంఎస్(రీసెర్చ్), పీహెచ్‌డీ



తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ తిరుపతి)- ఎంఎస్(రీసెర్చ్), పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రెగ్యులర్(ఫుల్ టైమ్ స్కాలర్స్), ఎక్స్‌టర్నల్, పార్ట్ టైమ్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. రెగ్యులర్ విధానంలో ఎంపికైన అభ్యర్థులకు వివిధ స్కీమ్‌ల ద్వారా అసిస్టెంట్‌షిప్ లభిస్తుంది. ఎక్స్‌టర్నల్, పార్ట్ టైమ్ విధానాల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఉద్యోగులై ఉండాలి. కనీసం రెండేళ్ల అనుభవం; రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు/జాతీయ స్థాయి ల్యాబొరేటరీల నుంచి స్పాన్సర్‌షిప్ తప్పనిసరి.

**ఎంఎస్(రీసెర్చ్)**

**విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్

**అర్హత:** ఇంజనీరింగ్/టెక్నాలజీ బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ(ఎమ్మెస్సీ/ఎంసీఏ)తో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఐఐటీల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ పూర్తి చేసినవారు కూడా అర్హులే.

**పీహెచ్‌డీ**

**విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

**అర్హత:** ఇంజనీరింగ్ విభాగాలకు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ లేదా ఇంజనీరింగ్‌లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ లేదా డ్యూయెల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 8 సీజీపీఏతో ఐఐటీ నుంచి(జామ్ ద్వారా ప్రవేశం పొంది ఉండాలి) రెండేళ్ల ఎమ్మెస్సీ; సీఎఫ్‌టీఐ సంస్థ నుంచి బీఎస్+ఎంఎస్(ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్) ఉత్తీర్ణులైన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సైన్సెస్ విభాగాలకు సెంట్రల్ ఫండెడ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఎస్/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగాలకు సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ/డ్యూయెల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. యూజీసీ నెట్ లేదా జేఆర్ఎఫ్/గేట్ స్కోర్ ఉండాలి.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.400; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** నవంబరు 5 నుంచి 18 వరకు
- **క్యాంపస్ రిపోర్టింగ్:** డిసెంబరు 2
- **వెబ్‌సైట్:** https://iittp.ac.in

నేటి వెబ్ పేజీలో..
వరదలు - ఒక హెచ్చరిక తరువాయి భాగం



# ఈ మెరికలు.. ఆనంద్ 'పిల్లలు'



ఈసారి చెస్ ఒలింపియాడ్‌లో ఒకేసారి రెండు జట్లు బంగారు పతకాలతో సత్తా చాటడం దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ చలవే. రెండేళ్ల కిందట చెన్నై ఆతిథ్యమిచ్చిన చెస్ ఒలింపియాడ్‌లో మన పురుషులు, మహిళల జట్లు కాంస్య పతకాలు అందుకొన్నాయి. దాంతో తదుపరి చెస్ ఒలింపియాడ్‌లో భారత జట్లు స్వర్ణం కొల్లగొట్టేస్తాయని విషి అప్పుడే అంచనా కొచ్చేశాడు. గుకేష్, ప్రజ్ఞానంద, అర్జున్, వైశాలి..ఈ నలుగురూ నాలుగేళ్ల కిందట చెన్నైలో విషి ప్రారంభించిన వెస్ట్‌బ్రిడ్జ్ ఆనంద్ చెస్ అకాడమీ తయారు చేసిన తురుపు ముక్కలే కావడం విశేషం. 'విషీ సర్ లేకుండా మేం లేం' అని 18 ఏళ్ల గుకేష్, 19 ఏళ్ల ప్రజ్ఞానంద చెప్పడం..వారి కెరీర్‌లో ఆనంద్ పాత్రను విశదం చేస్తుంది. అందుకే కాబోలు..అంతర్జాతీయ చెస్ సమాఖ్య కూడా ఆనంద్‌ను 'భారత చెస్ బూమ్ పితామహుడి'గా అభివర్ణించింది. అమెరికా గ్రాండ్ మాస్టర్ హికరు నకమురు అయితే విషీని ఆకాశానికెత్తేశాడు. భారత్‌లో చెస్‌కు ఏ మాత్రం ఆదరణ లేనిరోజుల్లో ఆట మొదలెట్టిన ఆనంద్ వరల్డ్ చాంపియన్‌గా నిలవడమే గాక, తర్వాతి తరం ఆటగాళ్లలో స్ఫూర్తినింపుతూ చెస్‌ను అగ్రభాగాన నిలిపిన లెజెండ్‌గా అభివర్ణించాడు. మరో చెస్ దిగ్గజం కాస్పరోవ్ కూడా ప్రస్తుత భారత చెస్ ఆటగాళ్లను 'ఆనంద్ పిల్లలు'గా పేర్కొన్నాడు. అవును..ఈ 'గోల్డెన్ జనరేషన్' నిస్సందేహంగా ఆనంద్ పిల్లలే.

'టొరంటోలో భారత భూకంపం.. మారుతున్న చెస్ ప్రపంచ గతికి పరాకాష్ట' అని గత ఏప్రిల్‌లో క్యాండెట్స్ టోర్నీలో టీనేజర్ గుకేష్ విజేతగా నిలవడంతో దిగ్గజం గ్యారీ కాస్పరోవ్ చేసిన కామెంట్ ఇది. విశ్వనాథన్ ఆనంద్ కుర్రాళ్లు 64 గళ్ల ఆటలో 'వేటాడడానికి' సిద్ధంగా ఉన్నారంటూ గ్యారీ అప్పుడే డేంజర్ సిగ్నల్స్ పంపాడు. నెలలు గడవక ముందే అతడి మాటలు నిజమయ్యాయి. చెస్ ఒలింపియాడ్‌లో అండర్ డాగ్‌గా బరిలోకి దిగిన భారత పురుషులు, మహిళల జట్లు.. స్వర్ణాలతో పెను ప్రకంపనలు సృష్టించాయి. 2014లో పురుషుల జట్టు తొలి పతకం కాంస్యం సాధించింది. అప్పుడు విషి అందుబాటులో లేకపోయినా.. మనోళ్లు టాప్-3లో నిలిచి ఔరా అనిపించారు. సుదీర్ఘ విరామం తర్వాత 2022లో చెన్నైలో జరిగిన టోర్నీలో ఇరు జట్లు కంచు మోత మోగించాయి. ఇక, రెండేళ్లు తిరిగేసరికి యువ కెరటాలు సంచలన విజయాలతో నిశ్శబ్ద విప్లవమే సృష్టించారు. చదరంగానికి పుట్టినిల్లుగా చెప్పుకోవడమేగానీ.. ఆ ఆనవాళ్లు లేని దేశంలో నేటి తరం ఆటగాళ్లు అద్భుత ప్రదర్శనతో సువర్ణాధ్యాయాన్ని లిఖించారు.



# భావి భారతం బంగారు మయం

చెస్ ఒలింపియాడ్‌లో తొలి రౌండ్ నుంచే భారత్ దూసుకెళ్లిన తీరు అద్భుతం. వరల్డ్ టాప్-5లో ఉన్న అర్జున్, ఏడో ర్యాంకర్ గుకేష్ ఇలా 18-21 ఏళ్ల మధ్యనున్న బలమైన జట్టుతో బరిలోకి దిగి.. అపూర్వ ఫలితాలను సొంతం చేసుకొంది. వరుసగా 8 మ్యాచ్‌లు గెలిచిన యువ జట్టు ఒక్కసారిగా టైటిల్ ఫేవరెట్‌గా మారింది. 9వ రౌండ్‌లో ఉజ్బెకిస్థాన్‌తో డ్రా చేసుకొన్నా.. తర్వాత రెండు రౌండ్లలో జయభేరి మోగించారు.

**అర్జున్ అదరహో..:** ఇంతటి చారిత్రక విజయంలో తెలుగు ఆటగాడు అర్జున్ ఇరిగేసి, గుకేష్ ట్రంప్ కార్డులుగా నిలిచారు. ఓపెన్ కేటగిరీలో 11 రౌండ్లలో 9 మ్యాచ్‌లు గెలిచిన అర్జున్ 10 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆఖరిరౌండ్‌లో సుబెల్జీ (స్లొవేనియా)పై గెలుపుతో అర్జున్ దేశానికి గోల్డ్‌ను ఖరారు చేశాడు. 10వ రౌండ్‌లో బలమైన డొమింగెజ్ (అమెరికా)పై ఇరిగేసి నెగ్గడం టర్నింగ్ పాయింట్‌గానే చెప్పుకోవాలి. మరోవైపు వరల్డ్ చాంపియన్‌ను సవాల్ చేయనున్న టీనేజర్ గుకేష్ కూడా జట్టు బాధ్యతలను అద్భుతంగా మోశాడు. ఆడిన 11 గేముల్లో 9 పాయింట్లు సాధించాడు. వి యి (చైనా), ఫాబియానా (అమెరికా)పై గుకేష్ నెగ్గడం జట్టు పోటీలో నిలవడానికి దోహదం చేసింది. భారీ అంచనాలున్న ప్రజ్ఞానంద కొంత తడబాటుకు లోనైనా.. సరైన సమయంలో సీనియర్ విదిత్ గుజరాతీ ఫామ్‌లోకి రావడం జట్టుకు కలిసొచ్చింది. 3 రౌండ్లు ఆడి రెండు గెలిచి ఒక గేమ్ డ్రా చేసుకొన్న సీనియర్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ.. తన అనుభవంతో యువతకు చక్కని మార్గదర్శనం చేశాడు.

**ఉత్కంఠ రేపినా.. వదల్లేదు:** ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన భారత మహిళల జట్టు విజయంలో 18 ఏళ్ల ఉమెన్ గ్రాండ్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ తిరుగులేని అస్త్రంగా పనిచేసింది. మరో యువ జీఎం వైశాలి కూడా విజయంలో కీలకంగా వ్యవహరించింది. ఆడిన 11 రౌండ్లలో 9 మ్యాచ్‌లు గెలిచిన మన మహిళల జట్టు.. అమెరికాతో డ్రా చేసుకొంది. ఒక్క పోలెండ్ చేతిలోనే ఓడింది. తెలుగు జీఎం హారిక ద్రోణవల్లి, సీనియర్ తానియా సచ్‌దేవ్ తోపాటు వంతిక అగర్వాల్ రొటేషన్‌లో కొన్ని గేమ్‌లు ఆడినా.. దివ్య, వైశాలి ఎక్కువ బాధ్యతలు తీసుకొన్నారు. దేశ్‌ముఖ్ 8 గేమ్‌లు గెలిచి.. 3 డ్రా చేసుకొంది. టోర్నీ ఆసాంతం అమోఘ ప్రదర్శన చేసిన దివ్య టీమ్ స్వర్ణం సాధించడంలో ముఖ్య భూమిక పోషించింది. 18 ఏళ్ల వంతిక కూడా ఆడిన 9 గేమ్‌లో ఒక్కటి కూడా ఓడకపోవడం విశేషం. 10 గేమ్‌లు ఆడిన వైశాలి 6 పాయింట్లు సాధించగా.. తానియా కొన్నిరౌండ్లే ఆడినా.. ఓటమి లేకుండా ముగించింది. 9 రౌండ్లలో 3 గెలిచి 3 డ్రా చేసుకొన్న హారిక.. 3 గేముల్లో ఓడింది. కానీ, 11వ రౌండ్‌లో గునాని (అజర్‌బైజాన్)పై సంచలన విజయంతో జట్టులో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. మొత్తంగా చెస్‌లో యువ ప్లేయర్లతో కూడిన భావిభారతం.. ఇక బంగారుమయంగా మారనుందన్న భరోసా కలిగిస్తోంది.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

### రోహిత్‌ను అనుకరిస్తూ..

భారత జట్టు చారిత్ర స్వర్ణాలు సాధించిన సందర్భాన్ని సరికొత్త రీతిలో సెలబ్రేట్ చేసుకొన్నాయి. పోడియంపై త్రివర్ణాన్ని పట్టుకొని కొందరు భారత ప్లేయర్లు కేరింతలు కొడుతుండగా.. తానియా, గుకేష్ టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను తలపించేలా విక్టరీ డ్యాన్స్ చేసుకొంటూ ట్రోఫీలతో జట్టు సభ్యుల వద్దకు వచ్చారు. 2022లో ఫిఫా వరల్డ్‌కప్ అందుకొంటున్న సమయంలో అర్జెంటీనా కెప్టెన్ మెస్సీ స్లో వాక్ చేసుకొంటూ వచ్చి కప్‌ను అందుకొన్నాడు. అతడిని అనుకరిస్తూ ఈ ఏడాది టీ20 వరల్డ్‌కప్ ట్రోఫీని తీసుకొనే సమయంలో రోహిత్ రేబో వాక్ చేసి ట్రెండ్ సృష్టించాడు. చెస్ ప్లేయర్లు కూడా చారిత్రక సందర్భాన్ని తమదైన రీతిలో చిరస్మరణీయం చేసుకొన్నారు.

## ప్రభాత 'జయ' సూర్య

### ఐదు వికెట్లతో చెలరేగిన స్పిన్నర్

### తొలి టెస్ట్‌లో శ్రీలంక గెలుపు



**గాలె:** తన ఫేవరెట్ గాలె పిచ్‌పై స్పిన్నర్ ప్రభాత జయసూర్య చెలరేగాడు. ఐదు వికెట్లతో (5/68) తిప్పేసిన వేళ..న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్ట్‌లో ఆతిథ్య శ్రీలంక 63 పరుగులతో గెలిచింది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. 275 పరుగుల లక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 207/8తో చివరిరోజు సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 211 రన్స్‌కు ఆలౌటైంది. మిగిలిన రెండు వికెట్లనూ జయసూర్య తీశాడు. ఎనిమిదోసారి ఐదు వికెట్ల ప్రదర్శన కనబరచిన ప్రభాత..గాలెలో ఈ ఫీట్‌ను ఏడోసారి సాధించడం విశేషం. ఇక..లంక తొలి ఇన్నింగ్స్‌లో 305, న్యూజిలాండ్ 340 రన్స్ చేశాయి. శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 309 రన్స్ చేసింది.

## భారత కుర్రాళ్లదే సిరీస్

**రెండో వన్డేలో ఓడిన ఆసీస్ అండర్-19 జట్టు**

**పుదుచ్చేరి:** ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన రెండో వన్డేలో యువ భారత్ తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్ సాహిల్ పరాఖ్ (109 నాటౌట్) అజేయ శతకంతో రాణించాడు. దీంతో రెండు వరుస విజయాలతో భారత్ అండర్-19 జట్టు మరో మ్యాచ్ ఉండగానే 2-0తో సిరీస్ గెలుచుకున్నట్టయ్యింది. ముందుగా ఆసీస్ కుర్రాళ్లు 49.3 ఓవర్లలో 176కు ఆలౌటయ్యారు. ఛేదనలో యువ భారత్ 22 ఓవర్లలో 177/1 పరుగులు చేసి గెలిచింది. అభిగ్యాన్ కుందు (53 నాటౌట్)తో కలిసి రెండో వికెట్‌కు సాహిల్ 153 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పాడు. చివరి మ్యాచ్ గురువారం జరుగుతుంది.

## దక్షిణాఫ్రికాకు ఓదార్పు విజయం

**షార్జా:** సిరీస్‌ను ఇంతకుముందే కోల్పోయిన సౌతాఫ్రికా..అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మూడో వన్డేలో ఓదార్పు విజయం దక్కించుకుంది. ఆదివారం రాత్రి జరిగిన ఆఖరి మ్యాచ్‌లో తొలుత అఫ్ఘానిస్థాన్ 34 ఓవర్లలో 169 పరుగులకే కుప్పకూలింది. రహ్మనుల్లా (89) హాఫ్ సెంచరీతో మెరిశాడు. ఎంగిడి, పీటర్, పెలుక్వాయో తలా రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం 170 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 33 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు కోల్పోయి చేరుకుంది. మార్‌క్రమ్ (69 నాటౌట్) అజేయ అర్ధ శతకంతో రాణించాడు.

## బ్రాండ్ వాల్యూలో నెంబర్ వన్ కోహ్లీ

**షారుక్, రణ్‌వీర్‌ను దాటేసిన విరాట్**



**న్యూఢిల్లీ:** వరల్డ్ క్రికెట్‌లో విరాట్ కోహ్లీ స్థానం ప్రత్యేకం. అందుకే అతడి బ్రాండ్ విలువ కూడా వందల కోట్లలోనే ఉంటుంది. లెక్కకు మిక్కిలి కంపెనీలు తమ ఉత్పత్తులకు ప్రచారం కల్పించేందుకు అతడితో ఒప్పందాలు కుదుర్చుకుంటాయి. ఈ నేపథ్యంలో 2024లో విరాట్ బ్రాండ్ వాల్యూ రూ.1912 కోట్లకు చేరింది. దీంతో దేశంలోనే అత్యంత విలువైన సెలెబ్రిటీగా నిలిచాడు. ఈ క్రమంలో బాలీవుడ్ స్టార్లు షారుక్‌ఖాన్, రణ్‌వీర్ సింగ్‌లను దాటేశాడు. ఈ వివరాలను క్రాల్ సంస్థ విడుదల చేసిన సెలెబ్రిటీ బ్రాండ్ వాల్యుయేషన్ రిపోర్ట్‌లో పేర్కొంది. గతంతో పోలిస్తే కోహ్లీ బ్రాండ్ వాల్యూ 29 శాతం పెరిగినట్టు తెలిపింది. అలాగే ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక్క పోస్ట్ పెట్టేందుకు ఏకంగా రూ.14 కోట్లు వసూలు చేస్తాడట. అతను ప్రమోట్ చేసే జాబితాలో దాదాపు 20 బ్రాండ్లు ఉండడం విశేషం.

## సింధు కోచ్‌గా అనూప్ శ్రీధర్





**న్యూఢిల్లీ:** స్టార్ షట్లర్ పీవీ సింధు తన తాత్కాలిక కోచ్‌గా మాజీ ఒలింపియన్ అనూప్ శ్రీధర్‌ను నియమించుకుంది. వచ్చేనెల ఎనిమిది నుంచి జరిగే ఆర్కిటిక్ ఓపెన్ టోర్నీకోసం ప్రస్తుతం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో సింధు సాధన చేస్తోంది. త్వరలో హైదరాబాద్ రానున్న శ్రీధర్.. సింధుకు కోచింగ్ ఇవ్వనున్నాడు. ఆర్కిటిక్‌తో పాటు డెన్మార్క్, కొరియా, చైనా ఓపెన్‌లలో సింధుకు శ్రీధర్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు.

## రేసింగ్‌లో భారత్‌కు కాంస్యం



**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** భారత తొలి ఎలక్ట్రిక్ బైక్ రేసింగ్ జట్టు 'ఇండీ రేసింగ్' అరంగేట్రం సీజన్‌లోనే కాంస్య పతకం సాధించి సంచలనం సృష్టించింది. హైదరాబాద్‌కు చెందిన ఇండీ రేసింగ్ టీమ్ స్విట్జర్లాండ్‌లోని క్రాన్స్ మోంటానాలో జరిగిన ఎఫ్ఐఎం-ఈ ప్రపంచకప్‌లో 479 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. నార్వేకు చెందిన టొనెల్ రేసింగ్ జట్టు విజేతగా నిలవగా, జపాన్ హోండా జట్టు రెండోస్థానం దక్కించుకుంది.

# ఫెడ్ జోష్.. తగ్గేదేలే!

**85,000కు చేరువలో సెన్సెక్స్**

**26,000 దిశగా నిఫ్టీ**

ముంబై: ఫెడ్ రేట్లు తగ్గడంతో ఉత్సాహంతో ఉరకలేస్తున్న ఇన్వెస్టర్లు కొనుగోళ్ల విషయంలో ఏ మాత్రం తగ్గేదేలే అంటున్నారు. సోమవారం ట్రేడింగ్‌లో ఎనర్జీ, బ్యాంకింగ్, ఆటో రంగ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరుపడంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు సరికొత్త గరిష్ఠాలకు ఎగబాకాయి. సెన్సెక్స్ 85,000, నిఫ్టీ 26,000 స్థాయికి చేరువయ్యాయి. సెన్సెక్స్ ఒక దశలో 436.22 పాయింట్లు వృద్ధి చెంది 84,980.53 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివరికి 384.30 పాయింట్ల లాభంతో 84,928.61 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. నిఫ్టీ సైతం 165.05 పాయింట్ల వరకు పెరిగి 25,956 సరికొత్త ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసినప్పటికీ, చివర్లో 148.10 పాయింట్ల లాభంతో 25,939.05 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త రికార్డు ముగింపు కూడా. ఫెడ్ రేట్ల తగ్గింపు అంశంతో పాటు ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలు, ఎఫ్ఐఐ పెట్టుబడుల దన్ను కూడా మార్కెట్ ర్యాలీకి దోహపడ్డాయి. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,980.38 పాయింట్లు (2.38 శాతం) ఎగబాకింది. దాంతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్ 3 రోజుల్లో రూ.8.30 లక్షల కోట్ల వృద్ధితో మొత్తం రూ.476.04 లక్షల కోట్లకు (5.70 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

### నవంబరులో ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఐపీఓ

ప్రభుత్వ రంగ విద్యుత్ ఉత్పత్తి దిగ్గజం ఎన్‌టీపీసీ అనుబంధ విభాగమైన ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ రూ.10,000 కోట్ల ఐపీఓ నవంబరు తొలివారంలో ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఐపీఓ ప్రక్రియలో భాగంగా కంపెనీ ముంబైతో పాటు సింగపూర్ తదితర దేశాల్లో రోడ్‌షోలు నిర్వహించాలని కంపెనీ భావిస్తోంది.

- డిజిటల్ చెల్లింపుల సంస్థ మొబీక్విక్‌తో పాటు సోలార్ ప్యానెళ్ల తయారీదారు వారీ ఎనర్జీస్ ఐపీఓ ప్రతిపాదనలకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా వారీ ఎనర్జీస్ రూ.3,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్, వాటాదారులకు చెందిన 32 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది. కాగా, మొబీక్విక్ రూ.700 కోట్ల తాజా ఈక్విటీని జారీ చేయనుంది.
- రియల్ ఎస్టేట్ కంపెనీ కాసాగ్రాండ్ ప్రీమియర్ బిల్డర్ కూడా ఐపీఓకు రాబోతోంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.1,100 కోట్ల సమీకరణకు అనుమతి కోరుతూ సెబీకి కంపెనీ డీఆర్‌హెచ్‌పీ సమర్పించింది.

## ఇంటెల్ కొనుగోలుకు క్వాల్‌కామ్ ఆసక్తి

టెక్నాలజీ ప్రపంచంలో మరో మెగా డీల్ కుదిరే అవకాశం కనిపిస్తోంది. అమెరికాకు చెందిన రెండు అంతర్జాతీయ చిప్ తయారీ దిగ్గజాలు క్వాల్‌కామ్, ఇంటెల్ ఒక్కటయ్యే చాన్స్ ఉంది. ఇంటెల్‌ను కొనుగోలు చేసేందుకు క్వాల్‌కామ్ ఆసక్తిగా ఉన్నట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది. ఇందుకోసం క్వాల్‌కామ్ యాజమాన్యం ఇప్పటికే ఇంటెల్‌ను సంప్రదించిందని వెల్లడించింది. ఈ విషయంపై ఇరువర్గాలు ఇంకా స్పందించాల్సి ఉంది. గత కొన్నాళ్లుగా ఎన్‌విడియా నుంచి పోటీ పెరగడంతో ఇంటెల్ ఆర్థికంగా సవాళ్లు ఎదుర్కొంటోంది. ఈ ఏడాదిలో ఇంటెల్ షేరు 60 శాతం క్షీణించింది. ఈమధ్య కంపెనీ 160 కోట్ల డాలర్ల నష్టాన్ని ప్రకటించింది. ఆర్థిక కష్టాల నేపథ్యంలో వ్యయాలు తగ్గించుకునేందుకు 10,000 మంది ఉద్యోగులను తొలగించే ఆలోచనలో ఉంది.

# ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ యమ డేంజర్



**93 శాతం మదుపరులకు నష్టాలే**

**మూడేళ్లలో రూ.1.8 లక్షల కోట్లు హాంఫట్**

**సగటున రూ.2 లక్షల వరకు నష్టాలు**

**సంస్థాగత ట్రేడర్లకు మాత్రమే లాభాలు**

**సెబీ అధ్యయనం వెల్లడి**

**న్యూఢిల్లీ:** వ్యక్తిగత ట్రేడర్లు జరిపే ఈక్విటీ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్‌పై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరోసారి ప్రమాద ఘంటికలు మోగించింది. ఈ ట్రేడింగ్ వ్యక్తిగత ట్రేడర్లకు ఏ మాత్రం లాభదాయకం కాదని హెచ్చరించింది. దీనికి సంబంధించి గత మూడేళ్ల (2022-24) ఎఫ్ అండ్ ట్రేడింగ్ సరళిపై జరిపిన ఒక అధ్యయన నివేదికను సోమవారం విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం గత మూడేళ్లలో ఈ ట్రేడింగ్‌లో పాల్గొన్న వ్యక్తిగత ట్రేడర్లలో 93 శాతం (కోటి మందికి పైగా) మంది రూ.1.8 లక్షల కోట్లు నష్టపోయారు. ఇక ఈ ట్రేడింగ్‌లో పాల్గొన్న వ్యక్తిగత ట్రేడర్లలో కేవలం 7.2 శాతం మంది మాత్రమే కొద్దిపాటి లాభాలు సంపాదించినట్టు సెబీ అధ్యయన నివేదిక తెలిపింది.

### మూడేళ్లలో రూ.75,000 కోట్ల నష్టం

ట్రేడింగ్ లావాదేవీల ఖర్చులతో కలిపి ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ జరిపిన వ్యక్తిగత ట్రేడర్లు, గత మూడేళ్లలో సగటున రూ.2 లక్షల వరకు నష్టపోయారు. వీరిలో 3.5 శాతం మంది (సుమారు 4 లక్షల మంది) సగటున రూ.28 లక్షల చొప్పున నష్టపోయారు. గత ఆర్థిక సంవత్సరాన్ని (2023-24) మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే.. ఈ ట్రేడింగ్‌లో పాల్గొన్న వ్యక్తిగత ట్రేడర్లలో 91 శాతం మంది (73 లక్షల మంది) సగటున రూ.1.2 లక్షల చొప్పున రూ.75,000 కోట్ల వరకు నష్టపోయినట్టు సెబీ అధ్యయనం తెలిపింది.

### 99.8 శాతం మంది వ్యక్తిగత ట్రేడర్లే

ఈక్విటీ ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ వద్దు బాబూ అని నిపుణులు ఎంతగా హెచ్చరిస్తున్నా వ్యక్తిగత ట్రేడర్లు వినిపించుకోవడం లేదు. పైగా ఏటికేటికి వీరి సంఖ్య పెరిగిపోతోంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో పాల్గొనే వ్యక్తిగత ట్రేడర్ల సంఖ్య 51 లక్షలు ఉంటే, గత ఆర్థిక సంవత్సరానికి (2023-24) ఇది 96 లక్షలకు చేరింది. గత ఏడాది ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ సరళిని పరిశీలించినా ఈ ట్రేడింగ్‌లో పాల్గొన్న ట్రేడర్లలో 99.8 శాతం మంది వ్యక్తిగత ట్రేడర్లని సెబీ నివేదిక పేర్కొంది. లావాదేవీల ఖర్చులు తగ్గడం, అధునాతన ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్స్ అందుబాటులోకి రావడం ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది.

**ఎఫ్‌పీఐలకు లాభాలు**

ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో వ్యక్తిగత ట్రేడర్లు భారీగా నష్టపోతుంటే ప్రొప్రైటరీ ట్రేడర్లు, ఎఫ్‌పీఐలు మాత్రం భారీగానే లాభాలు సంపాదిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో పాల్గొన్న ప్రొప్రైటరీ ట్రేడర్లు రూ.33,000 కోట్లు, ఎఫ్‌పీఐలు రూ.28,000 కోట్ల లాభాలు సంపాదించినట్టు సెబీ నివేదిక పేర్కొంది.

**నివేదిక ఇతర ముఖ్యాంశాలు**

- గత మూడేళ్లలో 31% నుంచి 43 శాతానికి చేరిన 30 సంవత్సరాలలోపు వ్యక్తిగత ఎఫ్ అండ్ ఓ ట్రేడర్లు
- యువ ఎఫ్ అండ్ ఓ ట్రేడర్లలో 93 శాతానికి నష్టాలు
- వ్యక్తిగత ఎఫ్ అండ్ ఓ ట్రేడర్లలో 75% మంది వార్షిక సగటు ఆదాయం రూ.5 లక్షల కంటే తక్కువ
- రూ.5 లక్షల కంటే తక్కువ వార్షికాదాయం ఉన్న వ్యక్తిగత ఎఫ్ అండ్ ఓ ట్రేడర్ల సంఖ్య, గత మూడేళ్లలో 71% నుంచి 76 శాతానికి పెరుగుదల
- వ్యక్తిగత ట్రేడర్లలో మహిళల శాతం గత మూడేళ్లలో 14.9%నుంచి 13.7 శాతానికి తగ్గుదల
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో 91.9% మంది పురుష ట్రేడర్లు నష్టపోతే, మహిళల్లో ఈ శాతం 86.3% మాత్రమే
- ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ కోసం వ్యక్తిగత ట్రేడర్లు గత మూడేళ్లలో చేసిన లావాదేవీల ఖర్చులు రూ.50,000 కోట్లు
- ఈ రూ.50,000 కోట్లలో 51% బ్రోకరేజీ ఫీజులు, మరో 21%ఎక్స్ఛేంజ్ ఫీజుల కోసం ఖర్చు

## 2047 నాటికి రియల్టీ మార్కెట్ @ రూ.840 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: దేశంలో రియల్ ఎస్టేట్ మార్కెట్ మంచి జోరు మీదుంది. ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థ నమోదు చేస్తున్న వృద్ధి రేటును, పట్టణీకరణ జోరును పరిగణనలోకి తీసుకుంటే 2047 నాటికి ఈ మార్కెట్ ఎన్నో రెట్లు పెరిగి జీడీపీలో 14-20 శాతం వాటా అందించవచ్చని క్రెడాయ్, కోలియెర్స్ ఇండియా ఉమ్మడిగా విడుదల చేసిన నివేదికలో అంచనా వేశాయి. క్రెడాయ్-నాట్‌కాన్ సదస్సులో "భారత రియల్ ఎస్టేట్: అద్భుత వృద్ధి" పేరిట రూపొందించిన ఈ నివేదికను విడుదల చేశారు. 2022 నాటికి జీడీపీలో 6-8 శాతం వాటాతో 20 వేల కోట్ల డాలర్లున్న రియల్టీ మార్కెట్ 2030 నాటికి లక్ష కోట్ల డాలర్లను తాకవచ్చని పేర్కొన్నాయి. 2047 నాటికి వాస్తవిక దృక్పథంలో అయితే 5 లక్షల నుంచి 7 లక్షల కోట్ల డాలర్లకు చేరవచ్చునని, ఆశావహమైన వాతావరణంలో 10 లక్షల కోట్ల డాలర్లను (రూ.840 లక్షల కోట్లు) తాకినా ఆశ్చర్యపోనక్కర లేదని తెలిపాయి. అంతే కాదు..మార్కెట్లో వాతావరణం అత్యంత నిరాశావహంగా ఉన్న స్థితిలో అయినా మార్కెట్ పరిమాణం 3 లక్షల కోట్ల నుంచి 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనా వేశాయి. ప్రధానంగా పట్టణీకరణలో వేగం, మౌలిక వసతుల అభివృద్ధి, డిజిటలైజేషన్, జనాభాలో మార్పులు, సుస్థిరత, రియల్టీలోని విభిన్న విభాగాల్లో పెట్టుబడులు మార్కెట్‌ను పరుగులు తీయించే అంశాలని తెలిపాయి. రియల్టీ మార్కెట్ అన్ని విభాగాల్లోనూ వ్యవస్థీకృతం అవుతుందని, కన్సాలిడేషన్ ఏర్పడుతుందని కూడా అంచనా వేశాయి.

## అన్మోల్ అంబానీకి రూ.కోటి జరిమానా

రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ వ్యవహారంలో అనిల్ అంబానీ కుమారుడు అన్మోల్ అంబానీపై సెబీ కొరడా ఝుళిపించింది. సాధారణ కార్పొరేట్ రుణాలను ఆమోదించే విషయంలో వాస్తవాలను తెలుసుకోకుండా వ్యవహరించటంతో అన్మోల్‌పై రూ.కోటి జరిమానాను సెబీ విధించింది. అలాగే చీఫ్ రిస్క్ ఆఫీసర్‌గా ఉన్న కృష్ణన్ గోపాలకృష్ణన్‌కు కూడా రూ.15 లక్షల జరిమానా విధించింది. ఇరువురు 45 రోజుల్లోగా ఈ జరిమానాలను చెల్లించాలని ఆదేశించింది.

- హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఎంటార్ టెక్నాలజీస్.. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లేబొరేటరీ (డీఆర్‌డీఎల్) నుంచి రూ.15.4 కోట్ల ఆర్డర్‌ను అందుకున్నట్లు ప్రకటించింది. ఆర్డర్‌లో భాగంగా రక్షణ రంగం కోసం అభివృద్ధి చేస్తున్న కొత్త తరం ఇంజన్‌కు కంబస్టర్స్ సరఫరా చేయాల్సి ఉంటుందని తెలిపింది.

# బిజినెస్

## 'జీసీసీ'ల టెక్ టాలెంట్ కేంద్రంగా హైదరాబాద్

**టీమ్‌లీజ్ డిజిటల్**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) హబ్‌గా ఉన్న హైదరాబాద్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ)కి కేంద్రంగా ఎదుగుతోంది. దీంతో ఈ కేంద్రాల్లో పని చేసే డిజిటల్ టెక్నాలజీల నిపుణులకు మంచి డిమాండ్ ఏర్పడింది. దేశంలోని జీసీసీలకు అవసరమైన డిజిటల్ నిపుణుల్లో 45 శాతం మంది హైదరాబాద్ నుంచే వస్తున్నట్టు సోమవారం వెలువడిన టీమ్‌లీజ్ డిజిటల్ నివేదిక తెలిపింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో తన సేవలు అందుకున్న క్లయింట్లలో 14 శాతం జీసీసీలు హైదరాబాద్ జీసీసీలని వెల్లడించింది. ఈ కేంద్రాల్లో పనిచేసే క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చెయిన్, రోబోటిక్స్, డేటా అనలిటిక్స్ నిపుణుల్లో 45 శాతం మంది హైదరాబాదీలని పేర్కొంది.

- లండన్‌కు చెందిన కన్స్యూమర్ బ్రాండ్ నథింగ్.. భారత్‌లో సర్వీస్ సెంటర్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించింది. పండగల సీజన్‌ను పురస్కరించుకుని హైదరాబాద్, చెన్నై సహా మరికొన్ని నగరాల్లో మరిన్ని ఎక్స్‌క్లూజివ్ సెంటర్లను ప్రారంభించినట్లు ప్రకటించింది. అలాగే ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్‌లో నథింగ్, సీఎంఎఫ్ ఫోన్స్ సహా ఇతర ఉత్పత్తులపై 50%పైగా డిస్కౌంట్ ఇస్తున్నట్లు వెల్లడించింది.
- స్విస్ వాచీ కంపెనీ రాడో.. భారత మార్కెట్లోకి కెప్టెన్ కుక్ హై టెక్ సిరామిక్ స్కెలిటన్, సెంట్రిక్స్ ఓపెన్ హార్ట్ సూపర్ జూబ్లీ వాచీలను విడుదల చేసింది. ఈ వాచీలకు బ్రాండ్ అంబాసిడర్లుగా హృతిక్ రోషన్, కత్రీనా కైఫ్ వ్యవహరిస్తున్నారు.
- హైదరాబాద్‌కు చెందిన కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ మివి.. సూపర్‌పాడ్స్ ఇమ్మెర్స్ పేరుతో ఇయర్‌బడ్స్‌ను తీసుకువచ్చింది. డాల్బీ ఆడియో, 3డీ సౌండ్‌స్టేజ్, 60 గంటల ప్లేటైమ్ ఈ ఇయర్‌బడ్స్ ప్రత్యేకతలు. దీంతో పాటు ఈ ఇయర్‌బడ్స్ కోసం హియర్ క్లియర్ పేరుతో ప్రత్యేక క్యాంపెయిన్‌ను ప్రారంభించింది.

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 76,150 ▲ | 69,800 ▲ | 98,000 ▲ |
| ముంబై | 74,467 ▲ | 68,212 ▲ | 87,756 ▼ |

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**

| 24వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 525 | విజయవాడ | 555 |
| వరంగల్ | 527 | గోదావరి | 550 |
| చిత్తూరు | 543 | విశాఖపట్నం | 555 |
| | | దజను గుడ్లు రూ. 72 | |

**ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 125 | విజయవాడ | 121 |
| వరంగల్ | 125 | గుంటూరు | 126 |
| కరీంనగర్ | 125 | ఒంగోలు | 126 |
| మహబూబ్‌నగర్ | 125 | చిత్తూరు | 118 |
| కర్నూలు | 125 | నెల్లూరు | 118 |
| విశాఖపట్నం | 107 | అనంతపురం | 118 |
| గోదావరి | 121 | | |

## ‘అమృత్’పై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు

» అవినీతి బయటపడాలంటే సీవీసీ విచారణ కోరాలి:సంజయ్



హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'అమృత్' పథకంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలాడుతున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యం, హైడ్రా కూల్చివేతల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే రెండు పార్టీలు కొత్త నాటకానికి తెరదీశాయని ఆరోపించారు. తెలంగాణలో అమృత్ పథకంలో ఎలాంటి అవినీతి జరగలేదని, కాంట్రాక్టు కట్టబెట్టడంలో పక్షపాతం చూపలేదని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తే గనక.. సెంట్రల్ విజిలెన్స్ కమీషన్ (సీవీసీ)కు లేఖ రాయాలని డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడినట్లు భావించాల్సి వస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాస్తే గనక విచారణ జరిపేందుకు సీవీసీని ఒప్పించేలా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హోదాలో తాను ప్రత్యేక చొరవ చూపుతానని చెప్పారు. దేశంలో పట్టణాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చే సదుద్దేశంతోనే మోదీ ప్రభుత్వం అమృత్ పథకాన్ని ప్రవేశపెట్టిందని.. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు అవినీతికి పాల్పడుతూ ఈ పథకం ప్రయోజనాలు ప్రజలకు అందకుండా చేస్తున్నాయని దుయ్యబట్టారు.

## తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ఏర్పాటు చేయాలి

» ప్రభుత్వానికి గ్రూప్-1 అధికారుల సంఘం విజ్ఞప్తి

కేరళ తరహాలో తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ఏర్పాటు చేయాలని తెలంగాణ గ్రూప్-1 అధికారుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి హనుమంతు నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. కార్పొరేషన్ ఎండీలుగా గ్రూప్-1 అధికారులను నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఐఏఎస్ అధికారుల కొరత ఉన్నందున స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లుగా గ్రూప్-1 అధికారులను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## కాంగ్రెస్‌తో పొత్తుకు బీఆర్ఎస్ యత్నం:ఏలేటి

కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునేందుకు బీఆర్ఎస్ నాయకత్వం ప్రయత్నిస్తోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్యవర్తిత్వంతో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కేటీఆర్, హరీశ్ భేటీ అయ్యారని వెల్లడించారు. కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతున్నదే ఢిల్లీ కాంగ్రెస్ అని స్పష్టం చేశారు. "మీరు, హరీశ్ రావు.. ఢిల్లీకి వెళ్లి కేసీ వేణుగోపాల్‌తో జరిపిన భేటీలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటామని చెప్పింది వాస్తవం కాదా? మీతో పొత్తును వ్యతిరేకిస్తున్న సీఎం రేవంత్ మీ భేటీకి దూరంగా ఉంటే, మంత్రి పొంగులేటి మధ్యవర్తిత్వంతో ఆయన్ను కలిసింది నిజం కాదా?" అని కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో పాటు కాంగ్రెస్ తొమ్మిది నెలల పాలనలో జరిగిన అవినీతిపై చర్చకు సిద్ధమని, దీనికి మంత్రి పొంగులేటి, మాజీ మంత్రి కేటీఆర్ సిద్ధమేనా? అని ప్రశ్నించారు. దీన్ని తాను నిరూపించకకపోతే రాజకీయాల నుంచి తప్పుకొంటానని.. నిరూపిస్తే పొంగులేటి, కేటీఆర్ తప్పుకుంటారా? అని సవాల్ చేశారు.

## కొమ్మూరి నన్ను హతమార్చాలని చూస్తున్నారు

» కాంగ్రెస్ నేత రాములు ఆరోపణ.. కొమ్మూరి ఖండన

జనగామ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తనను హతమార్చాలని చూస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత కంచె రాములు సంచలన ఆరోపణలు చేశారు. తనను చంపేందుకు కొమ్మూరి ప్రణాళికలు రచిస్తున్నారని పేర్కొంటూ డీసీపీకి ఆయన సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులకు పదవులను ఇవ్వకుండా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అమ్ముకుంటున్నారని, ఇదే విషయంపై తనతో పాటు ఇతర సీనియర్ నేతలంతా అధిష్ఠానానికి ఫిర్యాదు చేశామని చెప్పారు. దీంతో తమపై కొమ్మూరి కక్ష పెంచుకున్నారని అన్నారు. సొంత పార్టీకి చెందిన రావుల శ్రీనివాస్‌రెడ్డిని పిలిపించుకొని తన హత్యకు ప్రణాళికలు రచిస్తున్నారని ఆరోపించారు. రూ. 25 లక్షలతో ఇసుక లారీని కొనుగోలు చేసి దానితో తనను ఢీకొట్టి ప్రమాదంగా చిత్రీకరించేలా పథకం పన్నారని అన్నారు. ఈ విషయంపై కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి స్పందిస్తూ, తనపై కొంతమంది డీసీపీకి ఇచ్చిన ఫిర్యాదులో ఎలాంటి వాస్తవం లేదని చెప్పారు. తన రాజకీయ జీవితంలో హత్యా రాజకీయాలను ఎప్పుడూ ప్రోత్సహించలేదని, శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తికి తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

## సర్పంచుల పెండింగ్ బిల్లులను చెల్లించండి

» తెలంగాణ సర్పంచుల జేఏసీ

ఖైరతాబాద్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి నిమిత్తం తాము ఖర్చు పెట్టిన నిధులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ సర్పంచుల జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం సచివాలయం ఎదురుగా ఉన్న తెలంగాణ అమరవీరుల స్మారకం వద్ద మాజీ సర్పంచులు నిరసన వ్యక్తం చేశారు. సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు యాదయ్య గౌడ్ మాట్లాడుతూ... గ్రామాభివృద్ధి కోసం వెచ్చించిన నిధులు ఇవ్వకపోవడం దుర్మార్గమని, సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే జోక్యం చేసుకొని తక్షణమే బిల్లులు విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా... నిరసనకారులు రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు.

## రేవంత్‌ను విమర్శిస్తే హరీశ్ ఇంటిపై వెయ్యి డప్పులతో దాడి: సతీశ్ మాదిగ

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డిని హరీశ్‌రావు మరోమారు విమర్శిస్తే ఆయన ఇంటిపై వెయ్యి డప్పులతో దాడి చేస్తామని టీపీసీసీ నేత సతీష్ మాదిగ హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి గుండెల్లో ప్రజలు ఉన్నారని, హరీశ్‌రావు నిద్రపోయేందుకు చోటు లేదని ఎద్దేవా చేశారు. పార్టీ నేత గజ్జెల కాంతం మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం ఎంత దోచుకుందో తమ దగ్గర ఆధారాలు ఉన్నాయని, దీనిపైన చర్చించేందుకు సిద్ధమా? అని సవాల్ విసిరారు.

## విపక్ష పోస్టు కోసం కేటీఆర్, హరీశ్ పోటీ:బీర్ల

ప్రతిపక్ష నేత పోస్ట్ కోసం కేటీఆర్, హరీశ్‌రావు పోటీ పడుతున్నారని, అందుకే వారు పోటీలు పడి మరీ మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలనను చూసి ఓర్చుకోలేని వారు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారన్నారు. ఏ అర్హతతో గాంధీ ఆసుపత్రిపై బీఆర్ఎస్ పార్టీ.. త్రిసభ్య కమిటీని నియమించిందని ప్రశ్నించారు. గాంధీ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది మనో ధైర్యం దెబ్బతీసేందుకు కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గడీలు, ఫామ్ హౌస్‌లు కట్టుకున్న కేసీఆర్.. ఉస్మానియా ఆస్పత్రికి మాత్రం కొత్త భవనం నిర్మించలేకపోయాడన్నారు. విజయ, మదర్ డెయిరీ నాశనం కావడానికి హరీశ్ రావే కారణమని, రైతుల ఉసురు ఆయనకు తగులుతుందని అన్నారు. గాంధీ ఆసుపత్రికి సంబంధించి తప్పుడు సమాచారాన్ని ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేటీఆర్.. ఆ తప్పును కప్పి పుచ్చుకునేందుకు నిజనిర్ధారణ పేరిట డ్రామాలు ఆడుతున్నారని కాంగ్రెస్ నేత ఇందిరాశోభన్ ధ్వజమెత్తారు.

## రేపట్నుంచే గాంధీభవన్‌కు మంత్రుల రాక

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వారంలో రెండ్రోజులు గాంధీభవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తలకు ఒక్కో మంత్రి అందుబాటులో ఉండే కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతోనే ఈ కార్యక్రమం ప్రారంభమవుతోంది. ఈ వారంలో బుధవారం దామోదర.. శుక్రవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గాంధీభవన్‌లో పార్టీ నేతలు, కార్యకర్తలకు అందుబాటులో ఉండనున్నారు. ఈ నేపథ్యంలోనే వారి వారి సమస్యలను తెలుసుకుని మంత్రులు పరిష్కరిస్తారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. వచ్చే వారం బుధవారం గాంధీ జయంతి సందర్భంగా విరామం ఇచ్చారు. ఆ తర్వాత శుక్ర, బుధవారాల్లో వరుసగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావులు గాంధీభవన్‌లో కార్యకర్తలకు సమయం కేటాయించనున్నారు. వాస్తవానికి ఈ కార్యక్రమం గత శుక్రవారమే ప్రారంభం కావాల్సి ఉండగా.. ఆ రోజు మంత్రివర్గ సమావేశం ఉండడంతో ఈ బుధవారానికి వాయిదా పడింది.

# పోలీసులూ తీరు మార్చుకోండి!

» లేదంటే ఏపీలో అధికారులకు పట్టిన గతే..

» ఖమ్మంలో 9 సీట్లిస్తే.. 3లక్షల ఎకరాలు ఎండబెడతారా?

» రేవంత్ సర్కార్‌కు కూల్చడం తప్ప పూడ్చడం రాదా?: హరీశ్

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను గమనించాలని, ఏడీజీ స్థాయి నుంచి పోలీసు శాఖలోని ఉన్నత అధికారులపై వేటు వేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అధికార పార్టీకి కొమ్ము కాస్తే ఇక్కడి పోలీసులకూ ఏపీ పోలీసులకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర; పువ్వాడ అజయ్, సండ్ర వెంకటవీరయ్యతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. వరద బాధితులను పరామర్శించేందుకు ఖమ్మం వెళ్లిన తమపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడితే.. వారిని వదిలేసి, బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు పెట్టడం సరికాదని చెప్పారు. ఏ పార్టీకీ అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తించాలని సూచించారు. ప్రభుత్వానికి కొమ్ము కాస్తే.. భవిష్యత్తులో ఏపీలో మాదిరిగానే సస్పెన్షన్లు ఎదుర్కోవాల్సి వస్తుందని హరీశ్ హెచ్చరించారు. ఖమ్మం జిల్లాలో ప్రజలు 9 ఎమ్మెల్యే సీట్లిచ్చి, కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే.. వరదల్లో హెలికాప్టర్ ఏర్పాటు చేయకుండా 9 మందిని పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు సాగర్‌లో నీరున్నా.. 3 లక్షల ఎకరాల్లో పంటలను ఎండ బెడతారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను గెలిపించడం ఖమ్మం ప్రజలకు శాపంగా మారిందన్నారు. సీఎం రేవంత్ నిర్లక్ష్యం, ముగ్గురు మంత్రుల సమన్వయ లోపం కారణంగా.. రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. 22 రోజుల నుంచి కాల్వ గండి పూడ్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని దుయ్యబట్టారు. సాగర్ నీళ్లతో పనిలేకుండా సీతారామ ద్వారా ఖమ్మంలోని పలు ప్రాంతాలకు సాగునీరు అందిస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడేం చేస్తున్నారని నిలదీశారు. ఆకాశాన్ని దించుతాం, సూర్యుని వంచుతాం అనే డైలాగులు కొడుతున్న సీఎంకు, ఖమ్మం జిల్లా మంత్రులకు కాల్వ గండి పూడ్చడం చేత కావడం లేదని హరీశ్ ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి సర్కారుకు కూల్చివేతలు తప్ప పూడ్చివేతలు రావా..? అని నిలదీశారు. ప్రభుత్వ వైఫల్యాలు బయట పడతాయన్న ఉద్దేశంతోనే హైడ్రా పేరుతో హైడ్రామా చేస్తూ సీఎం ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సర్కారు నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ పాలేరు, ఖమ్మం, వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లోని రైతులు పార్టీలకతీతంగా ఎన్ఎస్పీ కార్యాలయాలను ముట్టడించి నిరసన తెలుపుతున్నారని చెప్పారు. వరదల వల్ల సాగర్ పరివాహక ప్రాంతాల్లో 60 వేల ఎకరాలు, కాంగ్రెస్ నిర్వాకం వల్ల లక్ష ఎకరాల్లో పంట నష్టపోయినట్లు ప్రాథమిక అంచనాలున్నాయన్నారు. వరదల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున, ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటలు ఎండిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి సీతారామచంద్ర స్వామి మీద ఒట్టేసి చెప్పిన రేవంత్‌రెడ్డి రుణమాఫీ పూర్తిచేయకుండా మాట తప్పారని.. ఆయన్ను క్షమించి, కష్టాల్లో ఉన్న రైతులను కాపాడాలని ఆ రామచంద్రుడ్ని వేడుకుంటున్నానని హరీశ్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 10 నెలల్లో 2 వేల అత్యాచార ఘటనలు జరిగాయని చెప్పారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై ఇప్పటికైనా కాంగ్రెస్ బుకాయింపులు మానుకోవాలన్నారు. కాంగ్రెస్ ద్వంద్వ నీతిని ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని హెచ్చరించారు.

# ఆర్‌ఆర్‌ఆర్‌కు వరల్డ్ బ్యాంకు నిధులు!

ఇతర రోడ్ల అభివృద్ధికి కూడా తీసుకోవాలని సర్కారు యోచన .. ఇప్పటికే హడ్కో నుంచి తీసుకోవాలని ప్రతిపాదనలు



ప్రపంచబ్యాంకు ప్రతినిధుల బృందంతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణానికి ప్రపంచబ్యాంకు నుంచి నిధులను తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఆర్‌ఆర్‌ఆర్‌తో పాటు రాష్ట్రంలోని పలు రహదారుల అభివృద్ధికి కూడా ప్రపంచబ్యాంకు నుంచే నిధులను తీసుకోవాలని నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రహదారుల అభివృద్ధిపైనే ప్రధానంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగానే కేంద్రం నుంచి రాష్ట్రానికి మంజూరయ్యే జాతీయ రహదారులతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో నిర్మించే రోడ్లపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఆయా రోడ్ల నిర్మాణంతో పాటు, ఇటీవల తెలంగాణలో కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న రహదారుల తాత్కాలిక, పూర్తిస్థాయి మరమ్మతులకు పెద్ద ఎత్తున నిధులు అవసరపడుతున్నాయి. నిధుల కోసం నాబార్డు, హడ్కో లాంటి సంస్థలను సంప్రదించాలని సర్కారు భావించినా పలు కారణాల నేపథ్యంలో నిధుల సేకరణకు కొన్ని ఆటంకాలు ఏర్పడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే తాజాగా రహదారుల అభివృద్ధికి ప్రపంచ బ్యాంకు నుంచి నిధులను తీసుకోవాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంపైనే దృష్టి సారించింది. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర, దక్షిణభాగాలు నిర్మాణమైతే వాణిజ్య, వ్యాపార రంగంతో పాటు, ఇతర దేశాల నుంచి పెట్టుబడులు కూడా భారీగా వస్తాయని అంచనా వేస్తోంది. ఉత్తరభాగం మంజూరై ఏళ్లు గడుస్తున్నా వివిధ కారణాలతో పనులు ముందుకు కదలడంలేదు. సంగారెడ్డిలో మొదలై చౌటుప్పల్ వరకు దాదాపు 162 కి.మీ మేర ఉండే ఈ రహదారి నిర్మాణానికి సుమారు రూ.14-15వేల కోట్లు నిధులు అవసరమవనున్నాయి. పరిహారం చెల్లింపునకు రూ.5,200 కోట్ల వరకు నిధులు అవసరపడుతున్నాయి. వీటిలో తన వాటాకింద రూ.2,600 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఈ నిధులను ఒకేసారి బ్యాంకుల ద్వారా రుణంగా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దక్షిణ భాగం రీజినల్ రింగు రోడ్డును కూడా రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా నిర్మించాలనే ఆలోచనలో ఉంది. ఈ భాగం అలైన్‌మెంట్ ఖరారు కోసం ఐఏఎస్‌లతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని నియమించింది. దక్షిణ భాగాన్ని హెచ్ఏఎం (హైబ్రిడ్ యాన్యుటీ మోడ్) విధానంలో నిర్మించే అవకాశాలున్నాయి. హెచ్ఏఎం విధానంలో మొత్తం వ్యయంలో నిర్మాణ సంస్థ 40 శాతం, బ్యాంకుల నుంచి రుణంగా 40 శాతం, ప్రభుత్వం మరో 20శాతం భరించాల్సి ఉంటుంది. హైబ్రిడ్ యాన్యుటీ విధానంలోనైతే రోడ్డు నిర్మాణమయ్యాక వసూలు చేసే టోల్‌లో రాష్ట్రానికి కూడా కొంత వాటా వస్తుంటుంది. ఇందుకు సంబంధించి నిర్మాణానికి ముందు చేసుకున్న ఒప్పందం ప్రకారం టోల్ వసూలు, వాటా ఉంటుంది. పైగా రహదారి నిర్మాణం కోసం ప్రైవేటు సంస్థ వెచ్చించిన నిధులను వారికి ప్రభుత్వం వెంటనే చెల్లించాల్సిన అవసరంలేదు. ఏడాదికి కొంత చొప్పున కిస్తీల రూపంలో చెల్లించేందుకు వెసులుబాటు ఉంటుంది. ఈ విధానంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. దక్షిణభాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాలని నిర్ణయిస్తే భూ పరిహారంతో పాటు నిర్మాణ విధానాన్ని బట్టి కొంత మేర నిధులను ఆయా నిర్మాణ సంస్థలకు అందించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రీజినల్ రింగు రోడ్డు నిర్మాణం మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించాల్సిన నిధులను ప్రపంచ బ్యాంకు నుంచి తీసుకుంటే ఇబ్బందులు ఉండవనే యోచనలో ఉన్నట్లు సమాచారం. కాగా ట్రిపుల్‌ఆర్ దక్షిణభాగం అలైన్‌మెంట్ ఖరారు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ త్వరలోనే సమావేశం కానుంది.

### రాష్ట్రంలో స్మార్ట్, ఇంటెలిజెన్స్ ట్రాఫిక్ రోడ్లు

రాష్ట్రంలో స్మార్ట్ రోడ్ టెక్నాలజీ, ఇంటెలిజెన్స్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ రోడ్లను నిర్మిస్తామని, ఇందుకు ఫ్యూచరిస్టిక్ ఆటోమేటెడ్ కన్‌స్ట్రక్షన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ) వంటి ఆధునాతన విధానాలను అనుసరిస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్న అధునాతన రోడ్డు నిర్మాణ పద్ధతులను అనుసరించి రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను తగ్గిస్తామని అన్నారు. సోమవారం సచివాలయంలో ప్రపంచబ్యాంకు ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రపంచబ్యాంక్ రవాణా రంగ ప్రధాన అధికారిణి రీనూ అనుజా మాట్లాడుతూ.. ప్రపంచ బ్యాంకు సహకారంతో మన దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న రోడ్ల నిర్మాణాలు, వాటి తీరుతెన్నులపై పీపీటీ రూపంలో మంత్రికి వివరించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం అనుసరిస్తున్న విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఏరియాలను.. రుర్బన్‌కు విస్తరించడం, మెగా క్లస్టర్స్ అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాలను నగరాలతో అనుసంధానించడం, విమెన్ స్కిల్లింగ్ హబ్స్ ఏర్పాటు వంటి నూతన విధానాలను రూపొందించడం ద్వారా రాష్ట్ర ప్రగతిని వేగవంతం చేయవచ్చునని, రాష్ట్రంలో ఇన్నోవేటివ్ ఫైనాన్స్ మోడల్ ద్వారా ఆర్థిక సహకారం అందించేందుకు అనువైన ప్రాజెక్టుల గురించి రీనూ అనుజా మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను బేరీజు వేసుకుంటూనే అత్యంత ప్రమాదకరంగా ఉన్న హైవేలపై ట్రామాకేర్ సెంటర్లను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామని ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందానికి తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ట్రామాకేర్ సెంటర్ నిర్మాణంలో ఉందన్నారు తెలంగాణలో రోడ్ల అభివృద్ధికి ప్రపంచబ్యాంకు సహకారంపై ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వారితో అన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడడమే తమ లక్ష్యమని.. ప్రత్యేక ప్రణాళికలతో వస్తే మరోసారి సాధ్యాసాధ్యాలపై సుదీర్ఘ ంగా చర్చించి ఒక నిర్ణయం తీసుకుందామని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు మంత్రి సూచించారు.

## సునీతారెడ్డి ఇంటి వద్ద రచ్చ

» వినాయక నిమజ్జనం సందర్భంగా టపాసులు కాల్చే విషయంలో వివాదం

» కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల ఘర్షణ

» ఓర్వలేకనే మాపై దాడి: ఎమ్మెల్యే సునీత



నర్సాపూర్/శివ్వంపేట, సెప్టెంబరు 23: వినాయక నిమజ్జనం సందర్భంగా టపాసుల కాల్చే విషయంలో చెలరేగిన వివాదం బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటి వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య రాజకీయ రచ్చకు దారి తీసింది. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారంలో భగత్‌సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన యాత్ర చేపట్టారు. యాత్ర ఆదివారం అర్ధరాత్రి ఒంటి సమయంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇంటి వద్దకు చేరుకోగా.. అక్కడ టపాసులు కాల్చారు. దీంతో సునీతారెడ్డి ఇంట్లో ఉన్న కొందరు బయటకు వచ్చి టపాసులు కాల్చవద్దని చెప్పారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. వివాదం ముదిరి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. విషయం తెలిసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి సోమవారం ఉదయం ఇంటికి వచ్చి.. జరిగిన ఘటనపై ఆరా తీశారు. గాయపడిన వారితో పోలీసులకు ఫిర్యాదు చేయించారు. తాను నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, వారితో మమేకమవుతుంటే జీర్ణించుకోలేక ఇక్కడి కాంగ్రెస్ నాయకులు ఇలా దాడులకు పాల్పడుతున్నారని సునీతారెడ్డి పేర్కొన్నారు. తమను భయభ్రాంతులకు గురిచేయడానికే ఈ దాడి చేశారని అన్నారు. విషయం తెలిసిన మాజీ మంత్రి హరీశ్ రావు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతప్రభాకర్, అందోలు మాజీ ఎమ్మెల్యే క్రాంతి.. సునీతారెడ్డి ఇంటికి వచ్చారు. ఘటన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. ఘటనపై వెంటనే విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలమంతా కలిసి డీజీపీ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, ఫ్యాక్షనిస్టుల్లా దాడులకు పాల్పడటం దారుణమన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వరుసగా జరుగుతున్న దాడుల వెనుక కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దల ప్రమేయం ఉందని ఆరోపించారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టు

గాంధీలో మాతాశిశు మరణాల వివరాలు తెలుసుకునేందుకు వెళ్లిన నిజనిర్ధారణ కమిటీ

» ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్దే రాజయ్య అరెస్టు

» ఆస్పత్రి వద్దకు ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, సంజయ్

» ఆస్పత్రిలోకి అనుమతించని పోలీసులు



గాంధీ ఆస్పత్రి వద్ద ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

అడ్డగుట్ట/హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజా ఆరోగ్య పరిస్థితుల అధ్యయనం కోసం బీఆర్ఎస్ పార్టీ నియమించిన నిజనిర్ధారణ కమిటీ వ్యవహారం ఎమ్మెల్యేల అరెస్టులకు దారితీసింది. గాంధీ ఆస్పత్రిలో మాతాశిశు మరణాలు చోటుచేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వాస్తవాలు తెలుసుకునేందుకుగాను కమిటీ సభ్యులు అక్కడికి వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. కమిటీ సభ్యులైన వైద్యశాఖ మాజీ మంత్రి తాటికొండ రాజయ్య, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్.. గాంధీ ఆస్పత్రి వద్దకు బయలుదేరగా, రాజయ్యను పోలీసులు ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్దే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్.. ఆస్పత్రి వద్దకు రాగా వారిని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో వారు ఆస్పత్రి ఎదురుగా రోడ్డుపై నిరసన చేపట్టారు. గాంధీ ఆస్పతిలో ఏం జరుగుతోందో, మరణాలు ఎందుకు సంభవిస్తున్నాయో తెలుసుకునేందుకు తాము వచ్చామని అన్నారు. ఆస్పత్రిలో ఒకేసారి పెద్దసంఖ్యలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను బదిలీ చేశారని, సరైన వసతులు కూడా లేవని తెలిపారు. తాము ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కలిసి ఈ వివరాలు తెలుసుకుంటామని, తమను వెళ్లనివ్వాలంటూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయినా పోలీసులు అనుమతించకపోవడంతో ఆస్పత్రి ఎదుట కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం పోలీసులు వారిని అరెస్టు చేసి, గోషామహల్ స్టేషన్‌కు తరలించారు.

### ఆస్పత్రులను సందర్శిస్తే భయమెందుకు?

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత అధికంగా ఉందని, కాంగ్రెస్ అసమర్థ పాలనవల్ల ప్రజారోగ్య పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ ప్రతినిధులు టి.రాజయ్య, సంజయ్, మెతుకు ఆనంద్ ఆరోపించారు. గాంధీ ఆస్పత్రి వద్ద పోలీసులు అరెస్టు చేసి.. విడుదల చేసిన అనంతరం వారు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తాము ఆస్పత్రుల సందర్శనకు వెళితే కాంగ్రెస్ ప్రభుత్వానికి భయమెందుకని ప్రశ్నించారు. మాతాశిశు మరణాలు పెరిగిపోతుంటే సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు సమీక్షించడం లేదని నిలదీశారు. గాంధీ ఆస్పత్రి వద్దకు వెళ్లిన తమను అరెస్టు చేసి బీఆర్ఎస్ కార్యాలయానికి తీసుకొచ్చి వదిలిపెట్టారని తెలిపారు.

### మరణాల డేటా బయటికెలా వచ్చిందో తెలుసుకుంటున్నాం: డీఎంఈ

గాంధీ ఆస్పత్రిలో మాతాశిశు మరణాలకు సంబంధించిన వివరాలు బయటికి ఎలా వచ్చాయో చెప్పలేకపోతున్నామని డీఎంఈ డాక్టర్ వాణి అన్నారు. గైనిక్ విభాగంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులైన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు, ఈ విషయానికి ఎటువంటి సంబంధం లేదని తెలిసిందన్నారు. అంతకుముందు వీళ్లు ఈ విభాగంలో లేరని తెలిపారు. ఏదేమైనా ఈ డేటా బయటికి ఎలా వచ్చిందో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. గాంధీ ఆస్పత్రిలో ఆమె మీడియాతో మాట్లాడారు. గాంధీ ఆస్పత్రి నుంచి డీఎంహెచ్‌వో విభాగానికి డేటా వెళ్లినట్లు తెలిసిందని, బయటికి వచ్చిన గర్భిణుల పేర్లు మక్కీమక్కీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇక ఎంసీహెచ్ భవనంలో ఐవీఎఫ్ సేవలను త్వరలో ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని డీఎంఈ తెలిపారు. కొత్త యంత్రాలతో నూతనంగా ప్రారంభోత్సవాలు లేకుండానే ఇంతకుముందున్నట్లు ఐవీఎఫ్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఇదిలా ఉండగా.. గాంధీ ఆస్పత్రిలో మాతాశిశు మరణాల వివరాలు బయటికి ఎలా వచ్చాయన్న దానిపై ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఆరా తీస్తున్నారు. ఆస్పత్రిలో కేసీఆర్ కిట్ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు డాటా ఎంట్రీ ఉద్యోగులపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

### నిజం బయటికొస్తుందనే..: కేటీఆర్

ప్రభుత్వాస్పత్రుల్లోని పరిస్థితులు తెలుసుకునేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ సభ్యులను అరెస్టు చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రభుత్వానికి అంత భయం ఎందుకు? అని, అసమర్థత బయట పడుతుందన్న భయమా? అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం ఏమీ దాచడంలేదంటే బీఆర్ఎస్ అధ్యయన కమిటీని దర్యాప్తు చేయనివ్వాలని అన్నారు. కమిటీ నివేదిక ద్వారా ప్రజారోగ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రభుత్వానికి సూచనలు అందుతాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్ మాత్రం అవేవీ జరగొద్దన్న ఈగోతో వ్యవహరిస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. పట్టణ పేదలకు వైద్యం అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం 400కు పైగా బస్తీ దవాఖానాలు స్థాపించిందని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్నవాటిని కూడా సరిగ్గా నడపడం చేతకావడం లేదని 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. నగరవాసులు విషజ్వరాలతో నరకయాతన పడుతుంటే ఆదుకోవాల్సిన బస్తీ దవాఖానాలకే సుస్తీ చేసిందన్నారు. తక్షణమే వాటి నిర్వహణపై దృష్టి పెట్టాలని సూచించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడి విధ్వంసం చేసేందుకు ప్రయత్నించాయని కేటీఆర్ తెలిపారు. ఇలాంటి అరాచకాలకు బీఆర్ఎస్ శ్రేణులు భయపడబోవని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధి నుంచి కార్యకర్త వరకు 60 లక్షల మంది సభ్యులున్న బీఆర్ఎస్.. పెద్ద కుటుంబమని, ఎవరికి ఇబ్బంది కలిగినా సమిష్టిగా అండగా ఉంటుందని తెలిపారు. దాడికి కారణమైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## డీసీసీ కార్యాలయాలకు స్థలాలు!

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలోనూ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయం నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతంలో 2 వేల గజాల విస్తీర్ణం గలిగిన స్థలంలో కార్యాలయాలు నిర్మించాలని టీపీసీసీ నిర్ణయించింది. ప్రధాన పార్టీలకు జిల్లా కార్యాలయాలు కట్టుకునేందుకు స్థలాల కేటాయింపునకు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం గతంలోనే జీవో జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆ జీవో మేరకు ప్రతి జిల్లా కేంద్రంలోనూ బీఆర్ఎస్ కార్యాలయాల నిర్మాణానికి స్థలాల కేటాయింపూ జరిగింది. అయితే ఆదివారం జరిగిన సీఎల్పీ సమావేశంలో అన్ని జిల్లా కేంద్రాల్లో డీసీసీ కార్యాలయాల నిర్మాణానికి స్థలాల కేటాయింపు అంశం ప్రస్తావనకు వచ్చింది. డీసీసీ కార్యాలయాల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించాలని కోరుతూ కలెక్టర్లకు అధికారికంగా దరఖాస్తులు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ నేపథ్యంలోనే డీసీసీ కార్యాలయాల నిర్మాణం కోసం 2 వేల చదరపు గజాల స్థలం కేటాయించాలంటూ కలెక్టర్లకు దరఖాస్తులు సిద్ధం చేయాలని అన్ని జిల్లాల డీసీసీ అధ్యక్షులను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదేశించారు. జిల్లా మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు.. ప్రజలకు అందుబాటులో ఉండే స్థలాలను గుర్తించాలని సూచించారు. స్థలం కోసం కలెక్టర్లకు దరఖాస్తు ఇవ్వడంతో పాటుగా గుర్తించిన స్థలాల వివరాలనూ కలెక్టర్లకు ఇవ్వాలన్నారు. వీలైనంత త్వరగా ఆ స్థలాన్ని కలెక్టర్లు పరిశీలించేందుకు వీలుంటుందని వెల్లడించారు.

# రాజకీయాల కోసం ఆస్పత్రులను వాడుకోవడమా?

- బీఆర్ఎస్ హయాంలో వైద్యరంగం నిర్వీర్యం
- సౌకర్యాలు, అధ్యాపకులు లేకుండానే కాలేజీల ఏర్పాటు
- మేం వచ్చాక వాటిని భర్తీ చేస్తున్నాం
- కేటీఆర్‌పై మంత్రి దామోదర ఫైర్



హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజకీయం కోసం బీఆర్ఎస్ ఆస్పత్రులను వేదికగా వాడుకుంటోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ ఆస్పత్రి మరణాలను ప్రభుత్వ వైద్యుల వైఫల్యంగా చిత్రీకరించడం బీఆర్ఎస్ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వైద్య రంగాన్ని నిర్వీర్యం చేసిందని, తాము వ్యవస్థను గాడిలో పెడుతున్నామని పేర్కొన్నారు. గాంధీ ఆస్పత్రిపై బురదజల్లే ప్రయత్నాలను మానుకోవాలని డాక్టర్లు విజ్ఞప్తి చేసినా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తలకు ఎక్కడం లేదని మండిపడ్డారు. తప్పుడు సమాచారంతో ట్వీట్ చేసి, అడ్డంగా దొరికిపోయిన కేటీఆర్.. తన తప్పును కవర్ చేసుకునేందుకు ఫ్యాక్ట్ ఫైండింగ్ పేరిట డ్రామాలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల పాలనా వైఫల్యాలను పది నెలల ప్రభుత్వానికి ఆపాదిస్తున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయాంలో 2017లో కోటి మెటర్నిటీ ఆస్పత్రిలో మూడు రోజుల్లో ఆరుగురు బాలింతలు.. అదే ఏడాది ఐదు రోజుల వ్యవధిలో నిలోఫర్ దవాఖానాలో ఐదుగురు బాలింతలు మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు. 2022లో కుటుంబ నియంత్రణ కోసం డీపీఎల్ పద్ధతిలో చేసిన ఆపరేషన్‌లతో నలుగురు మహిళలు మరణించారని.. దీంతో ఆ పిల్లలు అనాథలయ్యారన్నారు. 2019 జూన్, జూలైలో డెంగ్యూ మరణాల సంఖ్య వందకు పైగా ఉందని.. బీఆర్ఎస్ నిర్వాకం వల్ల పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మిగిలిందన్నారు. ఆరోగ్యశాఖలో ఖాళీలకు బాధ్యులెవరు? అని మంత్రి ప్రశ్నించారు. మూడేళ్లలో హడావుడిగా 25 మెడికల్ కళాశాల ఏర్పాటుకు జీవోలు ఇచ్చి చేతులు ఎత్తేశారన్నారు. కొత్త కళాశాలలకు 3,368 మంది టీచింగ్ స్టాఫ్ అవసరమైతే, కేవలం 1078 మందిని మాత్రమే భర్తీ చేశారన్నారు. అధ్యాపకులు, సౌకర్యాలు లేకుండానే మొక్కుబడిగా మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ ఎస్ దక్కుతుందని విమర్శించారు.



సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డిని కలిసిన మోర్త్ ఆర్వో కృష్ణప్రసాద్

## మోర్త్ ఆర్వోగా కృష్ణప్రసాద్

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ(మోర్త్) తెలంగాణ రీజినల్(ఆర్వో) అధికారిగా ఏ. కృష్ణప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సోమవారం సచివాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో కొనసాగుతున్న జాతీయ రహదారుల ప్రాజెక్టులు, పెండింగ్‌లో ఉన్న రోడ్ల విషయాలపై ఇరువురు కొద్దిసేపు చర్చించుకున్నారు. కాగా, కృష్ణప్రసాద్ 2017 నుంచి 2023 ఏప్రిల్ వరకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) తెలంగాణ రీజినల్ అధికారిగా సేవలందించారు. ఆ సమయంలో రాష్ట్రానికి కేంద్రం నుంచి జాతీయ ప్రాజెక్టుల మంజూరులో చొరవ చూపించారు. ముఖ్యంగా రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టుకు ఆయన హయాంలోనే ఆమోదం లభించింది. ఖమ్మం- విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే, మంచిర్యాల - విజయవాడ హైవే పర్యావరణ అనుమతుల వ్యవహారాల్లో కృష్ణప్రసాద్ కీలకంగా వ్యవహరించారు. సూర్యాపేట - ఖమ్మం (365బీబీ) నాలుగులేన్ల రోడ్డుతో పాటు మరో రెండు రోడ్లు కలుపుకుని రూ.10,764.69 కోట్ల విలువైన 335.45 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణాలు ఆయన నేతృత్వంలో పూర్తిచేశారు. ఆయన తన హయాంలో మొత్తంగా రాష్ట్రంలో దాదాపు 1,016 కిలోమీటర్ల మేర జాతీయ రోడ్ల నిర్మాణాలకు చొరవ చూపారు.

## ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగింపు !

హైదరాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల గడువును పొడిగిస్తున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. దీంతో ఈనెల 30వ తేదీ వరకు రూ. 500ల ఆలస్య రుసుముతో ప్రవేశాలను కొనసాగించనున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు ఈ నిర్ణయం వర్తించనుంది. మరోవైపు ప్రైవేట్ కళాశాలల్లో మిగిలి పోయిన డిగ్రీ కోర్సుల సీట్లకు సంబంధించి ఈ నెల 25 నుంచి 27వ తేదీల మధ్య దోస్త్ స్పాట్ అడ్మిషన్లను నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. అయితే ఈ కోర్సులు సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరిలోవని అధికారులు ప్రకటించారు.

## ఎవరి పని వాళ్లే చేయాలి..

- రాజకీయ నేతలు ఇంజనీర్ల పనుల్లోకి తలదూర్చకూడదు
- 57వ ఇంజనీర్స్ డే వేడుకల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్లు సరిగ్గా పనిచేయకపోతే నిర్మాణాలు మేడిగడ్డలాగే తయారవుతాయని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఎవరి పని వారు చేసుకోవాలని, రాజకీయ నాయకులు ఇంజనీర్ల పనుల్లోకి తలదూర్చకూడదని ఆయన హితవు పలికారు. సోమవారం గుర్రం కోటిరెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ భవన్‌లో 57వ ఇంజనీర్స్ డే, మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రాజెక్టులను నిర్మించాలి కానీ, రాజకీయ పార్టీలు, నాయకుల కోసం కాదని ఆయన పేర్కొన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాల్లో రాజకీయ నాయకుల ప్రమేయం లేకపోతే చాలా మంచిదని అన్నారు. గత ప్రభుత్వం గోదావరి బేసిన్‌లో నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టులపై పెట్టిన శ్రద్ధలో.. 50 శాతం కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులపైన పెట్టినట్లయితే ఇప్పటికి అవి కూడా పూర్తయ్యేవని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బెస్ట్ కాంట్రాక్టర్ అవార్డును డి.వి.ఎస్ రెడ్డికి, బెస్ట్ ఇంజనీర్ అవార్డును శ్యాంప్రసాద్‌కు ప్రదానం చేశారు.

# 20 రోజులైనా గండ్లు పూడ్చరా?

## సాగర్ కాల్వ మరమ్మతు పనుల్లో జాప్యంపై మంత్రి తుమ్మల ఆగ్రహం



ఖమ్మం జిల్లాలో సాగర్‌కాల్వ గండి పూడ్చివేత పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- వెంటనే పూర్తి చేయాలని ఆదేశం
- నేటి నుంచే ఆయకట్టుకు నీరందించాలని దిశానిర్దేశం

కూసుమంచి, సెప్టెంబరు 23: సాగర్ ఎడమ కాల్వకు పడిన గండ్లను పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన కాల్వ పునరుద్ధరణ పనులు పూర్తిచేసి మంగళవారం నుంచి ఆయకట్టుకు నీరు అందించాలని ఆదేశించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మల్లాయిగూడెం వద్ద సాగర్ కాల్వ పునరుద్ధరణ పనులను సోమవారం ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనుల వివరాలను నీరుపాదలశాఖ చీఫ్ ఇంజనీర్ విద్యాసాగర్‌ను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యంపై ఇరిగేషన్ అధికారులను నిలదీసిన తుమ్మల.. రెండు లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు పూర్తిగా ఎండిపోయిన తరువాత నీళ్లిస్తారా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో జాప్యానికి కారకులైన అధికారులపై తనకు నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు సూచించారు.

### అండర్ టన్నెల్ లేకుండానే మరమ్మతులు

మల్లాయిగూడెం వద్ద సాగర్ ఎడమకాల్వ మరమ్మతుల్లో భాగంగా అండర్ టన్నెల్ (యూటీ) లేకుండానే కాల్వ కరకట్టకు అధికారులు మరమ్మతులు(బండింగ్) చేస్తున్నారు. కూలిపోయిన యూటీని ఆదివారం పూర్తిగా తొలగించిన అధికారులు.. దాని స్థానంలో తాత్కాలికంగా సిమెంట్ పైపులు వేయాలని తొలుత నిర్ణయించారు. కానీ, రెండు లక్షల ఎకరాల్లో నీరందక వరి పొలాలు ఎండిపోతుండడం, పైపుల ఏర్పాటుకు మరో రెండు రోజులు సమయం పట్టే అవకాశం ఉండడంతో తాత్కాలికంగా యూటీ లేకుండానే రెండు వైపులా కరకట్ట పనులు చేస్తున్నారు. బండింగ్ అనంతరం గండిపడిన చోట్ల రెండువైపులా టార్పాలిన్ కవర్లతో కప్పివేయనున్నారు. కట్ట తిరిగి కోతకు గురికాకుండా మట్టి బస్తాలు ఏర్పాటు చేస్తున్నారు. యూటీ నిర్మాణం నిలిపివేసినందున జుజ్జులరావుపేట, పాలేరు, తదితర గ్రామాల నుంచి వచ్చే వరద నీటి జనరేటర్ల ద్వారా కాల్వలోకి ఎత్తిపోయాలని అధికారులు భావిస్తున్నారు. లేదంటే కాల్వ పక్కనే ఛానల్ నిర్మాణం ద్వారా నీటిని తరలించి వేరే చోటకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా అన్ని పంటల్లో చీడ, పీడల బెడద పెరిగిందని, వాటిని నియంత్రించే దిశగా రైతులకు సూచనలు చేయాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంటలను పరిశీలించాలని సూచించారు.

# పట్టా కోసం డిగ్రీ పొట్టకూటి కోసం మినీ డిగ్రీ!

## సరికొత్త కోర్సులను ప్రవేశపెడుతున్న ప్రభుత్వం.. విద్యార్థులకు ఉద్యోగం గ్యారంటీయే లక్ష్యం

- 18 ఇంజనీరింగ్, 20 డిగ్రీ కాలేజీల్లో 10 వేల మందికి నైపుణ్య శిక్షణ
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమల్లోకి
- రేపు ప్రారంభించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): "ప్రస్తుతం డిగ్రీలు పూర్తి చేసుకున్నవారు పట్టాలు మాత్రమే పొందుతున్నారు. పొట్టకూటి కోసం కావాల్సిన ఉద్యోగాలు మాత్రం సాధించలేకపోతున్నారు. పరిశ్రమల అవసరాలకు సరిపడేలా నైపుణ్యాలు పెంచుకుంటే ఉద్యోగాలు సులభంగా సాధించవచ్చు" ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదేపదే చెప్పే మాటలివి. ఈ దిశగా విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త నిర్ణయం తీసుకుంది. డిగ్రీతోపాటు నైపుణ్యాలను పెంచుకునేందుకు ప్రత్యేకంగా మినీ డిగ్రీని కూడా ప్రవేశపెట్టనుంది. ఇందులో భాగంగా బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 ఇంజనీరింగ్ కాలేజీలు, 20 డిగ్రీ కాలేజీల్లో.. 10 వేల మంది విద్యార్థులకు ఈ కోర్సులను అందించనున్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకుని పారిశ్రామికవేత్తల భాగస్వామ్యంతో దీనిని అమలు చేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం (2024-25)నుంచే అందుబాటులోకి రానున్న ఈ కొత్త విద్యావిధానాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నారు. ప్రస్తుతం ఐటీ, అనుబంధ రంగాల్లో నిపుణులకు ప్రపంచ వ్యాప్తంగా భారీ డిమాండ్ ఉంది. గత కొన్నేళ్లుగా హెచ్ఎస్‌బీసీ, జేపీ మోర్గాన్, స్టేట్ స్ట్రీట్, మాస్ మ్యూచువల్, లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీ వంటి బీఎఫ్ఎస్ఐ గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు దేశంలో దాదాపు 5 లక్షల ఉద్యోగాలు సృష్టించాయి. బీఎస్ఎఫ్ఐ రంగంలో పేరొందిన కంపెనీలన్నీ ఇప్పటికే హైదరాబాద్‌ను కీలకమైన వ్యాపార కేంద్రంగా గుర్తించాయి. అందుకే కొత్తగా ఏర్పడే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లతో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు భారీగా ఉంటాయని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే ఈ కోర్సులు భారీ ఖర్చులతో కూడుకున్నవి కావడంతో.. విద్యార్థులపై భారం పడకుండా కంపెనీలను భాగస్వామ్యం చేస్తోంది. కంపెనీల సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా వీటిని చేపట్టనుంది. యువతకు రెగ్యులర్ డిగ్రీతో పాటుగానే నైపుణ్య డిగ్రీ కోర్సును మినీ డిగ్రీ పేరుతో అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం తెలంగాణ ఉన్నత విద్యామండలి ఇటీవలే బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (బీఎఫ్ఎస్ఐ) సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది.



సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కోరమాండల్ ఎండీ, వైస్‌ప్రెసిడెంట్

### మైనర్ డిగ్రీ ప్రోగ్రామ్‌గా అమలు..

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ మినీ డిగ్రీ ప్రోగ్రామ్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి డిజైన్ చేసింది. ఈ విద్యా సంవత్సరంలో 5వేల మంది ఇంజనీరింగ్, మరో 5వేల మంది ఇతర డిగ్రీ విద్యార్థులకు కలిపి.. మొత్తం 10 వేల మంది విద్యార్థులకు ఈ వర్క్ కోర్సు నేర్పిస్తారు. ఇప్పటికే వివిధ సంస్థలతో సంప్రదింపులు జరిపిన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు.. ఈ ప్రోగ్రాం నిర్వహణకు ఇక్విప్ అనే సంస్థను ఖరారు చేశారు. తొలి విడతగా ఈ సంస్థ రూ.2.5 కోట్లను ప్రభుత్వానికి అందించేందుకు సిద్ధపడింది. ప్రతి ఏటా 10 వేల మంది విద్యార్థులకు మూడేళ్లపాటు అవసరమయ్యే రివాల్వింగ్ ఫండ్‌ను ఈ సంస్థ సమీకరిస్తుంది. కాగా, డిగ్రీ కాలేజీల్లో బీఎఫ్ఎస్ఐ కోర్సులో భాగంగా స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు (ఎస్ఈసీ), జనరిక్ ఎలెక్టివ్స్ పాఠ్యాంశాలను పరిచయం చేస్తారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో దీనిని మైనర్ డిగ్రీ ప్రోగ్రామ్‌గా, యాక్సిలరేటెడ్ కోర్సుగా అందిస్తారు. ఈ కోర్సులకు సంబంధించిన సిలబస్, పాఠ్యాంశాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. ఈ పాఠ్య ప్రణాళికను బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఆమోదించింది. డిగ్రీతోపాటు ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు పట్టా, ఇంటర్న్‌షిప్‌తోపాటు ఉద్యోగం లభించేలా ఈ ప్రోగ్రామ్‌ను రూపొందించారు.

# సంక్షేమ పథకాలన్నీ డిజిటల్ కార్డుతోనే!

## అమలవుతున్న రాష్ట్రాల్లో అధ్యయనం

- ఫ్యామిలీ డిజిటల్ కార్డులో కుటుంబంలోని.. ప్రతి సభ్యుడి హెల్త్ ప్రొఫైల్: రేవంత్

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ ఫ్యామిలి డిజిటల్ కార్డు ఇవ్వాలని యోచిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. దీని ద్వారానే రేషన్, ఆరోగ్య, ఇతర సంక్షేమ పథకాలన్నింటినీ అందించాలని భావిస్తోంది. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం తన నివాసంలో వైద్యారోగ్య, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కుటుంబాల సమగ్ర వివరాల నమోదుతో ఇప్పటికే రాజస్థాన్, హరియాణా, కర్ణాటక రాష్ట్రాలు డిజిటల్ కార్డులు ఇచ్చినందున వాటిపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. వాటితో కలుగుతున్న ప్రయోజనాలు, ఇబ్బందులను తెలుసుకొని సమగ్ర నివేదిక రూపొందించాలని అన్నారు. అనంతరం రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గం పరిధిలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంపిక చేసుకొని పైలట్ ప్రాజెక్టు కింద ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కార్యాచరణ ప్రారంభించాలని సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు ఉండాలని, ఈ కార్డులతో లబ్ధిదారులు రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్, ఆరోగ్య సేవలు పొందేలా ఉండాలని అన్నారు. ఈ డిజిటల్ కార్డులో ప్రతి కుటుంబ సభ్యుడి హెల్త్ ప్రొఫైల్ ఉండాలని, అది దీర్ఘకాలంలో వైద్య సేవలకు ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆయా కుటుంబ సభ్యులు తమ కుటుంబాల్లో సభ్యుల కలయిక, తొలగింపునకు సంబంధించి ఎప్పటికప్పుడు కార్డును అప్‌డేట్ చేసుకునేలా ఉండాలని పేర్కొన్నారు. వీటి పర్యవేక్షణకు జిల్లాలవారీగా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, సీఎస్ శాంతికుమారి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘాటెక్కిన ఉల్లి!

(మొదటిపేజీ తరువాయి)



అధికారులు వివరించారు. పది రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేశాక.. ధరలు క్రమంగా పెరుగుతూ వస్తున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, దేశంలో ఉల్లి ధరల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం 4.7 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే ఓ ప్రకటనను విడుదల చేశారు. ఉల్లి ఎగుమతులపై ఆంక్షలు తొలగించడంతో ధరలు అంతకంతకూ పెరుగుతున్నాయని, దాంతో బఫర్‌స్టాక్‌ను విడుదల చేశామని ఆమె తెలిపారు. ఖరీఫ్ సాగు ఉత్పత్తులతో ఉల్లి ధరలు అదుపులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో ఉల్లి ధర కిలోకు రూ.55గా ఉండగా.. మొబైల్ కేంద్రాల ద్వారా రూ.35కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. అయితే.. కేంద్రం విడుదల చేసిన బఫర్ స్టాక్‌లో.. తెలంగాణకు ఎంతమేర సరుకు వస్తుందనేదానిపై స్పష్టత లేదని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

### రూ.60 రైతు బజార్లలోనే..

కిలో ఉల్లి రూ.60 ధర పలుకున్నది కేవలం రైతుబజార్లలోనే..! హైదరాబాద్‌లోని సింహభాగం రైతుబజార్లలో.. సిద్దిపేటలో ఉల్లి ధర రూ.60గా ఉంది. ఎర్రగడ్డ రైతుబజార్‌తోపాటు.. కరీంనగర్ మార్కెట్‌లో రూ.55 పలుకుతోంది. మిగతా చోట్ల.. ఈ ధరలు కొంత ఎక్కువగా ఉన్నాయి. నల్లగొండలో రూ.65, వరంగల్‌లో రూ.68, మెదక్ జిల్లా రామకృష్ణాపురం, భద్రాద్రి-కొత్తగూడెం, పాల్వంచల్లో రూ.70, ఇల్లెందులో రూ.74, ఆదిలాబాద్ మార్కెట్‌లో రూ.80గా సోమవారం ఉల్లి ధరలు నమోదయ్యాయి. కాగా, పేదలు ఇంట్లో వంటకానికి ఏమీ లేకున్నా.. జొన్నరొట్టె-ఉల్లిగడ్డ.. అన్నం-పచ్చిపులుసుతో సరిపెట్టుకునేవారు. ఇప్పుడు ఉల్లి ధరల కారణంగా.. ఆ పరిస్థితులు కూడా లేవని వాపోతున్నారు.

# బాధ్యులు ఇంజనీర్లు

(మొదటిపేజీ తరువాయి)

భాగంగానే, తాము అడిగిన డాక్యుమెంట్లు ఇవ్వకుండా సహాయ నిరాకరణ చేశారని, విచారణలోనూ సహకరించలేదని గుర్తు చేస్తోంది. నిజానికి, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు దాదాపు 33 మంది ఇంజనీర్లను బాధ్యులను చేస్తూ నీటిపారుదల శాఖ ఓ జాబితా సిద్ధం చేసింది. బ్యారేజీ వైఫల్యానికి ఇంజనీర్లు కారణమంటూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కూడా ఇప్పటికే మధ్యంతర నివేదికను సమర్పించింది. పూర్తిస్థాయి నివేదిక అందించడానికి మరి కొంత గడువు కావాలని కోరగా.. పత్రాలన్నీ ఇస్తే వైఫల్యానికి కారణాలను తామే తే ల్చుకుంటామని కమిషన్ స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో, ఈ నెలాఖరుకల్లా నివేదిక అందించడానికి విజిలెన్స్ అంగీకారం తెలిపింది. మరోవైపు, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను తమకు అందించాలని నీటిపారుదల శాఖను మరోమారు కమిషన్ ఆదేశించింది. బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్లేస్‌మెంట్ రిజిస్టర్, ఎం-బుక్ (మెజర్‌మెంట్ బుక్)లు కూడా ఇవ్వాలని తేల్చి చెప్పింది. రెండు రోజులుగా జరిగిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో వీటి ప్రస్తావన ఎక్కువగా రావడంతో.. నిజానిజాల నిర్ధారణకు వీటిని తెప్పించుకోవడమే మేలని కమిషన్ నిర్ణయించింది.

### విచారణకు కాగ్ అధికారులు

కాళేశ్వరం ప్రాజెక్టుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) ఇప్పటికే విచారణ నివేదిక ఇచ్చింది. ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకాన్ని చేపట్టకుండా.. రీ ఇంజనీరింగ్ చేసి, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఆర్థిక అవకతవకలు, తప్పుడు నిర్ణయాలను కడిగి పారేసింది. ఈ నేపథ్యంలోనే, కాగ్‌కు చెందిన అధికారిని పిలిపించి, సమాచారం సేకరించాలని కమిషన్ నిర్ణయించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇప్పటికే పలువురు ఇంజనీర్లను క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం నుంచి శనివారం వరకూ దాదాపు మరో 40 మంది ఇంజనీర్లను క్రాస్ ఎగ్జామినేషన్ చేయాలని కమిషన్ నిర్ణయించింది. ఈ జాబితాలో మాజీ ఈఎన్‌సీతోపాటు పలువురు అధికారులు ఉండనున్నారు. అనంతరం ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లు; ఆ తర్వాత కీలక ప్రజా ప్రతినిధులకు సమన్లు పంపించనుంది.



### లాయర్ లేకుండానే క్రాస్ ఎగ్జామినేషన్

ఇకనుంచి న్యాయవాది లేకుండా స్వయంగా క్రాస్ ఎగ్జామినేషన్ చేయాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నిర్ణయించింది. వాస్తవానికి శుక్ర, శనివారాల్లో మొత్తం 18 మందిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. కమిషన్ లాయర్‌ను సమకూర్చుకుంటే ప్రతివాదులు కూడా లాయర్లను తెచ్చుకుంటున్నారని, దాంతో, రోజుకు ఒక్కరిని కూడా క్రాస్ ఎగ్జామినేషన్ చేయలేకపోతున్నామని కమిషన్ భావిస్తోంది. లాయర్లను అనుమతించడమంటే... విచారణ ప్రక్రియను మరింత జఠిలం, వాయిదా వేయడమే అవుతుందనే అభిప్రాయంతో కమిషన్ ఉంది.

# ఎన్ని గంటలకు... ఎక్కడికి రావాలి

## చెప్తే అక్కడికి వస్తా.. అవినీతిని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం.. బావ, బావమరుదులకు అంతర్గత విభేదాలున్నాయ్

- ఎవరినెవరు వెన్నుపోటు పొడుచుకునేది తెలియదు
- కేటీఆర్, హరీశ్‌లపై మండిపడ్డ మంత్రి పొంగులేటి



సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి, ఇల్లెందు, సెప్టెంబరు 23: అమృత్ పథకంలో రూ.8,888 కోట్ల అవినీతి జరిగిందని బావా, బామ్మర్దులు గొంతుచించుకుంటున్నారని, తాను అవినీతికి పాల్పడ్డానని నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి కేటీఆర్, హరీశ్‌లకు సవాల్ విసిరారు. లేకుంటే, వారు ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. ఎన్ని గంటలకు ఎక్కడకు రావాలో చెబితే అక్కడకు వస్తానని సవాల్ విసిరారు. సోమవారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సభలో పొంగులేటి పాల్గొని ప్రసంగించారు. అమృత్ స్కీంలో బీఆర్ఎస్ నాయకుడు కందాళ అల్లుడు సృజన్‌రెడ్డికే టెండర్ దక్కిందన్నారు. కాళేశ్వరం, మిషన్‌భగీరథ పేరుతో లక్షల కోట్లు దోచుకుతిన్న ప్రభుత్వం తమది కాదని ఆయన ఎద్దేవా చేశారు. నిరంతరం ప్రజల కోసం పని చేసే ప్రభుత్వం తమదన్నారు. కేటీఆర్‌నుద్దేశించి మాట్లాడుతూ... ఆయనకు, ఆయన బావకు అంతర్గత తగాదాలున్నాయని, అవకాశం వస్తే ఇద్దరిలో ఎవరు, ఎవరికి వెన్నుపోటు పొడుస్తారో ప్రజలకు తెలుసునన్నారు. తమపై నింద మోపే ముందు వారి పార్టీని చక్కబెట్టుకోవాలని మండిపడ్డారు. అంతకుముందు ఇల్లెందు నియోజకవర్గ స్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కబ్జాలకు గురైన ప్రభుత్వ స్థలాలు, భూములను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్కారు భూములు కబ్జాలకు గురైతే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ విధానాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను ఉపేక్షించబోమని హెచ్చరించారు. అర్హులైన పేదలందరికీ తెల్లరేషన్ కార్డులు, హెల్త్ కార్డులు జారీ చేసే ప్రక్రియ వచ్చే నెలలో ప్రారంభమవుతుందని, ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం కూడా అమలు చేయబోతున్నందున అర్హులైన పేదలను పార్టీలకు అతీతంగా గుర్తించి జాబితాలను సిద్ధం చేయాలన్నారు.

# సన్నం, దొడ్డు వడ్లు వేర్వేరుగా కొనుగోలు

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రాలు ఏర్పాటుచేసి 91.28 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు ప్రణాళిక రూపొందించింది. ఈ ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో 4,496 సెంటర్లు, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో 2,102 సెంటర్లు, ఇతరుల ద్వారా మరో 541 సెంటర్లు.. మొత్తం 7,139 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు, రైస్ మిల్లుల్లో పాత ధాన్యం నిల్వలున్న నేపథ్యంలో 40 లక్షల టన్నుల ధాన్యం నిల్వచేయటానికి గోదాములను కూడా ఏర్పాటు చేశారు. సాధారణంగా ఖరీఫ్ ధాన్యం సేకరణ అక్టోబరు చివరి వారం నుంచి మొదలవుతుంది. అయితే, ముందస్తుగా వరి నాట్లువేసి, వరి కోతలు ముందుగా జరిగే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ప్రైవేటు ట్రేడర్లు రైతులను మోసం చేయకుండా అక్టోబరు మొదటి వారం నుంచే ధాన్యం సేకరణ ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అక్టోబరు మొదటి వారంలోప్రారంభమై... జనవరి నెలాఖరు వరకు ధాన్యం సేకరణ జరగనుంది. ఖరీఫ్‌లో సాగుచేసిన మొత్తం 60.39 లక్షల ఎకరాల వరి విస్తీర్ణంలో.. 36.80 లక్షల ఎకరాల్లో సన్నరకాలు వేయగా 88.09 లక్షల టన్నుల సన్న ధాన్యం దిగుబడి వస్తుందని, 23.58 లక్షల ఎకరాల్లో రైతులు దొడ్డు రకాలు సాగుచేయగా.. 58.18 లక్షల టన్నుల దొడ్డు ధాన్యం దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. దొడ్డు రకాలను కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ)కు కొనుగోలు చేయనున్నారు. 2024-25 సీజన్‌కు గాను వరి ధాన్యం సాధారణ రకానికి క్వింటాలుకు రూ.2,300, ఏ-గ్రేడు ధాన్యానికి రూ.2,320 చొప్పున మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ఈ ఎమ్మెస్పీ కంటే సన్నాలకు క్వింటాలుకు రూ.500 అదనంగా బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఖరీఫ్ సీజన్ నుంచే ఆ నిర్ణయాన్ని అమలు చేయనుంది. ఈ లెక్కన సన్నరకాలకు క్వింటాలుకు రూ.2,800 వరకు ఉంటుంది.

### అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించం

గతంలో ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకొని మిల్లింగ్ చేసి బియ్యం ఇవ్వకుండా డిఫాల్టర్ల జాబితాలో ఉన్న రైస్‌మిల్లర్లకు ఈసారి ఖరీఫ్ సీజన్ ధాన్యం ఇచ్చేది లేదని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ టార్గెట్ పూర్తిచేయకుండా అక్రమాలకు పాల్పడిన రైస్‌మిల్లర్లను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఖరీఫ్ ధాన్యం సేకరణపై ఉత్తమ్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అధికారులు ప్రతి క్షణం అప్రమత్తంగా వ్యవహరించి సేకరణ లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటుచేయాలన్నారు. వేరే రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖరీఫ్‌లో సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి.. జనవరి నుంచి రేషన్ కార్డుల్లో ఉన్న లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు.

## కొడుకులు తిండి పెట్టట్లేదు..
## మా భూమిని తిరిగి ఇప్పించండి సారూ!

» హన్మకొండ కలెక్టరేట్‌లో ఫిర్యాదు


ఫిర్యాదు పత్రాన్ని చూపిస్తున్న వృద్ధ దంపతులు చంద్రయ్య, సారమ్మ

శాయంపేట, సెప్టెంబరు 23: ఆ వృద్ధ దంపతులకు ముగ్గురు కొడుకులు. తాము సంపాదించిన భూమిని ఆ ముగ్గురికి పంచారు. వృద్ధాప్యంలో కొడుకుల దగ్గర ఉంటూ బతుకు వెళ్లదీద్దాం అనుకున్నారు. కానీ, భూముల కొలతల్లో తేడాలున్నాయని ముగ్గురు అన్నదమ్ముల మధ్య విభేదాలు వచ్చాయి. ఆ ముగ్గురూ తల్లిదండ్రుల బాగోగులు మరిచారు. దీంతో, ఆ వృద్ధ దంపతులు.. తాము కొడుకులకు ఇచ్చిన భూమిని తిరిగి ఇప్పించాలని వేడుకుంటూ హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా పెద్దకోడెపాకకు చెందిన చెక్క చంద్రయ్య, సారమ్మ దంపతులకు భద్రయ్య, దామోదర్, ప్రసాద్ అనే ముగ్గురు కుమారులున్నారు. ఆ దంపతులు సంపాదించిన 10.05 ఎకరాల భూమిలో 1.11 ఎకరాల భూమిని తమ పేరుపై ఉంచుకుని మిగతా 8.94 ఎకరాల భూమి, పరకాలలో 3 గుంటల స్థలంలో ఇల్లును ముగ్గురికి పంచి, రిజిస్ట్రేషన్ చేయించారు. పెద్దకుమారుడు భద్రయ్యకు జ్యేష్ఠ భాగంగా 24 గుంటల వ్యవసాయ భూమి ఎక్కువగా ఇచ్చారు. అయితే, కొలతల్లో వ్యత్యాసం ఉందని అన్నదమ్ముల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భద్రయ్య, ప్రసాద్ కనీసం తిండి పెట్టకుండా, అకారణంగా కొడుతూ వేధిస్తున్నారని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను పట్టించుకోని కుమారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కలెక్టర్, ఆర్డీవోలను కోరారు.

## తెలంగాణ ఆలయాల్లో నెయ్యి నాణ్యతపై నజర్

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వివాదం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలోని ప్రముఖ ఆలయాల్లో ప్రసాదం తయారీకి ఉపయోగిస్తున్న నెయ్యి నాణ్యతపై రాష్ట్ర దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ప్రసాదం తయారీకి ఉపయోగిస్తున్న నెయ్యి నాణ్యత పరిశీలించాలని ఆలయ అధికారులకు సోమవారం లేఖ రాశారు. తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధి చెందిన యాదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంతో పాటు బాసర సరస్వతి, వేములవాడ రాజన్న ఇతర ఆలయాల్లో నిత్యం వేలాది లడ్డూలు తయారు చేసి ప్రసాదంగా విక్రయిస్తుంటారు. ఇందుకోసం నెయ్యి, ఇతర వస్తువుల్ని కాంట్రాక్టర్ల నుంచి కొనుగోలు చేస్తున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ వివాదం నేపథ్యంలో ఇక్కడి అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

## తెలుగు తేజం సతీశ్ కత్తులకు అరుదైన గౌరవం


అవార్డు స్వీకరిస్తున్న సతీశ్

బంజారాహిల్స్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): అమెరికా క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ సతీశ్ కత్తులకు అరుదైన గౌరవం దక్కింది. ప్రెసిడెంట్స్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్న తొలి తెలుగువాడిగా ఆయన ఘనత సాధించారు. మంగళవారం వాషింగ్టన్ సెనేట్ భవనంలో జోయ్ మంచిన్ చేతుల మీదుగా సతీశ్ కత్తుల ఈ అవార్డును స్వీకరించారు. అమెరికాను ఆరోగ్యవంతమైన దేశంగా మలిచేందుకు స్వచ్ఛందంగా సేవ చేస్తున్నందుకు సతీశ్‌కు ఈ అవార్డు దక్కింది. సతీశ్ కత్తుల తెలంగాణకు చెందిన వారు. 29ఏళ్లుగా ఆయన అమెరికాలో సేవలందిస్తున్నారు. అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్‌కు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.


## ఫార్మా సిటీ రైతులు రైతుబంధుకు అర్హులే

» ఆ దరఖాస్తులను అధికారులు పరిశీలించాలి: హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ భూసేకరణ నోటిఫికేషన్‌ను ఏకసభ్య ధర్మాసనం కొట్టివేసిన నేపథ్యంలో అక్కడ భూములున్న రైతులు రైతుబంధు, ఇతర పథకాలకు దరఖాస్తు పెట్టుకోవచ్చని హైకోర్టు తెలిపింది. వాటిని చట్టప్రకారం పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ఫార్మాసిటీ భూసేకరణను హైకోర్టు కొట్టేసినా భూములపై తమకు హక్కులు కల్పించడం లేదంటూ రంగారెడ్డి జిల్లాలోని మేడిపల్లి సహా పలు గ్రామాల రైతులు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. రైతుబంధు, ఇతర పథకాల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని హైకోర్టు స్పష్టతనిచ్చింది. తదుపరి విచారణ నాలుగువారాలకు వాయిదాపడింది.

## కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

### తీర్మానంచేసి కేంద్రానికి పంపుతాం: ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు, మంత్రివర్గ సమావేశంలో దీనిపై తీర్మానం చేసి కేంద్రానికి పంపనున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. జూనియర్ న్యాయవాదులకు నెలకు గౌరవ వేతనం కింద నెలకు రూ. 10 వేలు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. తమ మేనిఫెస్టోలో ఇచ్చిన ఈ హామీని అమలుచేసే ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆయన ఆదేశించారు. సోమవారం అమరావతి సచివాలయంలో న్యాయ శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. రాజధాని అమరావతిలో 100 ఎకరాల విస్తీర్ణంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ద్వారా ఇంటర్నేషన్ లా స్కూల్ ఏర్పాటుకు ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

## జెత్వానీ కేసులో ఏ2గా పీఎస్ఆర్

### ఏ3 కాంతిరాణా.. ఏ6 విశాల్‌గున్నీతోపాటు మరికొందరు

విజయవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో తాజాగా ఏ2గా అప్పటి ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు, ఏ3గా నాటి విజయవాడ పోలీసు కమిషనర్ కాంతి రాణా, ఏ6గా నాటి విజయవాడ డీసీపీ విశాల్‌గున్నీ పేర్లను చేర్చారు. ఈ ముగ్గురు ఐపీఎస్ అధికారులతో పాటు ఏ4గా ఏసీపీ హనుమంతరావు, ఏ5గా అప్పటి దర్యాప్తు అధికారి ఎం.సత్యనారాయణ, ఏ7గా న్యాయవాది, ఏ8గా నకిలీ డాక్యుమెంట్‌ను రాసిన రైటర్ పేర్లను పెట్టారు. ఈ ఎఫ్ఐఆర్ కాపీని విజయవాడలోని నాలుగో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌కు అందజేశారు. ఈ కేసులో ఇదివరకే ఏ1గా చేర్చిన విద్యాసాగర్‌ను న్యాయాధికారి ఇంటి వద్ద ఆదివారం అర్ధరాత్రి హాజరుపరిచారు. జెత్వానీ కేసు వెలుగు చూశాక పరారైన విద్యాసాగర్‌ను డెహ్రాడూన్‌లో పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అక్కడి కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ తీసుకున్నారు. ఢిల్లీ నుంచి తీసుకొచ్చి ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం న్యాయాధికారి ముందు హాజరు పరిచారు. విద్యాసాగర్‌కు వచ్చే నెల నాలుగో తేదీ వరకు రిమాండ్ విధించారు. అతడిని పోలీసులు విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. విద్యాసాగర్‌ను మరింతగా విచారించేందుకు ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు.

# సర్దుబాటుతో 4వేల మంది టీచర్ల బదిలీ!

» కసరత్తు ప్రారంభించిన విద్యా శాఖ

» 28న ప్రారంభం.. వారంలోగా పూర్తి

హైదరాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సర్దుబాటులో భాగంగా నాలుగు వేల మంది టీచర్లకు స్థానచలనం జరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ విషయమై ఇప్పటికే కసరత్తు ప్రారంభించిన విద్యా శాఖ అధికారులు... వారంలోగా ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నారు. సర్దుబాటులో భాగంగా బదిలీ అయ్యే ఉపాధ్యాయులు దసరా సెలవుల అనంతరం కొత్త పోస్టింగ్‌ల్లో చేరేలా కార్యాచరణ అమలు చేయాలని నిర్ణయించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో పాఠశాల విద్యా శాఖ అధికారులు ఇప్పటికే ఉత్తర్వులను జారీ చేశారు. దీని ప్రకారం తక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్న స్కూళ్ల నుంచి ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయనున్నారు. జిల్లా యూనిట్‌గా చేపడుతున్న ప్రక్రియను ఆయా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో 28వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉంది. ఏయే స్కూళ్లల్లో ఎంత మంది ఉపాధ్యాయులు పని చేయాలనే విషయంపై ఇప్పటికే మార్గదర్శకాలను ఖరారు చేశారు. దీని ప్రకారం... ప్రైమరీ స్కూళ్లల్లో 1-10 మంది విద్యార్థులుండే స్కూళ్లల్లో ఒక టీచర్, 11-60 మంది ఉంటే ఇద్దరు, 90 మంది ఉంటే ముగ్గురు టీచర్లు, 120 మంది విద్యార్థులుండే స్కూళ్లల్లో నలుగురు టీచర్లు, 150 మంది ఉంటే ఐదుగురు, 200 మంది విద్యార్థులుంటే.. ఆరుగురు ఉండాలి. అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్లల్లో అయితే... విద్యార్థుల సంఖ్యతో పాటు సబ్జెక్టుల వారీగా టీచర్లు ఉండాలి. ఇలా విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆయా స్కూళ్లల్లో ఎంత మంది ఉపాధ్యాయులు పని చేయాలనే విషయాన్ని ఖరారు చేశారు. ఈ మేరకు ఏదైనా పాఠశాలలో విద్యార్థుల నిష్పత్తి ప్రకారం ఉండాల్సిన సంఖ్య కన్నా ఎక్కువ మంది టీచర్లు ఉంటే.. వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయనున్నారు. వీలైనంత వరకు సమీపంలోని స్కూళ్లకు టీచర్లను బదిలీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అలా సాధ్యం కాకపోతే.... అదే మండలంలోని ఇతర స్కూళ్లకు బదిలీ చేస్తారు. ఒక వేళ ఒకే మండలంలో సర్దుబాటు చేయలేని పరిస్థితి ఎదురైతే... పక్క మండలంలో సర్దుబాటు చేయనున్నారు. సర్దుబాటులో స్కూలు మారాల్సి వచ్చే ఉపాధ్యాయుల నుంచి ఆప్షన్లను తీసుకోవాలని నిర్ణయించారు. ఇతర పాఠశాలలకు వెళ్లడానికి సమ్మతించే టీచర్లను మొదటి దశలో సర్దుబాటు చేయనున్నారు. ఆ తర్వాత కూడా టీచర్లను సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి ఉన్న స్కూళ్లల్లో సీనియారిటీ ప్రకారం ఉపాధ్యాయులను ఇతర స్కూళ్లకు మార్చాలని భావిస్తున్నారు. ఏయే స్కూళ్లల్లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు ? అక్కడ ఎంత మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారనే సమాచారాన్ని ఇప్పటికే సేకరించారు. దీని ప్రకారం ఏయే స్కూళ్ల నుంచి ఎంత మంది టీచర్లను ఇతర పాఠశాలలకు పంపించాలనే విషయంపై జాబితాను రూపొందిస్తున్నారు.

# శాస్త్రోక్తంగా శాంతిహోమం

## తిరుమల ఆలయం సహా లడ్డూ, నెయ్యి నిల్వ కేంద్రాల్లో కుంభప్రోక్షణ


తిరుమల శ్రీవారి ఆలయంలో సంప్రోక్షణలో పాల్గొన్న అధికారులు, అర్చకులు

తిరుమల, ద్వారకాతిరుమల, ఆత్మకూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రంలో శాస్త్రోక్తంగా శాంతిహోమం జరిగింది. శ్రీవారి లడ్డూ ప్రసాదం నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిన నేపథ్యంలో పరిహారంగా చేపట్టారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఆగమ పండితులు సోమవారం ఉదయం 6 నుంచి 10 గంటల మధ్య శాంతిహోమాన్ని నిర్వహించారు. లడ్డూప్రసాదాలు, ఇతర నైవేద్యాల పవిత్రత, దైవత్వాన్ని పునరుద్ధరింపజేసేందుకు శ్రీవారి ఆలయంలోని బంగారుబావి వద్ద ఉన్న యాగశాలలో వైఖానస ఆగమోక్తంగా శుద్ధి, శాంతిహోమాలను నిర్వహించారు. ముందుగా రుత్వికులు సంకల్పం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, వాస్తుహోమం, కుంభప్రతిష్ఠ, పంచగవ్య ఆరాధన, వాస్తుశుద్ధి, కుంభజాల సంప్రోక్షణ వంటి వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. పూర్ణాహుతి తర్వాత కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీవారి ఆలయంలోని ఉప ఆలయాలతో పాటు ముడిసరుకులు ఉంచే ఉగ్రాణం, లడ్డూ వితరణ కేంద్రం, లడ్డూ బూందీ తయారీ కేంద్రం, అర్చక నిలయం, వరాహస్వామి ఆలయం, పుష్కరిణి, బేడి ఆంజనేయస్వామి ఆలయం, అఖిలాండం వద్ద ప్రోక్షణ చేశారు. ప్రోక్షణం అనంతరం శ్రీవారి ఆలయం ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు, ఆగమ సలహాదారుడు మోహన రంగాచార్యులు మాట్లాడుతూ.. శాంతిహోమంలో భాగంగా వైదిక కార్యక్రమాలను ఆగమోక్తంగా నిర్వహించామన్నారు. ఇక.. లడ్డూప్రసాదాలు, నైవేద్యాలకు ఎలాంటి దోషాలు ఉండవని, భక్తులు సంతోషంగా స్వీకరించవచ్చన్నారు. టీటీడీ ఈవో శ్యామలరావు మాట్లాడుతూ.. రుత్వికులు వాస్తుశుద్ధి, కుంభజాల సంప్రోక్షణ నిర్వహించారన్నారు. శాంతి హోమం ద్వారా భక్తులు లడ్డూప్రసాదం, నాణ్యతపై ఉన్న భయాలను, అపోహలను పక్కన పెట్టవచ్చన్నారు.

### తిరుమల పవిత్రత కాపాడుతాం: ఆనం

తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ పవిత్రతను కాపాడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఏపీ దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరులోని శ్రీదేవి భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయ సంప్రోక్షణ, పూజా కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. తిరుమలలో జరిగిన అపచారం నుంచి మన్నించమని భగవంతుడిని ప్రార్థిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాల్లో మహా సంప్రోక్షణ, ఆలయ శుద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుమల ఆలయ పవిత్రను కాపాడటమే లక్ష్యంగా ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు.

### విజిలెన్స్ నోటీసులకు వివరణ ఇవ్వండి

**ఎంపీ వైవీ సుబ్బారెడ్డికి హైకోర్టు ఆదేశం**

టీటీడీ బోర్డు చైర్మన్‌గా తాను తీసుకున్న నిర్ణయాలు, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జరుపుతున్న విచారణను కొట్టివేయాలని వైవీ సుబ్బారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. తీర్పు కాపీ అందిన వారం రోజుల్లో నోటీసులకు వివరణ ఇచ్చేందుకు వీలుగా సంబంధిత దస్త్రాలను సుబ్బారెడ్డికి అందజేయాలని విజిలెన్స్ అధికారులకు స్పష్టం చేసింది. ఆ తర్వాత మూడు వారాల్లో విజిలెన్స్ అధికారుల నోటీసులకు వివరణ ఇవ్వాలని సుబ్బారెడ్డిని ఆదేశించింది. విజిలెన్స్ విచారణాధికార పరిధిని తేల్చాలంటే ప్రభుత్వ కౌంటర్ అవసరమని అభిప్రాయపడింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న సీఎస్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ, టీటీడీ ఈవోకు నోటీసులు జారీ చేసింది. విచారణను నవంబరు 4వ తేదీకి వాయిదా వేసింది.

## తిరుమల లడ్డూ రాగి చెంబు..
## పంది కొవ్వు బంగారం!

» మాజీ ఏఏజీ పొన్నవోలు భాష్యం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి వాడారంటూ దేశవిదేశాల్లో భక్తులు ఆగ్రహావేశాలతో రగిలిపోతుంటే.. వైసీపీకి చెందిన సీనియర్ న్యాయవాది, మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి దేశ రాజధాని వేదికగా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తిరుమల లడ్డూను రాగి చెంబుతో, పంది కొవ్వును బంగారంతో పోల్చి కలకలం రేపారు. నెయ్యి కంటే పంది కొవ్వే ఖరీదని, అలాంటి ఖరీదైన పంది కొవ్వును లడ్డూలో ఉపయోగించే నెయ్యిలో ఎవరైనా కలుపుతారా అని వ్యాఖ్యానించారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో సుప్రీంకోర్టు సిట్టింగ్ లేదా విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో దర్యాప్తు చేయాలని కోరుతూ టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తరఫున పొన్నవోలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాత ఆయన కోర్టు ఎదుట మీడియాతో మాట్లాడారు. తిరుపతి లడ్డూలో కలిపే నెయ్యి ఖరీదు కిలో రూ.319 అని, అదే పంది కొవ్వు మార్కెట్ ధర కేజీ రూ.1,200 ఉంటుందని తెలిపారు. వైవీ సుబ్బారెడ్డి హయాంలో ఏఆర్ ఫుడ్స్ ఎలాంటి టెండర్ దక్కించుకోలేదన్నారు. కరుణాకర్‌రెడ్డి హయాంలో ఒక్క ట్యాంకర్ కూడా సరఫరా జరగలేదని తెలిపారు. నాసిరకం నెయ్యి సరఫరా చేసిన వారిని రక్షించడం కోసం తాము ఇక్కడకు రాలేదని చెప్పారు. కోట్లాది భక్తులకు నిజం తెలియాలనే సుప్రీంకోర్టును ఆశ్రయించామన్నారు.

## ఏఆర్ ఫుడ్స్‌కు కేంద్రం నోటీసులు

తిరుమల లడ్డూలో వాడే నెయ్యి కల్తీ వ్యవహారాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణిస్తోంది. నెయ్యి సరఫరా చేసిన ఏఆర్ ఫుడ్స్ కంపెనీకి భారత ఆహార భద్రత-ప్రమాణాల విభాగం(ఎఫ్ఎస్ఎస్ఏఐ) నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. నాలుగు కంపెనీల నుంచి నమూనాలను ఈ విభాగం సేకరించిందని, నాణ్యత పరీక్షలో ఏఆర్ ఫుడ్స్‌కు చెందిన నెయ్యి విఫలం కావడంతో గత శుక్రవారమే నోటీసులు ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మరికొన్ని సంస్థలకూ షోకాజ్ నోటీసులు పంపినట్లు తెలిసింది. సంస్థల సమాధానం, రాష్ట్ర ప్రభుత్వ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటామని ఎఫ్ఎస్ఎస్ఏఐ వర్గాలు తెలిపాయి.

# అదే సందిగ్ధత!

(మొదటి పేజీ తరువాయి)

కల్పించాలని, అదే సమయంలో స్థానికతపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటించాలని సూచించింది. ఈ ఆదేశాలపై వైద్య శాఖ ఉన్నతాధికారులు న్యాయ నిపుణుల అభిప్రాయాన్ని తీసుకోగా.. వారు సైతం మార్గదర్శకాలు రూపొందించాలని స్పష్టం చేసినట్లు సమాచారం. అయినప్పటికీ ఈ అంశంపై వైద్యశాఖ ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయమూ తీసుకోవడం లేదు. మరోవైపు.. అక్టోబరు 31వ తేదీలోగా మెడికల్ కౌన్సెలింగ్ పూర్తి చేయాల్సి ఉంది. వారానికి ఒక రౌండ్ చొప్పున కౌన్సెలింగ్ చేపట్టినా.. సమయం సరిపోయే పరిస్థితి కనిపించడం లేదు. సుప్రీం తీర్పు వ్యతిరేకంగా వస్తే ఏం చేయాలన్న దానిపై ముందుగానే ఒక ప్రణాళిక సిద్ధం చేసుకోవాల్సి ఉన్నా.. ఒంటెత్తు పోకడలు, అనుభవరాహిత్యం కారణంగా ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే నాలుగు రోజుల సమయం వృథా అయింది. ఇంకా ఎన్ని రోజుల సమయం తీసుకుంటారో తెలియని పరిస్థితి ఉంది. నిజానికి ఇటువంటి విషయాల్లో నిపుణులతో కమిటీ వేయడమో, లేదంటే వారితో చర్చించి చకచకా నిర్ణయాలు తీసుకోవడమో చేయాలి. కానీ అన్నీ తమకే తెలుసు అన్న చందంగా ఉన్నతాధికారులు వ్యవహరించడం వల్లే ఈ సమస్య తలెత్తిందనన వాదన వినిపిస్తోంది. రాష్ట్రంలో సీటు వస్తుందన్న ఆశతో చాలా మంది విద్యార్థులు ఇతర రాష్ట్రాలు, ఆలిండియా కోటాకు దరఖాస్తు కూడా చేయలేదు. ఇక్కడ తీవ్ర జాప్యం నెలకొనడంతో వారిలో ఆందోళన మొదలైంది. ఒక వేళ ఇక్కడ సీటు రాకుంటే తమకున్న అన్ని రకాల ఆప్షన్స్ మూసుకుపోతాయని, ఎక్కడా చేరే పరిస్థితి ఉండదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి హైకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించుకొని ఉంటే ఇప్పటికే ఒక రౌండ్ కౌన్సెలింగ్ పూర్తయి ఉండేది. హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టుకు అప్పీల్‌కు వెళ్లి అనవసరంగా కాలయాపన చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి స్టడీ సర్టిఫికెట్‌తోపాటు ఒకవేళ ఇక్కడ చదవకుంటే విద్యార్థి తల్లిదండ్రులు పదేళ్ల పాటు తెలంగాణలోనే నివాసం ఉన్నారన్న(రెసిడెన్స్) సర్టిఫికెట్ సమర్పించాలన్న నిబంధన పెట్టి ఉంటే గొడవే ఉండేది కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం కూడా గుడ్డిగా వైద్య ఆరోగ్యశాఖలో ఒకరిద్దరు ఉన్నతాధికారులనే నమ్మి, వారిపైనే భారం వేయడంతో సమస్య జటిలమవుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలోని సరిహద్దు జిల్లాలకు చెందిన విద్యార్థుల బాధ వర్ణనాతీతంగా ఉంది. ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన విద్యార్థులు ఏపీలోని పలు జిల్లాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. ఇప్పుడు వారంతా స్థానికులు కాకుండాపోతున్నారు. వారి విషయంలోనూ ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవాలన్న విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.

## డిపార్ట్‌మెంటల్ పరీక్షల ఫీజులు పెంపు

హైదరాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) నిర్వహించే డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు సంబంధించి దరఖాస్తు, పరీక్ష ఫీజులను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ ముఖ్యకార్యదర్శి బెన్‌హర్ మహేశ్ దత్ ఎక్కా సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. టీజీపీఎస్సీ చేసిన ప్రతిపాదన మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# కొండపై ఇష్టారాజ్యం

» 'సూపర్ స్వామి' హయాంలో ఏకంగా 3.6 లక్షల మందికి వెంకన్న దర్శనాలు

» వీఐపీ సేవ పేరిట వ్యాపారం చేశారా?

» రోజూ 364 మందికి వీఐపీ దర్శనాలు

» భూమన కరుణాకర్‌రెడ్డిదీ ఇదే వరస

» 9 నెలల్లో 43వేలమందికి దర్శనాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



టీటీడీ చైర్మన్‌గా తిరుమలేశుడి భక్తిలో తరించాల్సిన వైవీ సుబ్బారెడ్డి వీవీఐపీల సేవలో రాణించారు. నిబంధనలు, పద్ధతులు అన్నవేవి ఆయనకు పట్టవన్నట్లుగా చెలరేగిపోయి, సిఫారసు లేఖలు జారీ చేశారు. అంతేనా ఆ లేఖలకు పక్కాగా దర్శనం, సేవలు దక్కేలా దగ్గరుండి చూసుకున్నారు. ఆయన చైర్మన్‌గా ఉన్న కాలంలో ఏకంగా 3.60 లక్షలమందికి వీవీఐపీ ప్రత్యేక దర్శనాలు, సేవలు కల్పించారు. రోజుకు సగటున 364 మందికి ఆయన వీఐపీ భాగ్యం కల్పించారు. టీటీడీ చరిత్రలో ఇంతలా వీవీఐపీ లేఖలు ఇచ్చి తరించిన చైర్మన్ వైవీ తప్ప మరొకరు లేరు. సగటున రోజుకు 12కు మించి సిఫారసు లేఖలు ఇవ్వకూడదని వైవీకి తెలియని విషయం కాదు అయినా ఆ నియమం పక్కనపెట్టి రోజుకు 364 మందికి ప్రత్యేక ప్రవేశ దర్శనాలు కల్పించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రత్యేక దర్శనాల పేరిట ఆయన ఏమైనా వ్యాపారం చేశారా? సిఫారసు లేఖలకు ధరకట్టి వ్యాపారం నిర్వహించారా? అన్న అనుమానాలు ఇప్పుడు బలంగా వ్యక్తమవుతున్నాయి. పరిమితికి మించి రోజుకు 300 మందిపైనే ఆయన కోటా కింద దర్శనం చేసుకోవడమే ఈ అనుమానాలకు ప్రధాన కారణమని పలువురు వెంకన్న భక్తులు సందేహిస్తున్నారు. చైర్మన్ కోటాలో ప్రత్యేక ప్రవేశ దర్శనం అంటే ఖచ్చితంగా ప్రోటోకాల్ కిందే ఉంటుంది. సకల మర్యాదలు ఉంటాయి. సామన్యులకు ఇది సాధ్యమయ్యేది కాదు. వైవీ మనుషులు మహా అంటే 50వేల మంది ఉన్నా, మిగిలిన 3.10 లక్షల మంది ఎవరన్నదే అతిపెద్ద ప్రశ్న. ఆయన లేఖల వెనుక వ్యాపార కోణం ఏమైనా ఉందా అని సందేహించడానికి ఇదీ ఓ కారణమని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే, చైర్మన్ బాటలోనే అధికారులు, సభ్యులు నడిచారు. మంత్రులయితే ఇక లెక్కేలేదు. మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సిఫారసుల లేఖలకు లెక్కేలేదు. ఒక్కో మంత్రి రోజుకు సగటున 50-70 మందిపేర్లు ప్రత్యేక దర్శనాలకు సిఫారసు చేశారు. రోజా మంత్రిగా ఉండగా తిరుమల దర్శనానికి కనీసం 40-60 మందితో వెళ్లేవారు. ఆమె వచ్చారంటే కొండపై ఓ జాతరలాగనే ఉండేది.

### భూమనదీ అదే దారి

జగన్‌కు సన్నిహితుడు, వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి 2023 సెప్టెంబరు నుంచి తొమ్మిది నెలల పాటు తిరుమల దేవస్థానం చైర్మన్‌గా పనిచేశారు. దైవభక్తిని పెంపొందించేందుకు, ఆధ్యాత్మికను నలుదిశలా వ్యాప్తింప చేసేందుకు అనేక చర్యలు తీసుకున్నట్లుగా చెబుతున్న ఆయన సిఫారసు లేఖలు, విఐపీ దర్శనాల విషయంలో వైవీకి ఏమాత్రం తీసిపోలేదు. తొమ్మిది నెలల కాలంలో భూమన 43 వేలమందికి ప్రత్యేక దర్శకాలు కల్పించారు. తిరుమలపై రద్దీ ఉన్న రోజుల్లో, వీఐపీల తాకిడి ఎక్కువగా ఉన్న సమయంలో ఆయన సగటున 172 మందికి ప్రత్యేక దర్శనాలు కల్పించారు. ఆయన కోటాలో దర్శన భాగ్యం పొందిన వారిలో అత్యధికులు రాష్ట్రేతరులే ఉన్నారు.

### గల్లీకి దించి నెయ్యి కల్తీకి దారి!

వైవీ సుబ్బారెడ్డి హయాంలో నెయ్యి టెండర్ల నిబంధనలనే అప్పటి పాలకమండలి మార్చేసింది. ప్రామాణిక సంస్థలకే పరిమితమైన నెయ్యి సరఫరాను చిన్నా చితకా వ్యాపారులకూ అవకాశం కలిగేలా నిబంధనలు సడలించింది. 2019డిసెంబరు 19న జరిగిన పాలకమండలి సమావేశంలో, మరిన్ని సంస్థలకు అవకాశం కలిగించేలా సూచనలివ్వాలంటూ (తీర్మానం 220) ఒక కమిటీని అప్పటి పాలకమండలి ఏర్పాటుచేసింది. 2020 జనవరి 23న ఆ కమిటీ ఒక నివేదిక సమర్పించింది. దానిని పర్చేజ్ విభాగానికి పంపారు. అదే ఏడాది ఫిబ్రవరి 18న పర్చేజ్ విభాగం దానికి ఆమోదం తెలిపింది. ఆ వెంటనే ఫిబ్రవరి 29న యధాతథంగా సిఫారసులన్నింటినీ ఆమోదించింది. ఇందుకనుగుణంగా టెండర్ నిబంధనలలో కొన్నింటిని సడలించింది. స్పెషల్ గ్రేడ్ ఆగ్‌మార్క్ నాణ్యత కలిగిన ఆవు నెయ్యిని ట్యాంకర్లలో కొనుగోలు చేయడానికి అమల్లో ఉన్న నిబంధనలను పాలకమండలి మార్చేసింది. దాంతో కోరుకున్న సంస్థలు నెయ్యి సరఫరాకు రంగంలోకి దిగాయి. లాభాలే లక్ష్యంగా లక్షల లీటర్ల నెయ్యిని తిరుమలకు సరఫరా చేశాయి. గత ప్రభుత్వంలో కన్నా తక్కువ ధరకే నెయ్యిని కొనుగోలు చేసి ఆదా చేస్తున్నాం అని చెప్పడం మీద దృష్టిపెట్టారు గానీ, వారు సరఫరా చేస్తున్న నెయ్యి నాణ్యత మీద శ్రద్ధ పెట్టలేదు. పాలక పెద్దల అండదండలతోనే టెండర్లు దక్కించుకున్నారు కాబట్టి టీటీడీ ఉద్యోగులు కూడా అభ్యంతరపెట్టే సాహసం ఏ దశలోనూ చేయలేకపోయారు.

# నేడు భారీ వర్షాలు

» 14 జిల్లాలకు ఎల్లో అలెర్ట్

» నిండుకుండల్లా జలాశయాలు

» 589.30 అడుగుల వద్ద సాగర్ నీటిమట్టం

» పూర్తిగా నిండిన సింగూరు జలాశయం

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో మంగళవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, గద్వాల జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మంగళ, బుధవారాల్లో తెలంగాణ వ్యాప్తంగా అక్కడక్కడా మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. రాగల 24 గంటల్లో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. సోమవారం హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. మరోవైపు సాగర్ నీటిమట్టం స్వల్పంగా తగ్గింది. సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 589.30 అడుగులు ఉంది. ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి 14,846 కూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. కుడి కాల్వ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 2,715 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,785 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం 44,020 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతుండగా ఎగువ నుంచి 14,846 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. అలాగే నల్లగొండ-సూర్యాపేట జిల్లాల సరిహద్దుల్లోని మూసీ ప్రాజెక్టు మూడు గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ మూసీ నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు రెండు రోజులుగా ప్రాజెక్టుకు వరద వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు క్రస్టుగేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 319.11 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో గల పులిచింతల ప్రాజెక్టు ఒక గేటు నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 174.86 అడుగులుగా ఉంది. సింగూరు ప్రాజెక్టుకు మళ్లీ వరద వస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు 11,656 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. దాంతో ఒక గేటు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● మంగళవారం 24 సెప్టెంబరు 2024

# ఐఐటీ తిరుపతిలో ఎంఎస్(రీసెర్చ్), పీహెచ్‌డీ

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ తిరుపతి)- ఎంఎస్(రీసెర్చ్), పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రెగ్యులర్(ఫుల్ టైమ్ స్కాలర్స్), ఎక్స్‌టర్నల్, పార్ట్ టైమ్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. రెగ్యులర్ విధానంలో ఎంపికైన అభ్యర్థులకు వివిధ స్కీమ్‌ల ద్వారా అసిస్టెంట్‌షిప్ లభిస్తుంది. ఎక్స్‌టర్నల్, పార్ట్ టైమ్ విధానాల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఉద్యోగులై ఉండాలి. కనీసం రెండేళ్ల అనుభవం; రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు/జాతీయ స్థాయి ల్యాబొరేటరీల నుంచి స్పాన్సర్‌షిప్ తప్పనిసరి.



### ఎంఎస్(రీసెర్చ్)

**విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్

**అర్హత:** ఇంజనీరింగ్/టెక్నాలజీ బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ(ఎమ్మెస్సీ/ఎంసీఏ)తో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఐఐటీల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ పూర్తి చేసినవారు కూడా అర్హులే.

### పీహెచ్‌డీ

**విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

**అర్హత:** ఇంజనీరింగ్ విభాగాలకు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ లేదా ఇంజనీరింగ్‌లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ లేదా డ్యూయెల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 8 సీజీపీఏతో ఐఐటీ నుంచి( జామ్ ద్వారా ప్రవేశం పొంది ఉండాలి) రెండేళ్ల ఎమ్మెస్సీ; సీఎఫ్‌టీఐ సంస్థ నుంచి బీఎస్+ఎంఎస్(ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్) ఉత్తీర్ణులైన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సైన్సెస్ విభాగాలకు సెంట్రల్ ఫండెడ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఎస్/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగాలకు సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ/డ్యూయెల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. యూజీసీ నెట్ లేదా జేఆర్ఎఫ్/గేట్ స్కోర్ ఉండాలి.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.400; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** నవంబరు 5 నుంచి 18 వరకు
- **క్యాంపస్ రిపోర్టింగ్:** డిసెంబరు 2
- **వెబ్‌సైట్:** https://iittp.ac.in


## సమ్మక్క సారక్క సెంట్రల్ వర్సిటీలో స్పాట్ అడ్మిషన్స్

ములుగు జిల్లాలోని సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ(ఎస్ఎస్‌సీటీయూ)- బీఏ ఆనర్స్ ప్రోగ్రామ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. ఇంగ్లీష్ స్పెషలైజేషన్‌లో 24 సీట్లు, ఎకనామిక్స్ స్పెషలైజేషన్‌లో 23 సీట్లు చొప్పున మొత్తం 47 సీట్లు ఉన్నాయి. వర్సిటీ నిర్వహించే కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఆసక్తిగలవారు నోటిఫికేషన్‌లో తెలిపిన ప్రకారం గూగుల్ ఫారమ్ నింపి సబ్మిట్ చేయాలి. ఈ వర్సిటీకి యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్) మెంటార్ వర్సిటీగా వ్యవహరిస్తోంది. యూఓహెచ్ వెబ్‌సైట్‌లో వివరాలు చూడవచ్చు.

**అర్హత:** పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు పాసైతే చాలు. సీయూఈటీ యూజీ 2024 అర్హత సాధించిన అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ మెరిట్ ఆధారంగా అవకాశం కల్పిస్తారు.

**ముఖ్య సమాచారం**

- **అభ్యర్థులు రిపోర్ట్ చేయాల్సిన తేదీ:** అక్టోబరు 3న ఉదయం తొమ్మిదిన్నరకు
- **అభ్యర్థులు తీసుకురావాల్సిన పత్రాలు:** పదోతరగతి, పన్నెండోతరగతి సర్టిఫికెట్లు; టీసీ; అభ్యర్థి ఫొటోలు; దరఖాస్తు కాపీ
- **వేదిక:** యూత్ ట్రెయినింగ్ సెంటర్, వైటీసీ బిల్డింగ్, ములుగు
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in





## అజీమ్ ప్రేమ్‌జీ వర్సిటీలో డిగ్రీ, పీజీ

బెంగళూరులోని అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ - అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. బీఏ ఆనర్స్, బీఎస్సీ ఆనర్స్, డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు; ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంపీహెచ్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇవి ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు. ఎంట్రెన్స్ టెస్ట్, ఆన్‌లైన్/పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఒక్కో డిగ్రీ ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఒక్కో పీజీ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. సంస్థ నిబంధనల ప్రకారం అర్హులకు స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.

### డిగ్రీ ప్రోగ్రామ్‌లు-స్పెషలైజేషన్ సబ్జెక్టులు

- **బీఏ సబ్జెక్టులు:** ఎకనామిక్స్, హిస్టరీ, ఇంగ్లీష్, ఫిలాసఫీ, సోషల్ సైన్స్, ఫిలాసఫీ-పాలిటిక్స్-ఎకనామిక్స్
- **బీఎస్సీ సబ్జెక్టులు:** సైకాలజీ అండ్ కాగ్నిటివ్ సైన్స్, బయాలజీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ సస్టయినబిలిటీ, ఇన్ఫర్మేషన్ సైన్సెస్ మేథమెటిక్స్, ఫిజిక్స్
- **డ్యూయెల్ డిగ్రీ ఇన్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్(బీఎస్సీ+బీఈడీ) సబ్జెక్టులు:** బయాలజీ/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/ఫిజిక్స్, ఎడ్యుకేషన్

### పీజీ ప్రోగ్రామ్‌లు-స్పెషలైజేషన్‌లు

- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** ఎడ్యుకేషన్, డెవలప్‌మెంట్, ఎకనామిక్స్
- మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ప్రోగ్రామ్
- ఎమ్మెస్సీ ఇన్ క్లయిమేట్ ఛేంజ్ అండ్ సస్టయినబిలిటీ

**అర్హత వివరాలు:** డిగ్రీలో ప్రవేశానికి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు 2025 జూలై 31 నాటికి 21 ఏళ్లు మించకూడదు.

- ఎంఏ(ఎడ్యుకేషన్/డెవలప్‌మెంట్)లో ప్రవేశానికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. ఎంఏ(ఎకనామిక్స్)లో ప్రవేశానికి డిగ్రీ స్థాయిలో ఎకనామిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. ఎంపీహెచ్‌లో ప్రవేశానికి ఏదేని డిగ్రీతోపాటు కనీసం రెండేళ్ల అనుభవం తప్పనిసరి. ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఏదేని డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులు, చివరి ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. నాలుగేళ్ల డిగ్రీ పూర్తిచేసినవారు ఈ ప్రోగ్రామ్‌ని ఏడాదిలో పూర్తిచేసే వీలుంది. వయోపరిమితి నిబంధనలు లేవు.

**ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు:** డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్‌లో రీడింగ్ కాంప్రహెన్షన్, క్వాంటిటేటివ్ రీజనింగ్ విభాగాల నుంచి ఒక్కోదానిలో 20 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఈ విభాగాలు అన్ని డిగ్రీ ప్రోగ్రామ్‌లకు కామన్‌గా ఉంటాయి. అభ్యర్థి ఎంచుకున్న డొమైన్‌కు సంబంధించి 10 స్పెసిఫిక్ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. హిస్టరీ డొమైన్ ఎంచుకున్నవారికి హిస్టరీ, ఇంగ్లీష్, ఫిలాసఫీ సబ్జెక్టుల నుంచి; సోషల్ సైన్స్ డొమైన్ ఎంచుకున్నవారికి ఎకనామిక్స్, సోషల్ సైన్స్, ఫిలాసఫీ, పీపీఈ సబ్జెక్టుల నుంచి; సైన్స్ డొమైన్ ఎంచుకున్నవారికి మేథమెటిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఫిజిక్స్, ఇన్ఫర్మేషన్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ సస్టయినబిలిటీ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం మూడు గంటలు.

- ఎంఏ(డెవలప్‌మెంట్/ఎడ్యుకేషన్), ఎంపీహెచ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్‌లో రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 15, క్వాంటిటేటివ్ రీజనింగ్ నుంచి 15, సోషల్ అవేర్‌నెస్ నుంచి 10 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఎంఏ(ఎకనామిక్స్) ప్రవేశ పరీక్షలో మైక్రో ఎకనామిక్స్, మాక్రో ఎకనామిక్స్, క్వాంటిటేటివ్ ఎబిలిటీల నుంచి ఒక్కోదానిలో 10; అనలిటికల్ ఎబిలిటీ నుంచి అయిదు చొప్పున మొత్తం 35 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఎమ్మెస్సీ ప్రవేశ పరీక్షలో క్లయిమేట్ అండ్ సస్టయినబిలిటీ నుంచి 20, క్వాంటిటేటివ్ స్కిల్స్ నుంచి 15, డేటా లిటరసీ నుంచి 15 చొప్పున మొత్తం 50 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు అడుగుతారు. అన్ని స్పెషలైజేషన్‌లకు నిర్దేశించిన ప్రకారం డిస్క్రిప్టివ్ ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.
- డిగ్రీ, పీజీ టెస్ట్‌లలో అర్హత పొందినవారిని షార్ట్‌లిస్ట్ చేసి ఆన్‌లైన్/పర్సనల్ ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. ఇంటర్వ్యూలను 2025 జనవరిలో నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లు 2025 జూలైలో ప్రారంభమౌతాయి.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 14
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** డిసెంబరు 14
- **వెబ్‌సైట్:** azimpremjiuniversity.edu.in

## వరదలు - ఒక హెచ్చరిక

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



(నిన్నటి దిక్సూచి తరువాయి)

### నీటి పారుదల విభాగాల లోపం

ఒక్కసారి ప్రకృతి ప్రకోపిస్తే, ఒక దశాబ్దం అభివృద్ధి కొట్టుకుపోయినట్లే అన్న నిపుణుల హెచ్చరికలను తాజా పాలకులు గుర్తుచేసుకోవాలి. మున్నేరు వాగు, బుడమేరులు ఒకే సమయంలో కలిసి చేసిన నష్టం అందుకు తాజా దాఖలా! ప్రపంచంలో పేరుపొందిన న్యూయార్క్, సిడ్నీ, లండన్ వంటి మహానగరాలు కూడా నదుల ఒడ్డునే ఉన్నాయి. కానీ మన నగరాలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటికి లేవు. ప్రణాళికాబద్ధమైన నగర నిర్మాణం, క్రమశిక్షణాయుతమైన ప్రజా జీవనవిధానాలు అందుకు కారణం.

దేశంలో వరదపీడిత ప్రాంతాలు చాలా ఎక్కువ. 329 మిలియన్ హెక్టార్ల(32.9 కోట్ల హెక్టార్ల) విస్తీర్ణం గల భూమిలో 40 మిలియన్ హెక్టార్ల(4కోట్ల హెక్టార్ల) ప్రాంతం వరద తాకిడికి గురవుతోంది. సముద్ర, నదీ, తటాక తీరాలు, కొండవాలు, ముంపు ప్రాంతాలు వీటి కిందకు వస్తాయి. వరదల వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలు అపారంగా ఉండి, దేశ ఆర్థికవ్యవస్థ ఎదుగుదలకు చేటుచేస్తాయి. దేశంలో సంభవించే అన్ని ప్రకృతి వైపరీత్యాల మరణాల్లో 40 శాతం వరదల వల్లే నమోదవుతున్నాయి. బంగ్లాదేశ్ తరవాత వరదలు సంభవించే దేశాల్లో భారత్ రెండోస్థానంలో ఉంది. 1980-2024 మధ్య దేశంలో దాదాపు 250 సార్లు వరదలు సంభవించాయి. వీటివల్ల దాదాపు 60 బిలియన్(ఆరువేల కోట్ల) డాలర్ల మేర ఆర్థిక నష్టాలు వాటిల్లాయని ప్రభుత్వం రాజ్యసభలో తెలిపింది. లక్షా 30వేలమంది మృత్యువాత పడగా, ప్రజలకు ఆస్తినష్టం, పశుసంపద నష్టం మరో కోణం. దేశంలోని నాలుగు కోట్ల హెక్టార్ల వరద ప్రమాద ప్రాంతం మొత్తం దేశ విస్తీర్ణంలో 12వ శాతం. కనుక వరద ముప్పు, ముంపు దేశంలో ఎక్కడైనా ముంచుకొస్తుందంటే ఒక శత్రు దేశం దండెత్తి వస్తున్నట్లే లెక్క. 2013 నాటి కేదార్‌నాథ్ పర్వత వరదలు, 2018 నాటి కేరళ వరదలు జాతికి నేర్పిన పాఠమిది. వరదల వల్ల వ్యవసాయం దెబ్బతింటుంది. పంట కోల్పోవడమే కాకుండా, ఇసుక మేటల తొలగింపు రైతులకు మోయలేని కష్టమవుతుంది. అవి పంటకు పనికి రాకుండా పోతాయి కూడా. రోడ్లు, రైలు పట్టాలు కొట్టుకుపోవడం, వంతెనలు కుంగిపోవడం, విద్యుత్ స్తంభాలు పడిపోవడం వంటివి మౌలిక సౌకర్యాల రంగానికి వాటిల్లే నష్టాలు. ఇవన్నీ ఆర్థికవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే పరిణామాలే. ఈ ఏడాది కజిరంగా జాతీయ ఉద్యానవనం వరద బారిన పడినప్పుడు ఒంటికొమ్ము ఖడ్గ మృగాలు అనేకం చనిపోవడం జీవవైవిధ్య నష్టం.

ప్రతి అయిదేళ్లకు ఒకసారి లేదా అంతకన్నా ఎక్కువ పర్యాయాలు వరద బారిన పడే ప్రాంతాలను వరద పీడిత ప్రాంతాలుగా పేర్కొంటారు. బ్రహ్మపుత్ర నదీలోయ ప్రాంతం(అసోం), గంగా నదీ లోయ ప్రాంతం(బిహార్, పశ్చిమ్‌బంగ), దామోదర నదీలోయ ప్రాంతం, గోదావరి, కావేరి, కృష్ణానది డెల్టా అలాగే సింధునది, ఉపనదుల ప్రాంతాలు వీటిలో ఉన్నాయి. పశ్చిమ కనుమలైన కేరళ, మహారాష్ట్ర కూడా వరద పీడిత ప్రాంతాల కిందకు వస్తాయి.

### వరద అంచనా, నియంత్రణ, పునరావాసం

నిన్న మొన్నటి వరకు వాన రాకడ తెలిసేది. వరుణ పూజలు, కప్పల పెళ్లిళ్లు జరిపేవారు. వాన దేవుడి ప్రార్థన పాటలు సినిమాల్లో చూసేవాళ్లం. ఇప్పుడు రోజులు మారాయి. టెక్నాలజీ వచ్చింది. ఉపగ్రహాలు మేఘాల కదలికలను, వాతావరణ సూచనలను వివరిస్తున్నాయి. ముందుగానే పొంచి ఉన్న ప్రమాదాలను అవి హెచ్చరిస్తున్నాయి. ఇందుకోసం ప్రభుత్వపరంగా కొన్ని వ్యవస్థలు కూడా ఆవిర్భవించాయి. వాటిలో ఒకటి భారత వాతావరణ వ్యవస్థ(ఇండియన్ మెటిరియాలజికల్ డిపార్ట్‌మెంట్).

### బుడమేరు


కృష్ణాజిల్లా మైలవరం ప్రాంతంలోని కొండల్లో పుట్టిన బుడమేరు విజయవాడ, గుడివాడ, ఆకివీడు ప్రాంతాల మీదుగా ప్రవహించి కొల్లేరు సరస్సులో కలుస్తుంది. పొడవు 164 కిలోమీటర్లు. వర్షాకాలంలో ఇది విపరీతంగా పొంగి విజయవాడ సమీపంలోని పొలాలు, నివాస ప్రాంతాలను ముంచెత్తుతుంది. అందువల్ల దీనిని విజయవాడ దుఃఖదాయిని అని పిలుస్తారు. ఆగస్టు నెలాఖరు రోజుల్లో కురిసిన భారీవర్షాలకు బుడమేరు పొంగింది. కాలువ పరిసరాల్లో ఆక్రమణలు విపరీతంగా రావడంతో మూడుచోట్ల గట్లు తెగి, సింగ్‌నగర్ పరిసర ప్రాంతాలను ముంచెత్తింది. 15 శాతం మేర విజయవాడ మునకకు గురైందని అంచనా. ఇదే సమయంలో కర్ణాటక నుంచి ఎగువ అన్ని ప్రాజెక్టులు నిండి నీళ్లు వదలడం, ఉపనది మున్నేరు పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురవడం వల్ల వరదలు పోటెత్తి విజయవాడ వద్ద కృష్ణానదిలో చరిత్రలోనే రికార్డు స్థాయిలో 11.48 క్యూసెక్కుల జల ప్రవాహం ఉధృతంగా మహోగ్రంగా కదిలింది. అదృష్టవశాత్తు నెమ్మదిగా శాంతించడంతో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. కానీ బుడమేరు ప్రజలకు కలిగించిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఒకేసారి బుడమేరు, కృష్ణానది తెచ్చిన కష్టాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని మేలుకొలిపాయి. అలాగే ఖమ్మంలో మున్నేరు బీభత్సం సృష్టించింది. దీంతో అక్కడ ఆక్రమణలపై తెలంగాణ సర్కారు దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది.

### యాగి తుపాను

2024 సెప్టెంబరు 17న వియత్నాంలో 'యాగి' తుపాను విలయాన్ని సృష్టించింది. గంటకు 149 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడం, ఆకస్మికంగా కురిసిన కుండపోత వర్షం వల్ల భారీగా ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించాయి. ఈ తుపాను ఫిలిప్పీన్స్, చైనా, లావోస్, మయన్మార్, థాయ్‌లాండ్, చైనా దేశాలపై కూడా ప్రభావం చూపించింది.

### మిషన్ మౌనం

పర్యావరణ మార్పుల కారణంగా ఊహించని వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కృత్రిమమేధ, మిషన్ లెర్నింగ్ వంటి సాంకేతికతలను వీటిని అంచనా వేయడానికి భారత ప్రభుత్వం సంకల్పించింది. ముందస్తు, కచ్చితమైన అంచనాలు వేయడానికి భారత వాతావరణశాఖ, ఉష్ణమండల వాతావరణ కేంద్రం, మధ్యస్థశ్రేణి వాతావరణ ముందస్తు అంచనాల కేంద్రం కలిసి పనిచేస్తాయి. దీనికోసం భారత ప్రభుత్వం రానున్న అయిదు సంవత్సరాల్లో రెండువేల కోట్లతో కార్యాచరణ అమలుకు రంగం సిద్ధం చేసింది.



హైదరాబాద్ నగరంలో ఆక్రమణలకు గురైన చెరవులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధుల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చి చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక సంస్థనే హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ). ఇటీవల ఈ సంస్థ అనేక అక్రమ నిర్మాణాలను కూల్చి, చెరువుల స్థలాలను పునరుద్ధరించడం మనం చూశాం. ఇది రాష్ట్రంలో ఇతర పట్టణాలకు, దేశానికి కూడా అవసరం.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్


## లిటిల్స్

### దేవుని ఏర్పాటు




ముకుందాపురంలో ఉండే రవి అనే యువకుడికి దేనికైనా, ఎవరికైనా వంకలు పెడుతూ అది అలా ఎందుకుంది? ఇది ఇలా ఎందుకు ఉంది? అని వాదించడం అలవాటు. ఊరి వారంతా ఏదో రకంగా అతనికి మంచి బుద్ధి వస్తే బాగుండు అనుకునే వారు. ఒకరోజు రవి అడవి మార్గంలో నడిచి వెళుతూ, ఒక పెద్ద మర్రి చెట్టును, ఇంకా ఆ పక్కనే నేలమీద పాకుతున్న గుమ్మడి తీగను, దానికి కాసిన కాయలను చూసాడు. వెంటనే తన సహజమైన బుద్ధితో ఇదేమి సృష్టి? ఇలా ఉంది? అంత పెద్ద చెట్టుకు అంత చిన్న కాయలు కాయడం, ఇంత సన్నని తీగకు ఇంత పెద్ద కాయలు కాయడం ఏమీ బాలేదు అనుకున్నాడు. ఆ చెట్టు నీడ, దాని చల్లదనం చూసి, కాసేపు విశ్రాంతి తీసుకుందాం అని ఆ చెట్టు కింద పడుకొని అలాగే నిద్ర పోయాడు. రవి నిద్ర లేచేసరికి, తన మీద కొన్ని చిన్న చిన్న మర్రి కాయలు పడి ఉన్నాయి. అవి తను నిద్ర పోతూ ఉండగా చెట్టు మీదనుండి రాలి తన మీద పడ్డాయని గ్రహించాడు రవి. వెంటనే అతనికి హఠాత్తుగా నిద్ర పోవడానికి ముందు తాను సృష్టి గురించి తప్పుగా అనుకున్నది గుర్తు వచ్చింది. 'నిజంగా అంత పెద్ద గుమ్మడికాయలు ఈ మర్రిచెట్టుకు కాసి ఉంటే, అంత ఎత్తునుండి అవి నామీద ఈ మర్రి పళ్ల లాగా పడి ఉంటే నేను ఏమైపోయేవాడినో' అనుకొని, దేవుని సృష్టి ఆయన చేసిన ఏర్పాట్లు వంక పెట్టడానికి వీలు లేనంత మంచివి అనుకొని లేచి, తన ఊరికి వెళ్లిపోయాడు. ఆ రోజు మొదలుకొని అన్నిట్లో లోపాలు వెతకడం మానుకున్నాడు రవి.

### 10 తేడాలను కనిపెట్టండి




### ఎన్ని జంతువులు ఉన్నాయి?




### సరైన నీడ ఏది?



### దారి కనుక్కోండి



### డైలీ సుడోకు - 417

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 9 | 4 | | | 5 | |
| 8 | 4 | | | | | | 3 | 7 |
| | 5 | 9 | | | 8 | | | 3 |
| 5 | | | | 1 | | 2 | 7 | |
| | | | | | | | | |
| | 3 | 8 | | 5 | | | | 1 |
| 3 | | | 8 | | | 9 | 4 | |
| 4 | 2 | | | | | | 8 | 6 |
| | 9 | | | 3 | 5 | | | |

### సుడోకు - 416 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 1 | 7 | 4 | 6 | 8 | 3 | 9 | 5 |
| 4 | 3 | 9 | 5 | 7 | 2 | 8 | 6 | 1 |
| 5 | 8 | 6 | 1 | 3 | 9 | 2 | 7 | 4 |
| 3 | 9 | 2 | 6 | 4 | 5 | 1 | 8 | 7 |
| 6 | 4 | 5 | 8 | 1 | 7 | 9 | 2 | 3 |
| 8 | 7 | 1 | 2 | 9 | 3 | 4 | 5 | 6 |
| 1 | 6 | 8 | 9 | 5 | 4 | 7 | 3 | 2 |
| 7 | 2 | 4 | 3 | 8 | 6 | 5 | 1 | 9 |
| 9 | 5 | 3 | 7 | 2 | 1 | 6 | 4 | 8 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.